ప్రతిపక్షం

www.prathipaksham.in

సోమవారం 01.12.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 251 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu



విరాట్ విధ్వంసం.. టీమిండియా విజయం 12



చైనా, జపాన్, జర్మనీ, సింగపూర్, కొరియా

మా రోల్ మోడల్

అన్ని రంగాల అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్లు

ప్రజల భాగస్వామ్యంతోనే రూపొందించాం

- ఉమ్మడి జిల్లాలలో ప్రజాపాలన ఉత్సవాలు
- 9న తెలంగాణ రైజింగ్2047 ఆవిష్కరణ
- పెట్టుబడులకు రక్షణ, యువతకు ఉపాధి
- కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్
- మూడు కీలక విభాలుగా రాష్ట్రం విభజన
- 'ప్యూర్' 'ఫేర్' అవతల 'రేర్' రీజియన్లు
- అన్ని రంగాల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు
- మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 30 : ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడి తెలంగాణాను అభివృద్ధి పరిచేందుకు ముందస్తుగా పక్కా ప్రణాళికలతో ముందుళ్లేందుకు నిర్ణయించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047'పై సీఎం రేవంత్ రెడ్డి మంత్రులు, ఉన్నతాధికారులతో ఆదివారం నాడు సచివాలయంలో సమీక్ష జరిపిరు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు తాము అభివృద్ధి చెందిన చైనా, జపాన్, జర్మనీ, సింగపూర్, కొరియాతో పోటీ పడబోతున్నామన్నారు. ప్రజాపాలన రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, సజావుగా పాలన సాగేందుకు సహకరించిన మీడియా ప్రతినిధులు, మీడియా సంస్థలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రభుత్వం గతాన్ని ఓ అనుభవంగా, అనుభావాల నుంచి నేర్చుకున్న పాఠాన్ని భవిష్యత్ కు

..:: మిగతా 2లో

బీసీలకు నయవంచన

కాంగ్రెస్, బీజేపీలే కారణం



- మీరు సర్పంచ్ సీటు ఇవ్వకుంటే
- మేం సీఎం సీటు గుంజుకుంటాం
- 42 శాతం కూడా బూటకమని తేలింది
- అఖిలపక్షంతో సీఎం ఢిల్లీకి వెళ్లాల్సిందే
- లేకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తాం
- రాష్ట్రానికి రాహుల్ గాంధీ ఏ ముఖంతో వస్తారు?
- పార్లమెంటును ముట్టడించే బాధ్యత కాంగ్రెస్ దే
- బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 30 : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని నమ్మించి మోసగించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. , అసెంబ్లీలో మద్దతిచ్చి కేంద్రంలో బీసీ బిల్లుకు మద్దతు ఇవ్వకుండా బీసీలను నయవంచన చేసిన చరిత్ర బీజేపీకే దక్కుతుందన్నారు. తెలంగాణ బీసీ జేఏసీ ఇచ్చిన 'చలో హైదరాబాద్' పిలుపు మేరకు బీసీల రాజకీయ యుద్ధ బేరి మహాసభ హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద ఆదివారం జరిగింది, ఈ మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది కదిలి వచ్చారు. బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, టిఆర్ఎస్ శాసన సభ పక్ష నేత సిరికొండ మధుసూదనా చారి, మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్, తెలంగాణ క్రాంతి అధ్యక్షులు పృధ్వి రాజ్ యాదవ్, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జనాభాలో 60 శాతం పైగా ఉన్న బీసీలకు రాజ్యాధికారం తగ్గకుండా కుట్ర చేస్తున్నారని, బీసీలు సర్పంచ్ లు

..:: మిగతా 2లో



నేటి నుండి పార్లమెంట్ సమావేశాలు

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1 నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 19 వరకు జరిగే ఈ సమావేశంలో మొత్తం 15 పనిదినాలు ఉంటాయి. సాధారణంగా ఇవి 20 ఉంటాయి.

11



ఏజేఎల్‌ను కుట్రతో లాక్కున్నారు!

సోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)ను కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని ఢిల్లీ పోలీసు శాఖలోని ఆర్థిక నేరాల విభాగం ఆరోపించింది. ఈ మేరకు ఎఫ్ఐఆర్‌ను దాఖలు చేసింది.

11

ప్రధాని, రాహుల్, ఖర్గేకు సమ్మిట్ ఆహ్వానం

- స్వయంగా ఆహ్వానించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- అన్ని రాష్ట్రాల సీఎంలు సహా ప్రముఖులకు ఆహ్వానం
- ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఆహ్వాన కమిటీ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 30 : ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 8, 9వ తేదీలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులను ఆహ్వానించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానమంత్రి మోడీ, విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా కలిసి

..:: మిగతా 2లో



హిల్టిప్ పేరుతో 5 లక్షల కోట్ల భూ కుంభకోణం



- కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో రాష్ట్రానికి నష్టం
- రాహుల్ మౌనం ఆమోదానికి సంకేతం
- తెలంగాణ ప్రజల ఆస్తులను కాపాడాలి
- రాహుల్ గాంధీకి కేటీఆర్ బహిరంగ లేఖ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 30: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీకి ఆదివారం బహిరంగ లేఖను రాశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రవేశ పెట్టిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీని స్వతంత్ర భారతదేశంలోనే అతిపెద్ద భూ కుంభకోణాలలో ఒకటిగా అందులో అభివర్ణించారు. అత్యంత అవినీతితో కూడుకున్న ఈ విధానం తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర ఆందోళన, అనుమానాలు కలిగించిందని, రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాల గురించి కాంగ్రెస్ అధిష్టానానికి తెలుసా, లేకుంటే తెలిసి కావాలని మౌనంగా ఉన్నదా అని తెలంగాణ ప్రజలు ప్రశ్నిస్తున్నారని కేటీఆర్ నిలదీశారు. ఈ అవినీతి విధానం కారణంగా అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలు వాటి అసలు మార్కెట్ విలువలో నామమాత్రపు ధరకే పూర్తిగా సొంతం చేసుకోవడాని వీలు కల్పిస్తుందని, దీనివల్ల తెలంగాణ ప్రజలకు ఐదు లక్షల కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కూడా హెచ్చరించారు. బాలానగర్, జీడిమెట్ల, సనత్‌నగర్, ఉప్పల్, మల్లాపూర్, రామచంద్రాపురం, హయత్‌నగర్ వంటి కీలక క్లస్టర్‌లలో మునుపటి ప్రభుత్వాలు సుమారు 9,300 ఎకరాల పారిశ్రామిక భూమిని కేటాయించాయని లేఖలో వివరించారు. ఈ భూములను మొదట పారిశ్రామిక వృద్ధి, ఉపాధి కల్పన, దీర్ఘకాలిక ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించడానికి రాయితీ ధరలకు ఇచ్చారని పేర్కొన్నారు. అయితే, కొత్త హిల్టిప్ కింద, పారిశ్రామిక భూములను కలిగి ఉన్నవారు ఇప్పుడు ఆ భూములను వాణిజ్య లేదా నివాస జోన్‌లుగా మార్చుకోవడానికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం విలువలో 30 శాతం మాత్రమే చెల్లిస్తే చాలు అని ఆరోపించారు. ప్రస్తుత మార్కెట్ ధరలు చాలా రెట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ, ఈ విధానం ప్రజలకు దక్కాల్సిన ఆస్తులను తక్కువ ఖర్చుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి, లక్షల కోట్ల విలువైన భూమిని నామమాత్రపు ధరకు క్రమబద్ధీకరిస్తుందని కేటీఆర్ లెక్కలు ఆరోపించారు. వేల కోట్ల విలువైన ఆస్తుల మార్పిడికి 45 రోజుల్లో ఫాస్ట్‌ట్రాక్ ఆమోదాలు ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయంపై కూడా కేటీఆర్ సందేహాలు వ్యక్తం చేశారు. ఇంత తొందరపాటుతో కూడిన ప్రక్రియలో

..:: మిగతా 2లో



గాజాలో 70 వేలు దాటిన మృతుల సంఖ్య

ఇజ్రాయెల్ సైనిక దాడుల్లో పాలస్తీనియన్ల మరణాలు 70 వేలు దాటిందని గాజా ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. అక్టోబర్ 10న కాల్పుల విరమణ కుదిరినప్పటికీ, ఇజ్రాయెల్ సైనిక దాడులు కొనసాగుతున్నాయి.

11



ఛత్తీస్‌గఢ్‌లో 37 మంది మావోయిస్టుల లొంగుబాటు

- వారిలో 12 మంది మహిళలు
- 27 మందిపై రివార్డు.. మొత్తం రూ. 65 లక్షలు

ప్రతిపక్షం బ్యూరో, ఉత్తర తెలంగాణ, నవంబర్ 30: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దక్షిణ భాగంలో ఉన్న దంతేవాడ జిల్లాలో ఆదివారం ముఖ్యమైన పరిణామం

..:: మిగతా 2లో



యూకేలో భారత విద్యార్థి దారుణ హత్య

యూకే లో భారత్‌కు చెందిన విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. వోర్‌స్టర్ ప్రాంతంలో నవంబర్ 25న ఈ ఘటన జరిగింది. హర్యానాకు చెందిన విజయ్ కుమార్ షియోరాన్ (30) అనే యువకుడిపై దుండగులు కత్తులతో దాడి చేశారు.

11

రాష్ట్రీయం





భళా 'కరీంనగర్ కళ'

- ప్రధాని నోట కరీంనగర్ మాట
- మన్ కి బాత్ లో కరీంనగర్ కరీంనగర్ ఫిలిగ్రి కళాకృతుల ప్రస్తావన



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 30: కరీంనగర్ వెండి సాంప్రదాయ కళాకృతుల (ఫిలిగ్రి వర్క్)ను ప్రధాని మోదీ ఎంతగానో ప్రోత్సహించారు. ప్రపంచానికి కరీంనగర్ వెండి కళాకృతులను మోడీ పరిచయం చేశారు. ఆదివారం ప్రసారమైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 128 వ మన్ కీ బాత్ కార్యక్రమంలో కరీంనగర్ వెండి సాంప్రదాయ కళాకృతుల గురించి ప్రధాని మోదీ ప్రస్తావించారు. జీ 20 సమావేశాల సందర్భంగా కరీంనగర్ లో తయారైన సాంప్రదాయ కళాకృతులను ప్రధాని మోదీ వివిధ దేశాలకు చెందిన ప్రధాన మంత్రులకు బహుకరించిన విషయం తెలిసిందే. అదే విషయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 128 వ మన్ కీ బాత్ ప్రోగ్రాం సందర్భంగా పీఎం మోడీ కరీంనగర్ ప్రస్తావన తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ లోని కరీంనగర్ లో తయారైన సాంప్రదాయ కళాకృతులు ఎంతో పేరు, ప్రతిష్ట తీసుకువచ్చాయని కొనియాడారు. కరీంనగర్ లో సిల్వర్ తో తయారైన బుద్ధుడి ప్రతిమను జపాన్ ప్రధాని కి, పూల ఆకృతితో ఉన్న సిల్వర్ మిర్రర్ ను ఇటలీ ప్రధానికి బహుకరించిన విషయాన్ని ప్రధాని మోదీ మన్ కీ బాత్ సందర్భంగా ప్రస్తావించారు.

ప్రధాని, రాహుల్, ఖర్గేకు సమ్మిట్ ఆహ్వానం

మొదటిపేజీ తరువాయి

ఆహ్వానించనున్నారు. కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, దిగ్గజ పారిశ్రామికవేత్తలు, ప్రముఖ ఆర్థికవేత్తలు, క్రీడాకారులు, మీడియా ప్రముఖులు, దౌత్యవేత్తలు, వివిధ రంగాల నిపుణులను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించనుంది. సదస్సుకు ఆహ్వానించే వారి స్థాయికి తగినట్లు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు ఆహ్వానాలు అందించనున్నారు. ఇందుకోసం ఆహ్వాన కమిటీని నియమించనున్నారు. ఈ ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వెబ్ సైట్ ఏర్పాటు చేస్తారు. ఎవరిని ఆహ్వానించారు! ఎవరు ఆహ్వానించారు! వారి రాకను నిర్ధారించడం, వచ్చే వారికి తగిన వసతులు కల్పించడంతో పాటు వారికి లైజనింగ్ చేసేందుకు ఉన్నతాధికారుల నియామకం అన్నింటిని ఆహ్వాన కమిటీ నిర్ధారించనుంది. ఆహ్వాన కమిటీని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ సమన్వయం చేయనున్నారు. ఆహ్వానాలకు సంబంధించి వివరాలను డ్యాష్‌బోర్డ్ ద్వారా సీఎం పర్యవేక్షించనున్నారు. వివిధ రంగాలకు సంబంధించి ఇప్పటికే 4,500 మంది ప్రతినిధులకు ఆహ్వానాలు పంపామని.. అందులో వెయ్యి మంది ఇప్పటికే తమ రాకను నిర్ధారించారని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన తెలిపారు.

హిల్టిప్ పేరుతో 5 లక్షల కోట్ల భూ కుంభకోణం

మొదటిపేజీ తరువాయి

పారదర్శకతలేదని, కేవలం డబ్బులు దండుకోవాలని మాత్రం వలననే సరైన విచారణ లేకుండానే ఈ భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారా దత్తం చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం యొక్క తొందరపాటుతనం, ఈ మొత్తం పాలసీలో దాగున్న రాజకీయ అవినీతి అనేక ప్రశ్నలను లేవనెత్తుతుందని కేటీఆర్ అన్నారు.

ఒప్పుకునేది లేదు

కాంగ్రెస్ పార్టీ తన అవినీతి కోసం తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెడతామంటే ఒప్పుకునేది లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పైన టిఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తూనే ఉంటుందన్నారు. తను రాస్తున్న ఈ బహిరంగ లేక కు రాహుల్ గాంధీ మరియు కాంగ్రెస్ పార్టీ ఇచ్చే సమాధానం తెలంగాణ ప్రయోజనాలను కాపాడే విధంగా ఉంటుందా లేదా ప్రజల ఆస్తులను దోచుకుంటున్న తమ పార్టీ నేతలకు అండగా నిలబడేలా మౌనం మాత్రమే సమాధానంగా వస్తుందా అన్నది ప్రజలు గమనిస్తారని కేటీఆర్ తన లేఖన ముగించారు.




ఛత్తీస్‌గఢ్‌లో 37 మంది మావోయిస్టుల లొంగుబాటు

మొదటిపేజీ తరువాయి

చోటుచేసుకుంది. పోలీసుల 'లోన్ వార్' పథకం ప్రభావంతో మొత్తం 37 మంది మావోయిస్టులు స్వచ్ఛందంగా ప్రధాన ధారలోకి వచ్చే నిర్ణయం తీసుకున్నారు. వీరిలో 12 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో 27 మంది పైగా రివార్డు ప్రకటించినవారే అని అధికారులు వెల్లడించారు. ఈ రివార్డు మొత్తం విలువ రూ. 65 లక్షలు. వీరిలో కొందరు ఏరియా కమిటీ సభ్యులు, కీలక కమాండర్లు, మిలిషియా ఇన్‌ఛార్జీలు, అలాగే ఫ్రంట్ ఆర్గనైజేషన్లలో పనిచేసిన వ్యక్తులు ఉన్నారు. సద్దుసుమారు రెండు దశాబ్దాలుగా అడవుల్లో కార్యచరణ జరిపిన కొందరు సభ్యులు కూడా లొంగిపోయిన వారిలో ఉన్నట్లు సమాచారం. పోలీసు ఉన్నతాధికారులు మాట్లాడుతూ "మావోయిస్టులపై నిఘాను కట్టుదిట్టం చేయడం, అభివృద్ధి కార్యక్రమాల విస్తరణ, గ్రామీణ ప్రజల అవగాహన ఈ మూడింటి కలయికతో మావోయిస్టుల కార్యకలాపాలు గణనీయంగా తగ్గుతున్నాయి. ఈరోజు లొంగిపోయిన వారు కూడా శాంతి, సాధారణ జీవితమే తమకు కావాలని చెప్పారు" అని వెల్లడించారు.

లొంగిపోయిన వారికి ప్రభుత్వ హామీలు

తక్షణం రూ. 50,000 ఆర్థిక సాయం, ఉద్యోగ భద్రత, వ్యవసాయ భూమి కేటాయింపు, వృత్తి శిక్షణ,ఇళ్ల నిర్మాణానికి సహాయం కల్పించినట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం, లొంగుబాటు చేసిన వారికి పునరావాస పథకాల కింద సమగ్ర సహాయం అందించబడుతుంది. వారి కుటుంబ సభ్యుల భద్రత, జీవనోపాధికి కావాల్సిన అన్ని సదుపాయాలు కూడా కల్పించబడనున్నాయి.ఈ లొంగుబాటు ఘటన మరోమారు చెత్తీస్‌గఢ్‌లో నక్సల్ తీవ్రత క్షీణిస్తున్న దిశగా సంకేతమని అధికారులు పేర్కొన్నారు.



పింఛను పంపిణీ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలి. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అందరికీ చేరవేయాలి. ఉగాది నాటికి మరో 5 లక్షల ఇళ్లను ప్రజలకు అందిస్తాం. ప్రతీ అర్హుడైన పేదవాడికీ సొంత ఇల్లు ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం. గత పాలకుల విధ్వంసంపై ప్రజల్లో ఇంకా చర్చ జరగాలి.

- ఏపీ సీఎం చంద్రబాబు

చైనా, జపాన్, జర్మనీ, సింగపూర్, కొరియా

మా రోల్ మోడల్

మొదటిపేజీ తరువాయి

తీర్చి దిద్దేందుకు ప్రణాళికలను రూపొందించామన్నారు. రెండేళ్ల ప్రజా పాలన ఉత్సవాలు జరుపుకోవడంతో పాటు భవిష్యత్ ప్రణాళికలు రూపొందించి ఓ పాలసీ డాక్యుమెంట్ ను జాతికి అంకితం చేస్తున్నామన్నారు. ఈ పాలసీ డాక్యుమెంట్ల తయారీలో రాష్ట్రం, దేశంలోని దిగ్గజాలు, ప్రజలను, మేధావులు, ఉద్యోగులను భాగస్వామ్యం చేశామన్నారు. దీంతో పాటు ప్రపంచ దేశాల దిగ్గజాలచే మన యువతకు ఉపాధి, బలమైన ఆర్థిక రాష్ట్రంగా ముందుకువ వెళ్లందుకు, సంక్షేమం కార్యక్రమాలు అమలు చేసేందుకు డాక్యుమెంట్ విడుదల చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించడంతో పాటు సంక్షేమాన్ని ముందుకు తీసుకెల్లేందుకు విజన్ ఉండాలన్నారు. ఈ విజన్ ను , ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి సాధించాలంటే పాలసీలుండాలన్నారు.

పెట్టుబడులకు రక్షణ లేకపోవడంతో

పెట్టుబడులకు రక్షణ లేకపోవడంతో రాష్ట్రానికి నష్టం జరుగుతోందని సీఎం అన్నారు. విజన్ డాక్యుమెంట్ లో లక్షలాది మందిని భాగస్వామ్యం చేశాం. ప్రపంచంలో పేరున్న వారిని పాలసీ డాక్యుమెంట్ లో భాగస్వామ్యం చేశాం. భవిష్యత్ ప్రణాళికలు రూపొందించాం. స్ట్రాటజీ తీసుకున్నాం. రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించాం. అవుటర్ ఓ మణిహారంగా అప్పటి సీఎం వైఎస్ చేశారన్నారు. నేడు మరో మణిహారంగా రీజినల్ రింగ్ రోడ్డు రాబోతున్నదన్నారు. నగరంతో పాటు వెలుపల ఉన్న ప్రాంతాల అభివృద్ధి ఓ గందరగోళంగా మారిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా జరగకూడదన్న నెపంతో ఔటర్ రింగ్ రోడ్డులోపల ఉన్న మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీ లో విలీనం చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఔటర్ లోపలి భాగాన్ని అభివృద్ధి చేసుకునేందుకు కోర్ అర్బన్ ఎకానమిగా, మూసీ కాలుష్యం, పారిశ్రమలు, వాహన కాలుష్యం, ఎన్నో రకాల కాలుష్యం ఉంది. వీటిని తరలించడంతో కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. దేశంలోని మెట్రోపాలిటన్ నగరాలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. పారదర్శక నిర్ణయాల ద్వారా భవిష్యత్ లో ఎలాంటి సమస్యలు రాకుండా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని దీంతో సంక్షోభం దరిచేరదన్నారు. . కాలుష్య కారక పరిశ్రమలను బయటికి తరలింపు...మెట్రోరైలు విస్తరణ, మూసి ప్రక్షాళన, రోడ్ల విస్తరణ, కాలుష్య పరిశ్రమలు తరలింపు చేయబోతున్నట్లు తెలిపారు.

రెండేళ్ల పాలనా విజయోత్సవాలు

రెండేళ్ల ప్రభుత్వ పాలనా విజయోత్సవాలను ఉమ్మడి జిల్లాలలో నిర్వహించబోతున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రెండేళ్లో ప్రజా పాలన ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు, దేశానికి తెలియజేయాలనివిజయోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 9తో రెండేళ్లు పాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ఉత్సవాలు ప్రారంభించుకోవాలని నిర్ ణయించామని తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ సీఎం రేవంత్ రెడ్డి ఉత్సవాలను లంచనంగా ప్రారంభిస్తారన్నారు. 2న. ఖమ్మం ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున విజయోత్సవాలు నిర్వహిస్తామని భట్టి తెలిపారు.

బీసీలకు నయవంచన

మొదటిపేజీ తరువాయి

కాకుండా ఓర్పులను కోర్టులను వేదికలుగా చేసుకుని బీసీ రిజర్వేషన్ల వ్యతిరేకులు బీసీల నోటికాడు ముద్దను లాగేసుకున్నారని మండిపడ్డారు. సర్పంచ్ సీటు ఇవ్వని అగ్రకులాల సీఎం సీటు ను గుంజుకుందామని, వచ్చే 2028 ఎన్నికలు బీసీ లు అంత ఐక్యమై రాజకీయ అధికారం సాధించుకుందామని ఆయన పిలుపునిచ్చార.


సాక్షాత్తు బీసీ కమిషన్ సీఎంకు లేఖ



అన్యాయం జరిగిందని సాక్షాత్తు బీసీ కమిషన్ సీఎంకు లేఖ రాసిందని శ్రీనివాస్ గౌడ్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికైనా బీసీలకు చిత్తశుద్ధి ఉంటే సీఎం నేతృత్వంలో అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లాలని డిమాండ్ చేశారు, బీసీలకు అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ వైఖరి వైఖరి పై రాహుల్ ఇప్పటివరకు స్పందించకపోవడం బాధాకరమన్నారు, ఏ మొహం పెట్టుకుని ఈసారి తెలంగాణకు పర్యటనకు వస్తారని నిలదీశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ మొదటి ముద్దాయి అయితే రెండవ ముద్దాయి బిజెపిని, రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు చట్టం చేసినప్పుడు మద్దతు ఇచ్చిన బిజెపి ఢిల్లీలో చట్టం ఆమోదించే బాధ్యత ఉన్నప్పటికీ నేటి వరకు చట్టం ఆమోదించకుండా బీసీలకు ద్రోహం తలపెడుతుందని ఆయన ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు నెలలుగా రాష్ట్రంలో బీసీలు పోరాడుతున్నారు, ఢిల్లీ ప్రభుత్వంతో తేల్చుకోవడానికి డిసెంబర్ 8, 9 ఢిల్లీలో పార్లమెంటు వేదికగా పోరాటాని ప్రారంభిస్తామని, జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా బీసీల రథయాత్ర నిర్వహించి, ఫిబ్రవరిలో లక్షల మందితో హైదరాబాద్ ను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు సిరికొండ మధుసూదనాచారి, వి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు అన్యాయం చేయడంలో కాంగ్రెస్ పార్టీకి ఈ దేశంలో ఎవరు సాటి లేరని, నాటిని ఎవరూ కాంగ్రెస్ నుండి నేటి రాహుల్ కాంగ్రెస్ వరకు బీసీలకు ద్రోహం చేశారని, కుక్క తోక వంకర అన్న చందంగా బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ బుద్ధి మారలేదని వారు తీవ్రంగా ధ్వజమెత్తారు. ఈటల రాజేందర్ సందేశం అందించారు. బీసీ జేఏసీ చేస్తున్న పోరాటానికి తన వంతుగా పూర్తి మద్దతు ఉంటుందని, బీసీలకు గ్రామపంచాయతీ ఎన్నికల్లో జరిగిన మోసాన్ని బీసీలు గ్రహించి, ప్రస్తుతం జరిగే సర్పంచ్ ఎన్నికలలో జనరల్ స్థానాలను కూడా బీసీలు బరిలో ఉండి గెలిపించుకొని బీసీల రాజకీయ ఐక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కురుమ, బిసి జేఏసీ కో చైర్మన్ శేఖర్ సగర, జేఏసీ నేతలు బిటి మల్లయ్య, వీరస్వామి, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి మని మంజరి, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చంద్రశేఖర్ గౌడ్, జిల్లాల నరసింహ, ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వర్, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, వడ్లకొండ వేణుగోపాల్, దాసరి ఉష, డాక్టర్ రూపన రమేష్, మెట్టు బంగారం, జుర్రిగల శ్రీనివాస్, ఎక్కాల దత్తు, నాగుల కనకయ్య, నల్ల సోమ మల్లయ్య, ఈగ శ్రీనివాస్ గౌడ్, తారకేశ్వరి, శివమ్మ, బీసీ జేఏసీ కన్వీనర్ జాజుల లింగ గౌడ్, ఓయూ జేఏసీ చైర్మన్ బొల్లెపల్లి స్వామి, రావులకోల్ నరేష్‌ప్రజాపతి, పాలకూరి కిరణ్, తదితరులు ప్రసంగించారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపొద్దు

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం



"గతంతో హెచ్ఐవీ పై చర్చకు దారి తీసిన 'పులి రాజాకి ఎయిడ్స్ వస్తుందా?' అనే స్లోగన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బాగా ఫేమస్. ఇప్పుడు ఆ తరహా ప్రచారం ఎక్కువగా కనిపించడం లేదనే మాటలో వాస్తవం ఉన్నప్పటికీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ జరుగుతున్న ప్రచారం ఎక్కువగానే ఉంది. అయితే దాని తీరు మారింది"ఎయిడ్స్/హెచ్ఐవీ గురించి ప్రజల్లో అవగాహన పెంచడంలో పులిరాజా ప్రచారం సఫలమయింది. అయితే బర్డ్ ఫ్లూ, ఎబోలా, స్వైన్ ఫ్లూ, జికా వంటి వైరస్‌లతో పాటు కరోనా వచ్చే సమయానికి క్రమంగా ఎయిడ్స్ పై ప్రచారం తగ్గిందనే చెప్పాలి. ఎయిడ్స్/హెచ్ఐవీ వ్యాధిగ్రస్థుల సంఖ్య కూడా కొంతకాలంగా తగ్గుతోంది. కానీ ఇప్పటికీ పూర్తిగా తగ్గలేదు. కొత్త కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం అనేది ప్రపంచవ్యాప్తంగా గత 37 సంవత్సరాలుగా (1988 నుండి) ప్రతి సంవత్సరం డిసెంబర్ 1న జరుపుకునే ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం . హెచ్ఐవీ కారణంగా మరణాలు, కొత్త కేసులు భారీగా తగ్గుతున్నప్పటికీ ప్రపంచానికి ఎయిడ్స్ ముప్పు తొలగలేదని హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై పనిచేసే యునైటెడ్ నేషన్స్ ప్రోగ్రామ్ (యూఎన్ఎయిడ్స్) హెచ్చరించింది. ప్రపంచ వ్యాప్తంగా 3 కోట్ల 99 లక్షల మంది ప్రజలు ఎయిడ్స్‌తో జీవిస్తున్నారని, వారిలో దాదాపు సగం మంది ఆఫ్రికాలో దక్షిణ, తూర్పు దేశాలకు చెందిన వారని యూఎన్ఎయిడ్స్ తెలిపింది. హెచ్ఐవీ బారిన పడుతున్నవారి సంఖ్య 2010తో పోలిస్తే 39 శాతం తగ్గింది. ఎయిడ్స్‌తో మరణిస్తున్నవారి సంఖ్య సగానికి తగ్గింది. అయితే 2010 నుంచి 2023 మధ్య అఫ్గానిస్తాన్, ఈజిప్ట్, ఫిజి, ఫిలిప్పీన్స్, పపువా న్యూ గినియా, సౌదీ అరేబియాలో మాత్రం హెచ్ఐవీ కేసుల సంఖ్య వంద శాతానికి పైగా పెరిగింది. ఈ సంవత్సరం, 2025, ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం ఇతివృత్తం "అంతరాయాన్ని అధిగమించడం, ఎయిడ్స్ ప్రతిస్పందనను మార్చడం ". ఇటీవలి సంవత్సరాలలో COVID19 మహమ్మారి మరియు ఆర్థిక ఒత్తిళ్లు వంటి వివిధ సవాళ్ల వల్ల అంతరాయం కలిగించిన HIV సంరక్షణ మరియు నివారణ సేవలను పునర్నిర్మించడానికి మరియు బలోపేతం చేయడానికి ప్రపంచవ్యాప్త ప్రయత్నాన్ని ఈ థీమ్ నొక్కి చెబుతుంది. ఈ రోజున, ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు వ్యాధి అవగాహనను ప్రోత్సహించే వివిధ అవగాహన ప్రచారాలు మరియు కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి, HIV (హ్యూమన్ ఇమ్యునో డెఫిషియెన్సీ వైరస్)తో నివసిస్తున్న ప్రజలకు సంఘీభావం ప్రకటించడానికి, AIDS సంబంధిత వ్యాధితో మరణించిన వారిని స్మరించుకోవడానికి మరియు వైరస్ వ్యాప్తికి వ్యతిరేకంగా ర్యాలీ చేయడానికి ఐక్యంగా ఉన్నాయి. ఈ కార్యకలాపాలు ప్రధానంగా మహమ్మారి స్థితి గురించి అవగాహన పెంచడం మరియు ప్రపంచవ్యాప్తంగా HIV / AIDS (ఆర్జిత ఇమ్యునో డెఫిషియెన్సీ సిండ్రోమ్) నివారణ, చికిత్స మరియు సంరక్షణలో పురోగతిని ప్రోత్సహించడంపై దృష్టి సారించాయి.

ఎయిడ్స్ అవగాహన దినోత్సవం ప్రతి ఒక్కరికీ కచ్చితంగా అవసరం..

HIV ఇన్ఫెక్షన్ ప్రస్తుతం నయం చేయలేనిది కాబట్టి AIDS అవగాహన దినోత్సవం అవసరం, కానీ ఈ వ్యాధి గురించి సరైన అవగాహనతో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దీనిని నియంత్రించవచ్చు. ఇది ఒకప్పుడు నిర్వహించలేని దీర్ఘకాలిక ఆరోగ్య పరిస్థితి, కానీ ఇప్పుడు, అవకాశవాద ఇన్ఫెక్షన్లతో సహా HIV నివారణ, రోగ నిర్ధారణ, నిర్వహణ మరియు సంరక్షణలో పురోగతితో, HIV ఉన్నవారు దీర్ఘ కాలం జీవించగలరు మరియు ఆరోగ్యకరమైన జీవితాలను గడపగలరు. 2023 సంవత్సరంలో భారతదేశంలో 66,400 కొత్త కేసులు గుర్తించబడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా 2023లో 13 లక్షల మంది కొత్తగా HIV బారిన పడ్డారు. 2010 నుండి ఇది 39% తగ్గుదల, ఆ సమయంలో 21 లక్షల మంది కొత్తగా సోకినారు. ప్రపంచవ్యాప్తంగా, 2021 సంవత్సరంలో, 14.6 లక్షల మంది (13 లక్షల మంది పెద్దలు మరియు 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు 1.6 లక్షల మంది) HIV బారిన పడ్డారు (కొత్త కేసులు), ఈ వ్యాధి ప్రాణాంతకం, ఎందుకంటే అదే సంవత్సరం (2021)లో 6.5 లక్షల మంది HIV రోగులు మరణించారు. దాదాపు 3.84 కోట్ల మంది (3.67 కోట్ల మంది పెద్దలు మరియు 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న 17 లక్షల మంది పిల్లలు) HIV సోకినట్లు నివేదించబడింది (2021 నాటికి), వీరిలో 54% మంది మహిళలు మరియు బాలికలు, ప్రభావితమైన వారిలో ఎక్కువ మంది తక్కువ మరియు మధ్యఆదాయ దేశాలలో నివసిస్తున్నారు.

HIV నివారణ

- "నివారణ కంటే నివారణ ఉత్తమం" అనే ప్రసిద్ధ కోట్ చెప్పినట్లుగా, ఇతరులకు HIV సంక్రమణను నివారించడానికి అనేక చర్యలు తీసుకోవచ్చు .
- సురక్షితమైన సంభోగం
- లైంగిక సంక్రమణ వ్యాధులకు పరీక్షలు చేయించుకుని చికిత్స పొందండి.
- ఒంటరి లైంగిక భాగస్వామి
- సూదులు పంచుకోవడం వంటి అపరిశుభ్రమైన పద్ధతులకు దూరంగా ఉండటం
- HIV పరీక్ష చేయించుకోండి
- HIV నివారణ ఔషధాల వాడకం, అంటే ఎక్స్‌పోజర్‌కు ముందు మరియు తర్వాత రోగనిరోధకత

మహిళల కోసం ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ పార్కులు

- ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి చేసేలా ప్రణాళికలు
- 'వుమెన్ ఎంపవర్ మెంట్' ఇంటి నుంచే మొదలవ్వాలి
- 'వీ-ఎనేబుల్ గ్రాడ్యుయేషన్ వేడుక'లో మంత్రి శ్రీధర్ బాబు



ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 30: రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళల కోసం ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ పార్కును అభివృద్ధి చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మహిళా సాధికారతను మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపిస్తున్నామన్నారు. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్న లక్ష్యసాధనలో మహిళలను కీలక భాగస్వామ్యం చేస్తామన్నారు. 'వీ హబ్' ఆధ్వర్యంలో ఆదివారం జూబ్లీహిల్స్ లోని డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన 'వీ ఎనేబుల్ గ్రాడ్యుయేషన్ వేడుక'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మహిళా సాధికారత పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చాలంటే మార్పు అనేది ఇంటి నుంచే మొదలు కావాలన్నారు. ఇప్పుడిప్పుడే సమాజంలో ప్రగతిశీల మార్పు కనిపిస్తుందని, ఇది ఆహ్వానించదగ్గ పరిణామన్నారు. 2017-18 నుంచి 2023-24 మధ్య కాలంలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం 22 శాతం నుంచి 40.3 శాతానికి పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు. తెలంగాణలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు 52.7 శాతం అని, ఇది జాతీయ సగటు 45.2 శాతం కంటే ఎక్కువగా నమోదు కావడం రాష్ట్ర పురోగతిని ప్రతిబింబిస్తోందన్నారు. మహిళలు కూడా పురుషులకు ధీటుగా వ్యాపారాలు ప్రారంభించి విజయవంతంగా నిర్వహించగలరని 'వీ హబ్' నిరూపించిందన్నారు. ఈ స్ఫూర్తితో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు ప్రారంభించే సార్టప్స్ ను అంతర్జాతీయ స్థాయిలో ఎంటర్ ప్రైజెస్ గా మార్చేలా 'వీ హబ్ 2.౦'కు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ వేదిక ద్వారా ఒకేచోట స్కిల్స్, టెక్నాలజీ, ఫైనాన్స్, మార్కెట్, మెంటార్షిప్ అందుబాటులో ఉండేలా 'ఎకో సిస్టం' ను అభివృద్ధి చేస్తామన్నారు. మహిళల ఆలోచన తీరులోనూ మార్పు రావాలని, ఉద్యోగాల కోసం కాకుండా వాటిని సృష్టించేలా కొత్తగా ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ క్రీడాకారిణి జ్వాల గుప్తా, ఫిలిం ప్రొడ్యూసర్ ప్రియాంక దత్, వీ హబ్ సీఈవో సీతా పల్లచోల్ల తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 30: సైబర్ నేరగాళ్లు కొత్త తరహ నేరాలకు పాల్పతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య సూచించారు. కాచిగూడ సీఐ తల్లోజు జ్యోత్స్న ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గోకుల్‌ధామ్ అపార్ట్‌మెంట్ లో సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం అడిషనల్ డీసీపీ నర్సయ్య మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఆర్థిక పరమైన లావాదేవీలకు సంబంధించిన వివరాలు ఫోన్‌లో అడిగితే ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దని కోరారు. సైబర్ నేరగాళ్లు సరికొత్త రకం మోసాలకు పాల్పడున్నారని, విద్యుత్ బిల్లు కట్టలేదని, మీ ఫోన్‌కు ఓటీపీ వస్తుందని,అనంతరం మీ బ్యాంక్ ఖాతా ఖాళీ చేస్తారన్నారు. బ్యాంకు రుణాలు ఇప్పిస్తానని ప్రకటించుకునే మోసపూరితమైన యాప్‌లను నమ్మవద్దని కోరారు. ఈజీగా డబ్బులు వస్తాయంటే ఎవరు నమ్మవద్దని, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసిన.. మేసేజ్‌లు పంపినా 8712660540లో సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వై.హరీశ్‌కుమార్, డీఐ మల్లేశం, అడ్మిన్ ఎస్సై నరేశ్, ఎస్సైలు,సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి యువతను అంతర్జాతీయ స్థాయిలో నిలపడమే లక్ష్యం

- 'చెమట చుక్కలకు తర్ఫీదు' కార్యక్రమ ప్రారంభోత్సవంలో సీఎండీ బలరామ్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 30: సింగరేణి ప్రాంతంలో విద్యావంతులైన యువతీయువకులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దేందుకు సింగరేణి తరఫున కృషి చేస్తున్నట్లు సీఎండీ ఎన్. బలరామ్ తెలిపారు. ముఖ్యంగా దేశ, విదేశాల్లో విద్యా, ఉపాధి అవకాశాలపై అవగాహన, స్ఫూర్తిదాయకమైన వ్యక్తుల సందేశాల ద్వారా ఉన్నత లక్ష్యాలను ఎంచుకునేలా ప్రేరణ నింపేందుకు వీలుగా 'చెమట చుక్కలకు తర్ఫీదు' పేరిట వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. ఆదివారం కొత్తగూడెం ఏరియాలోని ఆర్సీఓ ఎ క్లబ్, రుద్రంపూర్ లో "చెమట చుక్కలకు తర్ఫీదు" పై అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. జాబ్ మేళాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా ఈ కార్యక్రమంలో ద్వారా ప్రతిభావంతులైన యువత వద్దకు విషయ నిపుణులను తీసుకొచ్చి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో నిపుణులు, క్లౌడ్ సీల్స్ సంస్థ సీఈవో శ్రీ శ్రీనివాస్ పల్లె మాట్లాడుతూ సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో వినూత్నమైనదన్నారు. జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో మన సత్తా చాటేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. తాను సింగరేణి విశ్రాంత కార్మికుడి బిడ్డనే అని, ఇప్పుడు లండన్‌లోనూ కార్యకలాపాలు నిర్వహించే కంపెనీని నిర్వహిస్తున్నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్వీ సూర్యనారాయణ, డైరెక్టర్ (ఈ&ఎం) ఎం. తిరుమల రావు మాట్లాడారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం, అధికారుల సంఘం నుంచి వాసిరెడ్డి సీతారామయ్య, త్యాగరాజన్, నర్సింహారావులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజు సభాధ్యక్షత వహించి ప్రారంభోపన్యాసం చేశారు.

కవిత ప్రజల సమస్యలు మాట్లాడితే

బీఆర్ఎస్ నేతలు ఓర్వలేక పోతున్నారు

- జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్ మండిపాటు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 30: జనం బాట లో కవిత ప్రజల సమస్యలు మాట్లాడితే బీఆర్ఎస్ పార్టీ నేతలు ఓర్వలేక పోతున్నారని జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.రూప్ సింగ్, జాగృతి రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ మండి పడ్డారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పర్యటనల్లో ప్రజలు లేవనెత్తిన సమస్యలను మీడియా ముందు ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ పాలన, ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు అమలుపై తీవ్రమైన విమర్శలు చేశారు. జాగృతి జనంబాట కార్యక్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నేరుగా విని వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ తాము మాట్లాడుతున్నప్పుడు, దీనిని ఓర్చుకోలేక బీఆర్ఎస్ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు తమపై తిరిగి ఆరోపణలు చేస్తూ దారితప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆమె వ్యాఖ్యానించినట్లు జాగృతి వర్గాలు పేర్కొన్నాయి. తమ అధినేత కవిత నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరానికీ నీళ్లు అందలేదని, ఇది వాస్తవం కాదని చెప్పలేని స్పష్టమైన విషయం అని అన్నారు. 2021లో కొండపోచమ్మసాగర్ నుంచి హల్దీ వాగు ద్వారా నిజాంసాగర్‌కు గోదావరి నీళ్లు చేరినా, అవి ఒక్క యాసంగి సీజన్ పంటలను కాపాడేందుకు మాత్రమే వినియోగించారని, తర్వాత వరుసగా భారీ వర్షాలు రావడంతో కాళేశ్వరం నీటిని తరలించే అవసరం రాలేదని వివరించారు. అయితే బీఆర్ఎస్ నేతలు కాళేశ్వరం నీళ్లతో శ్రీరాంసాగర్ నింపామని చెబుతున్నది వాస్తవానికి విరుద్ధమని చెప్పారు. 2023లో ఎస్ఆర్ఎస్పీ పునరుజ్జీవన ద్వారా ఎత్తిపోసిన 2.5 టీఎంసీల నీటికి తర్వాత పైప్రవాహం నుంచి వచ్చిన వరద నీళ్లు చేరి, చివరికి స్పిల్‌వే మార్గంగా గోదావరిలో కలిసిపోయాయని గుర్తుచేశారు. అప్పుడు కూడా కాళేశ్వరం నీటితో శ్రీరాంసాగర్ నింపారన్న బీఆర్ఎస్ నేతల ఆరోపణలు ఎలా నిజం అవుతాయని ప్రశ్నించారు. ఇక రాజకీయంగా కూడా బీఆర్ఎస్ నేతలు ప్రజల ఆవేదనలను చెప్పడానికి తాను మాట్లాడిన విషయాలను తట్టుకోలేక వెంటనే ప్రతివాదం చేస్తూ దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తున్నారని కవిత చెప్పినట్లు జాగృతి వర్గాలు వెల్లడించాయి. వనపర్తి పర్యటనలో ప్రజలు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వ్యవహారాలపై తమ గోడును చెప్పిన విషయాలను మీడియా ముందుకు తాను తీసుకురాగానే, ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారని వీరు అన్నారు. గతంలో బీఆర్ఎస్ లో తాను ఎదుర్కొన్న అంతర్గత రాజకీయాలు, కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ వ్యవహారం, తన సస్పెన్షన్ వంటి సంఘటనలు కూడా జాగృతి నాయకుల ద్వారా ప్రస్తావించబడ్డాయి. బీసీ రిజర్వేషన్ల అంశంపై కవిత చేస్తున్న పోరాటాన్ని ప్రస్తావించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు బీసీలకు న్యాయం చేయడంలో విఫలమయ్యాయని, అయితే కవిత మాత్రం నిరంతరంగా బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడుతున్నారని అన్నారు. కామారెడ్డిలో బీసీల తరఫున రైలు రోకో కూడా నిర్వహించారని గుర్తుచేశారు. ఇక మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, జీవన్ రెడ్డిపై పలు ఆరోపణలు చేస్తూ, వారి రాజకీయ ప్రయాణంలో కవిత గారి సహకారం ఉందని, అయితే ఇప్పుడు ఆమెపై వ్యక్తిగతంగా వ్యాఖ్యలు చేయడం అసహ్యకరమని అన్నారు. గతంలో స్థానికంగా జరిగిన అవకతవకలు, ఇసుక దందా, నిర్మాణాల్లో నాణ్యత లోపాలు వంటి అంశాలను ప్రజలు పదేపదే లేవనెత్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత ఈ నేతలు ఇతర పార్టీలతో లోపాయికారీ ప్రయత్నాలు చేశారని కూడా ఆయన ఆరోపించారు.

డిసెంబర్ 4 నుంచి

'జాగృతి జనంబాట' కొనసాగింపు

- మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా నుంచి పర్యటన ప్రారంభం
- ఇప్పటికే 11 జిల్లాల్లో జనంబాట యాత్ర పూర్తి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్ , నవంబర్ 30: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జాగృతి జనంబాట యాత్రను తిరిగి డిసెంబర్ నాలుగో తేదీ నుంచి కొనసాగించనున్నారు. అక్టోబర్ 25వ తేదీన నిజామాబాద్ లో కవిత జనంబాట యాత్ర ప్రారంభించారు. మహబూబ్ నగర్, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ హన్మకొండ, నల్గొండ, మెదక్, ఖమ్మం, రంగారెడ్డి, వనపర్తి, కామారెడ్డి జిల్లాల్లో యాత్ర పూర్తి చేశారు. కామారెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ రావడంతో గ్రామీణ జిల్లాల్లో యాత్రను నిలిపివేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ లేని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో డిసెంబర్ నాలుగో తేదీ నుంచి ఏడో తేదీ వరకు యాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణ జాగృతి కార్యాలయం ఆదివారం సవరించిన షెడ్యూల్ ప్రకటించింది. హైదరాబాద్ జిల్లాలో డిసెంబర్ 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు యాత్ర చేపడుతారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 18, 19 తేదీల్లో, గద్వాల జిల్లాలో 21, 22 తేదీల్లో యాత్ర నిర్వహిస్తారు. యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్, పెద్దపల్లి, సూర్యాపేట, సిరిసిల్ల, జనగామ, భూపాలపల్లి, ఆసిఫాబాద్, సంగారెడ్డి, వికారాబాద్, ములుగు, జగిత్యాల, మహబూబాబాద్, నిర్మల్, నారాయణపేట, సిద్ధిపేట, మంచిర్యాల జిల్లాలో ఫిబ్రవరి మూడో వారం వరకు యాత్ర కొనసాగిస్తారు.




బీఆర్ఎస్ అభ్యర్థి భర్త కిడ్నాప్ కేసులో అమానుషం

- బీఆర్ఎస్ ఆందోళనతో విడిచిపెట్టిన దుండగులు
- అర్ధరాత్రి స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యేల బైఠాయింపు
- పోలీసుల తీరు, వైఫల్యంపై తీవ్ర ఆగ్రహం
- ఎట్టకేలకు దుండగులపై కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రతిప్రక్షం, నల్గొండ ప్రతినిధి, నవంబర్ 30: నల్లగొండ జిల్లా ఎల్లమ్మగూడెంలో బీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి మామిడి నాగలక్ష్మి భర్త యాదగిరి కిడ్నాప్ కేసులో దుండగులు దారుణంగా వ్యవహరించిన తీరు వెలుగుచూసింది. బీఆర్ఎస్ నేతల ఆందోళనల అనంతరం ఎట్టకేలకు శనివారం రాత్రి 9 గంటల తర్వాత యాదగిరిని దుండగులు విడుదల చేశారు. బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు ధైర్యం చెప్పారు. అప్పటికే నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ను కలిసిన వారు.. ఆ తర్వాత యాదగిరిని తీసుకొని తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడే ఉన్న సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ శంకర్‌తో మాట్లాడారు. గ్రామంలో జరుగుతున్న అరాచకంపై వారిని నిలదీశారు. బాధితుడు తను జరిగిన దారుణాలను పోలీస్ అధికారులకు యాదగిరి వివరించారు. నకిరేకల్‌లో బయటకు వెళ్లిన యాదగిరిని కొందరు అటకాయించి కారులో ఎక్కించుకుని వేర్వేరు ప్రాంతాలకు రోజంతా తిప్పారు. హైదరాబాద్ వైపు తీసుకెళ్తూ వేర్వేరు ప్రాంతాలకు తిప్పుతూ చిత్రహింసలకు గురిచేసినట్టు ఆవేదన వ్యక్తంచేశాడు. ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా ఓ ఫాంహౌస్‌కు తీసుకెళ్లి నామినేషన్ వేస్తే ప్రాణాలు ఉండవంటూ హెచ్చరించారు. యాదగిరితో తన భార్య నాగలక్ష్మికి ఫోన్ చేయించారు. నేను క్షేమంగానే ఉన్నా.. నామినేషన్ వేయవద్దు.. అంటూ ఫోన్‌లో చెప్పించినట్టు తెలిపాడు. ఈ క్రమంలో మెడపై కత్తులు పెట్టి, దుర్భాషలాడుతూ హింసించినట్టు వివరించాడు. మద్యం తాగుతూ తనతో మూత్రం తాపించినట్టు యాదగిరి చెప్పాడు. ఈ విషయాన్ని అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌లో సీఐ, ఎస్ఐ ముందు బాధితుడు యాదగిరి వివరించాడు. యాదగిరితో అంతకుముందే పోలీసులు తనంతట తానే వాళ్లతో కలిసి వెళ్లినట్టుగా స్టేట్ మెంట్ తీసుకున్నట్టు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు గుర్తించారు. ఇదే స్టేట్ మెంట్‌ను సీఐ, ఎస్ఐ ముందు పెట్టి ఇదేం పద్ధతి అని నిలదీశారు. దీంతో పోలీసులు నీళ్లు నమిలారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ, తక్షణమే కిడ్నాప్, హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు ఎల్లమ్మగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేతలతోపాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్టు ప్రకటించారు. అదే గామంలో వార్డు స్థానానికి నామినేషన్ వేసిన ఓ అభ్యర్థిని సైతం కాంగ్రెస్ నేతలు బెదరించారని తెలిసింది. గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు ఊట్కూరి సందీప్‌రెడ్డి సర్పంచ్ పదవికి నామినేషన్ వేశాడు. తాను ఏకగ్రీవం కావడం కోసం ప్రత్యర్థులెవరూ నామినేషన్లు వేయకుండా బెదిరింపులకు దిగుతుండటంతో గ్రామంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయని తెలిసింది. గతంలో సర్పంచ్ భర్త విజయ్‌రెడ్డి హత్యకేసులో నిందితుడిగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి ప్రస్తుత ఎన్నికల్లో ఎదురే ఉండకూడదన్న ధోరణతో వ్యవహరిస్తున్నారని సమాచారం. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గుండాలను ప్రోత్సహిస్తూ ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను బెదిరిస్తూ పోటీ చేయకుండా అడ్డుకుంటున్నాడని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శించారు.

తెలంగాణ టెట్‌కు దరఖాస్తుల వెల్లువ

- 2,26,956 ధరఖాస్తులు
- జనవరి 3 నుంచి 31 మధ్యలో పరీక్షల నిర్వహణ



ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 30 : తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు శనివారంతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. ఈసారి భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. 29వ తేదీ సాయంత్రం 6గంటల వరకు 2,26,956 దరఖాస్తులు అందాయి.. అయితే, శనివారం అర్ధరాత్రి వరకు దరఖాస్తుల స్వీకరణకు సమయం ఉండటంతో అదనంగా మరో 20వేల వరకు దరఖాస్తులు పెరిగి ఉండొచ్చునని విద్యాశాఖ అధికారులు అంచనా వేస్తున్నాయి. గత జూన్‌లో నిర్వహించిన టెట్ 2025 తొలి విడతకు 1.83లక్షల మందే దరఖాస్తు చేసుకున్నారు. వారిలో కేవలం 1.37లక్షల మందే పరీక్షలు రాశారు. అయితే, ప్రస్తుతం ఉద్యోగంలో కొనసాగుతున్న టీచర్లకుసైతం టెట్ తప్పనిసరి కావడంతో దరఖాస్తులు వెల్లువెత్తాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. శనివారం సాయంత్రం 6గంటల వరకు పేపర్ 1 కోసం 26,788 మంది టీచర్లు దరఖాస్తు చేసుకోగా.. ఇతర అభ్యర్థులు 55,133 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మొత్తం 81,921 మంది పేపర్1 కోసం దరఖాస్తు చేసుకున్నారు. పేపర్2కు 1,45,035 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో టీచర్లు 44,063 మందికాగా.. ఇతర అభ్యర్థులు 1,00,972 మంది ఉన్నారు. రెండు పేపర్లకు (పేపర్1, పేపర్2) కలిపి 2,26,957 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 70,851 మంది టీచర్లు ఉండగా.. 1,56,105 మంది ఇతర అభ్యర్థులు ఉన్నారు. అయితే, శనివారం అర్ధరాత్రి వరకు దరఖాస్తుల స్వీకరణకు సమయం ఉండటంతో వీటి సంఖ్య మరో 20వేలు పెరిగి ఉంటుందని విద్యాశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. రెండేళ్లలో టెట్ పాస్ కాకుంటే ఉద్యోగంలో కొనసాగలేరని పేర్కొంది. అయితే, సుప్రీంతీర్పుపై ఉపాధ్యాయ సంఘాలు రివ్యూ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అదే సమయంలో విద్యాహక్కు చట్టాన్ని సవరించి.. ఆ చట్టం రాకముందే ఉద్యోగంలో చేరిన వారికి టెట్ మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. అయితే, ప్రస్తుతం మాత్రం ముందస్తు జాగ్రత్తగా ఉపాధ్యాయులు టెట్ రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇదిలా ఉంటే.. డిసెంబర్ 27వ తేదీన టీజీ టెట్ 2026 హాల్ టికెట్లు అందుబాటులోకి వస్తాయి. 2026 జనవరి 3 నుంచి 31 తేదీల మధ్యలో పరీక్షలు జరగనున్నాయి. టెట్ పరీక్షలో ఒక్కసారి అర్హత సాధిస్తే ఎన్నిసార్లు అయినా టెట్ రాయవచ్చు. ఎక్కువ స్కోర్ ఉన్న టెట్ పరీక్షనే పరిగణనలోకి తీసుకుంటారు. టెట్ పరీక్షను మొత్తం 150 మార్కులకు నిర్వహిస్తారు. టెట్ ఎగ్జామ్‌లో ఓసీ అభ్యర్థులు 60 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఇక బీసీ అభ్యర్థులు 50 శాతం, ఎస్టీ, ఎస్సీ, పీహెచ్, ఎక్స్ సర్వీస్ మెన్ 40 శాతం అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది.

“



ప్రతిభావంతులైన ఇండియన్ల నుంచి యూఎస్ఎంతో ప్రయోజనం పొందింది. విదేశీయులు తమ జాబ్స్ దోచుకుంటున్నారని కొందరు అమెరికన్లు భావించడం ఎంతవరకు నిజమో తనకు తెలియదు. ప్రతిభావంతుల కొరత ఎప్పుడూ ఉంటుంది. కష్టమైన పనులు చేసేందుకు వాళ్లు ఉండాలి. హెచ్-1బీ ప్రోగ్రామ్‌లో కొంత దుర్వినియోగం జరిగింది.

-టెస్లా అధినేత ఎలాన్ మస్క్

బహుళ

సామాజికం

మానవీయ స్పర్శతో మహమ్మారి అంతం



ఎండీ ఫారూఖ్ జునైద్ ఖాన్
7893494103

ప్రపంచ ఆరోగ్య వ్యవస్థలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నా, ఎయిడ్స్ అనే వ్యాధి మనల్ని ఇంకా సవాలు చేస్తూనేఉంది. డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం. కేవలం ఒక క్యాలెండర్ తేదీ కాదు; ఇది ఒక నిరంతర జాగృతికి ప్రతీక. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు ఇంకా హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో జీవిస్తున్న ఈ సందర్భంలో, ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలంటే మనం చేపట్టాల్సిన చర్యలు ఎంత కీలకమో మరోసారి ఈ రోజు గుర్తు చేస్తుంది.

నలభై మిలియన్లకు పైగా ప్రజలు

2024 చివరి నాటికి ప్రపంచంలో దాదాపు నలభై మిలియన్లకు పైగా ప్రజలు హెచ్ఐవీతో సహజీవనం చేస్తున్నారు. ప్రతి ఏడాదిలానే, 2024లో కూడా లక్షల్లో కొత్త ఇన్ఫెక్షన్లు నమోదయ్యాయి. హెచ్ఐవి నియంత్రణలో మన దేశం గణనీయమైన పురోగతి సాధిస్తున్నప్పటికీ, వేలాదిగా కొత్త కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ప్రమాదం పూర్తిగా తొలగిపోలేదు. ముఖ్యంగా యువత, వలస కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు, ప్రమాద భరిత వాతావరణాల్లో పనిచేసే వ్యక్తులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. వైద్యపరీక్షలు సులభంగా అందుబాటులో ఉన్నప్పటికీ, 'సమాజం ఏమనుకుంటుంది?' అనే భయం ఇప్పటికీ అనేక మందిని దూరంగా ఉంచుతోంది. హెచ్ఐవి ఒక సాధారణ సంక్రమణ వ్యాధి; ఇది కేవలం రక్తం, సురక్షితం కాని లైంగిక సంబంధాలు, తల్లి నుంచి శిశువుకు వంటి కొన్ని నిర్దిష్ట మార్గాల ద్వారానే వ్యాపిస్తుంది. చేతులు కలపడం, అంటే కరచాలనం చేయడం, ఆహారం పంచుకోవడం, పక్కపక్కనే కలసి కూర్చోవడం వంటివాటితో ఎలాంటి ప్రమాదమూ ఉండదు. ఈ ప్రాథమిక విషయాల్లో స్పష్టత ఏర్పడకపోతే సమాజంలో అపోహలు కొనసాగుతూనే ఉంటాయి. కొత్త చికిత్సా పద్ధతులు ఎంతగా అభివృద్ధి చెందుతున్నా, చికిత్స అందుబాటులోకి వచ్చినా, చిన్నచూపు, అజ్ఞానం, సామాజిక వివక్ష ఇవన్నీ ఇప్పటికీ ఈ సమస్యను మరింత క్లిష్టతరం చేస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ఫండింగ్ తగ్గుదల

ఇంకో వైపు, ప్రపంచవ్యాప్తంగా ఫండింగ్ తగ్గుదల కూడా ఈ రంగంలో భారీ ముప్పుకు దారి తీస్తోంది. అనేక దేశాలు ఆరోగ్య బడ్జెట్ కు సంబంధించి తీవ్రమైన ఒత్తిడిలో ఉన్న నేపథ్యంలో, హెచ్ఐవీ నిరోధక కార్యక్రమాలపై ప్రభావం పడుతోంది. దీనివల్ల కండోమ్ పంపిణీ కేంద్రాల నుండి అవగాహన శిబిరాల వరకూ, టెస్టింగ్ సౌకర్యాల నుండి చికిత్స వరకూ, ప్రతీ స్థాయిలో ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. 2030 నాటికి ఎయిడ్స్ ను ను ప్రజారోగ్య ముప్పు స్థాయి నుండి తొలగించాలనే అంతర్జాతీయ లక్ష్యం ఉంది. కానీ నిధుల కొరత, సేవలలో అంతరాయం, సామాజిక వివక్ష, ఈ లక్ష్యాన్ని చేరడంలో అడ్డంకిగా మారుతున్నాయి. అందుకే ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్యసంస్థ ఎంపిక చేసిన థీమ్ ప్రత్యేకంగా ప్రాధాన్యం సంతరించుకుంది: 'Overcoming disruption, transforming the AIDS response.' ప్రపంచం ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిళ్లు, విధాన మార్పులు, ఆరోగ్య వ్యవస్థలపై పడుతున్న భారం, ఈ అంతరాయాలను అధిగమించి, ఎయిడ్స్‌కి వ్యతిరేక పోరాటాన్ని మరింత దృఢంగా మలచాల్సిన సమయం ఇది.

పోరాటంలో ఒక కీలక పాత్ర

భారతదేశం కూడా ఈ పోరాటంలో ఒక కీలక పాత్ర పోషిస్తోంది. దేశవ్యాప్తంగా ఇప్పటికీ లక్షలాది మంది హెచ్ఐవీతో జీవిస్తున్నారు. అనేక రాష్ట్రాలు మంచి పురోగతిని సాధించినప్పటికీ, కొన్ని రాష్ట్రాలు ఇంకా



ప్రమాదంలోనే ఉన్నాయి. ప్రత్యేకించి పేదలు, వలస కార్మికులు, ట్రాన్స్‌జెండర్ సమాజం, మహిళలు. ఆరోగ్యసేవలు, అవగాహన, గోప్యత, వివక్ష రహిత చికిత్స ఇవన్నీ సమానంగా అందకపోవడం సమస్యను మరింత జటిలంగా మార్చుతోంది. ప్రభుత్వ విధానాలు పక్కాగా ఉన్నా, వాటి అమలు, పర్యవేక్షణ, సామాజిక మద్దతు ఎంతైనా అవసరం. ఎయిడ్స్ గురించి మన సమాజంలో ఇంతవరకు తొలగని అతిపెద్ద ప్రమాదం వివక్ష, చులకనభావం. ఈ వ్యాధికి సంబంధించి సమాజంలో ప్రబలిన అపోహల వల్ల ఎన్ని కుటుంబాలు ఒంటరి తనానికి గురయ్యాయో, ఎంతమంది సమాజం దృష్టిలో వివక్షకు గురయ్యారో లెక్కలేదు. అసలు సమస్య వ్యాధి కాదు; మన దృష్టిలో వ్యాధిని చూసే తీరు. హెచ్ఐవీ పాజిటివ్ ఉన్న వ్యక్తి కూడా మనలాంటి ఒక మనిషే. వారికీ సమాజంలో గౌరవ ప్రదంగా జీవించే హక్కు ఉంది. కనుక ఎవరినీ తక్కువగా చూడకుండా, వివక్షకు, అవమానాలకు గురి చేయకుండా మనిషిని మనిషిగా చూడడం, మానవతను కాపాడుకోవడం మనందరి నైతిక బాధ్యత.

ఒక ముఖ్యమైన సందేశం

ఈ దినోత్సవం మనకు ఒక ముఖ్యమైన సందేశం ఇస్తోంది. అదేమిటంటే, ఎయిడ్స్ కు వ్యతిరేకంగా పోరాడటం కేవలం వైద్యరంగం పని మాత్రమే కాదు; ఇది ఒక సామాజిక బాధ్యత, ఒక నైతిక కర్తవ్యం. పాఠశాల స్థాయినుండే అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి, యువతకు సరైన లైంగిక విద్య అందించాలి, వైద్యసేవలు అందరికీ సమానంగా చేరాలి, ఏ వ్యక్తినైనా హెచ్ఐవీ కారణంగా తక్కువ చేసి చూడకుండా, గౌరవంతో అక్కున చేర్చుకోవాలి. ప్రపంచం ఎన్నో రంగాల్లో ముందుకు వెళ్తోంది. శాస్త్ర, సాంకేతిక, వైద్య రంగం విపరీతంగా అభివృద్ధి చెందుతున్నాయి. కానీ మనసులు మాత్రం ఇంకా అపోహల్లోనే బందీలై ఉన్నాయి. హెచ్ఐవీను నిర్మూలించాలంటే, మందులతో పాటు మన దృష్టిని, మన ప్రవృత్తిని కూడా మార్చుకోవాలి. ఇది కేవలం ఒక ఆరోగ్య సమస్య కాదు; ఇది మానవ సమానత్వం, గౌరవం, భద్రత, అవకాశాలకు సంబంధించిన సమస్య.

డిసెంబర్ 1 మనకు ఒక గుర్తు చేసేదేమిటంటే, అనేక మంది మన మద్దతు కోసం ఎదురుచూస్తున్నారు. వారు 'ఎయిడ్స్ రోగులు కాదు; వారు మన సహచరులు, మిత్రులు, సహోదరులు, మనుషులు. వారి పట్ల మానవత్వం చూపడం కేవలం దయ కాదు; అది ఒక మానవీయ నైతిక బాధ్యత.

(వ్యాస రచయిత రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్, కారుణ్య మెడికల్ స్టోర్స్, జగన్నాథపురం)

సమీక్ష

అంతరంగ యుద్ధాల కవిత్వం – అఫ్సర్



గాజోజి శ్రీనివాస్
9948483560


అఫ్సర్ కవిత్వం చదవడం అంటే కేవలం కొన్ని పంక్తులు చదవడమే కాదు; అది మన మనసు లోతుల్లోకి వెళ్ళి అక్కడ దాగి ఉన్న భావాల్ని, భయాల్ని, ప్రేమల్ని, వేదనల్ని నెమ్మదిగా తాకే అనుభవం. ఆధునిక మనిషి ఎదుర్కొంటున్న అంతర్ముఖ సంక్షోభాలను, కాలానిశ్చితిని, సంబంధాల సంక్లిష్టతను, సామాజిక అశాంతిని ఆయన తన ప్రత్యేకమైన శైలిలో ఆవిష్కరించిన తీరు ఎంతో అపూర్వం. వ్యక్తిగత అనుభూతి నుంచి సామాజిక స్పందన వరకు విస్తరించిన ఈ కవితలు పాఠకుడిని లోతైన ఆలోచనల్లోకి తీసుకెళ్తాయి. తన తాజా కవితా సంపుటి అయిన "యుద్ధం మధ్యలో నువ్వు"తో ఆయన మన ముందుకు వచ్చాడు. ఇందులో మూడు భాగాలుగా విభజించారు. మొదటిది కత్తి అంచు మీద నిలబడి, రెండవది ఆరుకాలాలూ మాయమైన చోట, మూడవది పంజరాల్ని విడిచినప్పుడు. ఈ మూడు భాగాలూ మనిషి అంతర్మనస్సులో జరుగుతున్న సంఘర్షణలకే ప్రతీకలుగా నిలుస్తాయి. కవిత్వంలోకి వెళితే,

కవితా శక్తికి ప్రతీకలు

"ఏది గతమో / ఏది ఇప్పుడో / రేపు గోడ మీద ఏది బొమ్మో / తెలియదు" అనే నాలుగు పంక్తులు అఫ్సర్ కవితా శక్తికి ప్రతీకలా నిలుస్తాయి. కాలాన్ని గణితంలా కాక భావనలుగా, అనిశ్చితులుగా, ఊహాచిత్రాలుగా మలిచే ఈ ప్రతీకాత్మకత ఆధునిక మనిషి మనస్తత్వాన్ని అద్భుతంగా ప్రతిబింబిస్తుంది. భవిష్యత్తు కూడా ఒక "గోడమీద బొమ్మ"గా మారిపోవడం ద్వారా ఈ కాలానికి చెందిన అస్థిరత్వం, భయాలు స్పష్టంగా ఆవిష్కృతమవుతాయి. అతి తక్కువ పదాల్లో అతి లోతైన భావాన్ని చెప్పగలిగే కవిగా అఫ్సర్ ఇక్కడ కనిపిస్తాడు. ప్రేమను ఆయన కేవలం ఆహ్లాదంగా మాత్రమే కాక బాధగా, భారంగా, అంతర్ముఖ వేదనగా కూడా ఆవిష్కరిస్తాడు. "ఈ క్షణంలో పుట్టిన ఈ లోపలి నొప్పికి కారణం/ప్రేమ మరీ కాస్త ఎక్కువైంది" అనే పంక్తుల్లో ప్రేమ మీద గాయపడిన హృదయ స్పందన నిస్సహాయంగా, నిజాయితీగా వ్యక్తమవుతుంది. ప్రేమ వల్ల కలిగే బాధను కూడా తన జీవితానుభూతిలా స్వీకరించే ధైర్యం అఫ్సర్ కవిత్వానికి ప్రత్యేక బలం. ఇక్కడ ప్రేమ ఒక భావోద్వేగమే కాదు, ఒక జీవితానుభవంగా మారుతుంది.

సృజనాత్మక లోకానికి ఒక తలుపు

"పదాలు ఎవరో అల్లులు లేక వస్తారు" అనే గద్యకవిత



ప్రతులకు:
అజు పబ్లికేషన్స్
1–3–63/2
మాల్ బౌలీ స్ట్రీట్
నల్గొండ–
508001
9912460268
వెల: ₹200/-

అఫ్సర్ సృజనాత్మక లోకానికి ఒక తలుపు తెరుస్తుంది. పదాలను మల్లెలుగా, గులాబీలుగా, పేరులేని అనాథ పువ్వులుగా ఊహించడం ద్వారా సృష్టి ప్రక్రియ ఎంత సున్నితమైనదో ఆయన చూపిస్తాడు. "యుద్ధం మధ్యలో నువ్వు - 1, 2" కవితల్లో అఫ్సర్ అంతర్మనస్సును ఒక యుద్ధరంగంగా మలుస్తాడు. బయటగా కనిపించే ప్రపంచ కల్లోలంకంటే లోపల జరుగుతున్న మౌన యుద్ధమే భయంకరమని ఈ కవితలు చెబుతాయి. గాయాలను తట్టుకోలేని స్థితి, అడుగు వేయలేని భయం, నరకంలా మారిన జీవన ప్రయాణం ఇవన్నీ ఆధునిక మనిషి లోపలి పోరాటానికి ప్రతీకలుగా నిలుస్తాయి. అయినా చిన్న చైతన్యమే పెద్ద మార్పుకు దారి తీస్తుందన్న ఆశావహ దృష్టి ఈ కవితల్లో అంతర్లీనంగా కనిపిస్తుంది. "గాయకుడి ముఖమే వాకిలి" అన్న ముగింపు పంక్తి, కవిత్వం మన మనసులోకి ప్రవేశించే ద్వారమే కవి అనే తాత్విక భావాన్ని అద్భుతంగా బోధిస్తుంది.

నువ్వే నా జాతీయ గీతం

"ఆసిఫా, నువ్వే నా జాతీయ గీతం!" అనే కవిత అఫ్సర్ సామాజిక చైతన్యానికి గొప్ప ఉదాహరణ. ఒక పసిప్రాణంపై జరిగిన అఘాయిత్యాన్ని జాతీయ అవమానంగా మలచడం ద్వారా ఆయన కేవలం కవి మాత్రమేగాక సమాజపు మనస్సాక్షిగా ఎదుగుతాడు. దేవుళ్లూ, పూజలూ ఒక వైపు, న్యాయం కోసం అరిచే బాలిక మరో వైపు ఈ రెండు మధ్య నిలబెట్టిన వ్యతిరేకత చదివే వారి హృదయాన్ని కలచివేస్తుంది. ఇది భావోద్వేగ కవిత మాత్రమే కాదు, మానవత్వాన్ని నిలదీసే ఒక బలమైన సామాజిక అభివ్యక్తి.

సంబంధాల శూన్యతను చిత్రించిన కవితల్లో "మాట్లాడటం లేదు, రాయడం లేదు, చదవడం లేదు" అనే పంక్తులు ఆధునిక జీవితం ఎంత ఖాళీగా మారుతోందో స్పష్టంగా చెబుతాయి. మాటలు లేని మౌనం, భావాలు లేని సంబంధాలు, పుస్తకాల ముందు నిలిచిన నిర్జీవత ఇవి ఆధునిక ఒంటరితనానికి ప్రతీకలుగా నిలుస్తాయి.

అనుమానం, అపనమ్మకం, భయం

"సంశయ అమావాస" కవితలో అనుమానం, అపనమ్మకం, భయం మనిషి మనస్సుపై చీకటి మబ్బుల్లా ఎలా కమ్ముకుంటాయో అఫ్సర్ హృదయాన్ని తాకేలా చూపిస్తాడు. రాత్రి కూడా స్నేహంగా చేయిచాపని స్థితి ద్వారా ప్రపంచంతో ఏర్పడిన దూరం హృదయాన్ని తాకేలా వ్యక్తమవుతుంది. "మెట్రో కవిత్వం - మొద్దు పొద్దు"లో నగర జీవనంలోని యాంత్రికత అద్భుత దృశ్యాలతో ఆవిష్కృతమవుతుంది. ట్రాష్ దగ్గర గొడవలు, భయంతో వెనక్కి తగ్గే మనస్సులు, "నా అగ్గిపెట్టెలోకి దూరడం" వంటి దృశ్యాలు నగర మనిషి బతుకును స్పష్టంగా చూపించే శక్తివంతమైన రూపాలుగా నిలుస్తాయి. మొత్తంగా అఫ్సర్ కవిత్వం ఆధునిక మనిషి అంతర్గత సంఘర్షణలను, ప్రేమ-వేదనల ద్వంద్వ స్వభావాన్ని, సామాజిక అశాంతిని మరియు అస్తిత్వ ప్రశ్నలను ప్రతిబింబించే ఒక సజీవ అద్దంలా నిలుస్తుంది. ఆయన కవిత్వంలో ఆత్మపరిశీలన ఉంది, సామాజిక స్పృహ ఉంది, తాత్విక లోతు ఉంది. అఫ్సర్ కవిత్వం పాఠకున్ని కేవలం చదివించదు ఆలోచింపజేస్తుంది, కలచివేస్తుంది, లోపలికి చూసేలా చేస్తుంది. ఈ లక్షణాల వల్లనే ఆయన కవితా ప్రపంచం సమకాలీన తెలుగు కవిత్వంలో ఒక విశేషమైన, గుర్తించదగిన, గౌరవించదగిన కవితా ప్రయాణంగా నిలుస్తోంది. చక్కని కవితా సంపుటిని అందించిన అఫ్సర్ గారిని అభినందిస్తూ, మరెన్నో సాహిత్య సంకలనాలు వారి నుండి రావాలని ఆకాంక్షిద్దాం.

(సమీక్షకులు కవి, రచయిత)

పరిచయం

భారత్-అమెరికా సాహిత్య హైఫన్



డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

ఎవరి తమిళ, కన్నడ, ఆంగ్ల కవితలు భారతదేశంలోనే కాదు అమెరికాలోనూ విస్తృతంగా ప్రభావం చేసినవో, చాలా ఎక్కువగా చదువబడినవిగా మిగిలినవో ఆయనే బహుముఖ కవి, రచయిత ఏకే రామానుజన్. ఆయన భారత దేశంలో పుట్టినా, ఆఖరి శ్వాస వరకూ అమెరికాలోనే గడిపాడు. ఆయన అధిక సంఖ్యలో అకడమిక్ లిటరరీ జర్నల్స్ కు రాసిన ఆయన రచనల ద్వారా ప్రాక్ పశ్చిమ సంస్కృతులను పరస్పరం అర్థంచేసుకునేలా చేశాడు. ఆయన ఒక చోట పేర్కొన్నట్లు "నేను భారత్ అమెరికాల నడుమ ఒక హైఫన్(అడ్డగీత)ను.అకడమిక్ లిటరరీ వ్యాఖ్యాతలు రామానుజన్ జ్ఞాన తేజస్సును, మానవీయతను, సాధారణతను పొగిడారు. శ్రమకోర్చిన ఆయన తమిళ,కన్నడ కవిత్వ అనువాదాలు కొన్ని రెండు వేల సంవత్సరాల క్రితం నాటివి,ప్రాచీన సాహిత్యంలోని గొప్పతనం, సునిశిత నైపుణ్యాన్ని ఒడిసిపట్టినవి.ఆయన ఒక మార్గదర్శక కవి. స్వాతంత్ర్యానంతర భారతీయ కవిత్వాన్ని ఆంగ్లంలో ఆవిష్కరించిన వారిలో ఒకరిగా పరిగణించబడుతున్నారు. భారతీయ సంప్రదాయాలను, ఆధునిక సిద్ధాంతాన్ని తన రచనలలో చేర్చారు. ఆయన ద్విభాషా రచయిత. ఇంగ్లీషు, కన్నడ రెండింటిలోనూ కవిత్వం రాసి ప్రచురించారు. గొప్ప ప్రభావవంతమైన అనువాదకుడుగా ఆయన తమిళ క్లాసిక్ కురుంతొకై మరియు కవి నమ్మాళ్వార్ శ్లోకాలతోసహా దక్షిణాసియా గ్రంథాలను అనువదించడంలో ఆయన గణనీయమైన కృషికి చేసినారు.

జానపద, మౌఖిక సంప్రదాయాలపై

భారతీయ జానపద, మౌఖిక సంప్రదాయాలపై రచనలను అన్వేషించి ప్రచురించిన జానపద రచయిత. 16 మార్చి 1929న మైసూర్ లో జన్మించిన ప్రొఫెసర్ అట్టిపట్ కృష్ణమూర్తి రామానుజన్ 1976లో భారత ప్రభుత్వం నుండి పద్మశ్రీ, 1983లో మాక్ఆర్థర్ ఫెలోషిప్ అందుకున్నారు. 1999లో మరణానంతరం 'ది కలెక్టెడ్ పద్యాలు' అనే గ్రంథానికి సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఆయనను భారతీయ వారసత్వం, పాశ్చాత్య దృక్పథాల ప్రత్యేకమైన మేళవింపుగా వర్ణించవచ్చు. దక్షిణాసియా భాషలు, సంస్కృతులపై అధ్యయనం ఇంకా శాస్త్రీయ, జానపద సంప్రదాయాలను ఆయన అధునాతనంగా నిర్వహించడంచేత ఆయన రచనలు ఇప్పటికీ ప్రభావవంతం చేస్తూ ఉన్నాయి. ఆయన వెలువరించిన ప్రముఖ కవితా సంపుటాలలో ది స్ట్రైడర్స్ 1966లో, రిలేషన్స్ 1969లో, సెకండ్ సైట్ 1986 సంకలనాలు కలవు. ఆయన ప్రధాన అనువాదాలలో ది ఇంటీరియర్ ల్యాండ్‌స్కేప్. సంగం తమిళం నుండి వచ్చిన కవితలు, స్పీకింగ్ ఆఫ్ శివ ప్రశంసలు కనిపిస్తాయి. ఆయన ప్రసిద్ధ రచనలలో ఒకటయిన '300 రామాయణాలు ఐదు ఉదాహరణలు,మూడు ఆలోచనలు' వ్యాసం న్యాయపరంగా చిక్కులు, మతం సెంటిమెంట్ పరంగా ఆగ్రహ నిరసనలనూ ఎదుర్కొన్నది.

సైద్ధాంతిక, సౌందర్య రచనలు

భారతీయ అధ్యయనాలకు రామానుజన్ రాసిన సైద్ధాంతిక, సౌందర్య రచనలు అనేక నియమాలతో విస్తరించి ఉన్నాయి. "భారతీయ ఆలోచనా విధానం ఉందా?" 1990లోని అతని సాంస్కృతిక వ్యాసాలలో, అతను "సందర్భసున్నితమైన" ఆలోచన అని పిలిచే భారతీయ మనస్తత్వ శాస్త్రం పరంగా సాంస్కృతికన భావజాలాలు, ప్రవర్తనా వ్యక్తీకరణలను వివరించాడు. జానపద అధ్యయనాలలో తన రచనలో, రామానుజన్ భారతీయ మౌఖిక, వ్రాతపూర్వక సాహిత్య సంప్రదాయం అంతర్‌పాఠ్యాన్ని హైలైట్ చేశాడు. ఆయన రాసిన "వేర్ మిర్రర్స్ ఆర్ విండోస్: టువార్డ్ యాన్ ఆంథాలజీ ఆఫ్ రిఫ్లెక్షన్స్" 1989లోని వ్యాసం, ది ఇంటీరియర్ ల్యాండ్‌స్కేప్: లవ్ పోయమ్స్ ఫ్రమ్ ఎ క్లాసికల్ తమిళ్ ఆంథాలజీ 1967,ఇంకా ఫోక్ టేల్స్ ఫ్రమ్ ఇండియా, ఓరల్ టేల్స్ ఫ్రమ్ ట్వంటీ ఇండియన్ లాంగ్వేజెస్ వంటి వ్యాసాలన్నీ భారతీయ జానపద కథల అధ్యయనాలలో ఆయన చేసిన కృషికి మంచి ఉదాహరణలుగా మిగిలాయి. ఆయన "స్పీకింగ్ ఆఫ్ శివ" అనే సాహిత్య అధ్యయనం,1970లలో ఆయన రాసిన కన్నడ ప్రాంతంలోని శైవ భక్తులకు వీరశైవుల సమకాలీన అవగాహనను రూపొందించడంలో చాలా ప్రభావవంతంగా ఉంది. శివుడి గురించి మాట్లాడటం వీరశైవులు, దక్షిణాసియా భక్తివాదం, హిందూ మతాన్ని ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లీష్ మాట్లాడే వివిధ వర్గాలకు మరింత విస్తృతంగా పరిచయం చేసింది. 'సంగం కవిత్వం గ్రంథాన్ని తమిళ సాహిత్యాన్ని ఆంగ్లంలోకి అనువదించారు. ప్రాచీన భారతీయ కవిత్వాన్నికూడా అనువదించి భారతీయ సాహిత్యం గొప్పతనాన్ని పాశ్చాత్య ప్రపంచానికి అందించారు.

భారతీయ సంప్రదాయాన్ని

రామానుజన్ భారతీయ సంప్రదాయాన్ని, భావాలు ఇంకా నైతికతగల సంబంధాలను తెంచుకోలేదు. ఆయనకు విదేశీయుల పట్ల ఉన్న సున్నితత్వమే భారతదేశం ,అమెరికాలో తన భావాలను నిష్పాక్షికంగా, ఖచ్చితమైన రీతిలో చిత్రీకరించే అవకాశాన్ని కల్పించింది. సృజనకారుడు ఇ.ఎన్.



లాల్ అన్ననట్లుగా, "రామానుజం కవితలు భారతీయ, పాశ్చాత్య భావాలను అనుభవించే భారతీయ విధానంలో మరి దానిని నిర్వచించే పాశ్చాత్య విధానంలో ఉద్భవించాయి. ఆయన కవితల్లో ఎక్కువ భాగం, వ్యక్తిగతమైనవి, వారి స్వంత సార్వత్రిక కోణాన్ని కలిగి ఉంటాయి."ఆయన కవిత్వంలో ప్రకృతి,కుటుంబం, ప్రేమ, నిరాశ మరణం వంటివి ప్రధానమైన ఇతివృత్తాలు. వాటిలో వ్యంగ్యం, హాస్యం, వైరుధ్యంతో పాటు ఆకస్మిక తిరోగమనాలతో నిండి ఉంటాయి. రామానుజన్ కొన్ని కవితలు నా తెలుగు అనువాదం తో...

1 .సెల్ఫ్ పోట్రేయిట్ కవిత అనువాదం:

"స్వీయ చిత్రం"

"నేను ప్రతి ఒక్కరిని పోలివున్నా/కానీ నేనే,దుకాణం అద్దాల కిటికీలపై/కాంతి శాస్త్రం ప్రసిద్ధ నియమాలున్నా,/తారీఖు లేని అపరిచితుని చిత్రాన్ని /తరుచుగా ఓ మూలకు మా నాయిన చేసేటి సంతకం".

2. ఎకాలజీ కవిత అనువాదం

"జీవావరణశాస్త్రం"

తొలి చినుకు తరువాతి రోజు,చాలా యేండ్లకు,నేను ఇంటికి వస్తా తీరని కోరికతో, మైలు దూరమునుండి నేను చూడగలను కాబట్టి మన మూడు ఎర్ర సంపంగి చెట్లు మళ్ళీ ఆ చేసినవి, పూలుగా విరిసి అమ్మకు ఇచ్చినవి కళ్ళు చెదిరే తొలి పార్శ్వశూల ఈ ఋతువులో వాసన వారి వీధి పొడవంత, ఎంతో బరువుతో వేలాడినవి పసుపుపచ్చ పరాగపు మంచు పరిమళంతో ఏ గాలీ జల్లెడ పట్టలేని తీరు, ఏ తలుపూ బయటకు మూసుకోదు మా నల్ల స్తంభాల ఇంటి నుండి దేని గోడలకు మరి చెవులు కనులున్నవో, పొలుసులు, వాసనలు, ఎముకల చప్పుడు, రాత్రిపూట వచ్చే శబ్దాలు, మనలాగే సూక్ష్మరంధ్రాలు కలిగి ఉండేవి, కానీ అమ్మ, తన కోపాన్ని రెచ్చగొడుతోంది,ఆమె తల్లి మెలితిప్పిన వెండి కడియమలా, మనవళ్ల నిక్కర్ల మాదిరిగా తలపై చల్లని బట్టలా తడితడిగా,మనలను కోసుకోనివ్వదు ,ఓ పూచే చెట్టు."


కవిత

మై సెల్ నెంబర్

ఇప్పుడు
నా చిరునామా ఇదే
ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ
తెరమరుగైపోయాక
పది అంకెల నెంబర్
తనలో నన్నే నాలో తనో
మమేకం అయిపోయింది
రోజంతా ఎన్ని కబుర్లు
ఈ అంకెలగుండా జారిపోతాయో
ఎన్ని ప్రేమ వాక్యాలు జాలువారుతాయో
అనుసంధానమైన ఈ వంతెన గుండా
సమాచారం బట్వాడా అయిపోతుంది
చేతిలో చిల్లిగవ్వ లేకున్నా
సెల్లుమాత్రం వుండాలి..
నేను ఎక్కడ వున్నానో
ఎక్కడ వుండాలో..
ఎప్పుడు కదలాలో..ఎప్పుడు కలవాలో
అన్నీ తానై చేతిలో నాలుకై
అదే మాటలమూటై శాసిస్తుంది
డబల్‌నైన్ ఫోర్‌నైన్ జీరో
ఫైట్ డబుల్ త్రీ టూ సెవెన్ అంటూ..
ఎన్నిసార్లు నన్ను పట్టుకోవటానికి
ఇతరులకు చెప్పివుంటానో
ఈ నెంబరొక్కటి చాలువాళ్లకు
నన్ను ఆసాంతం దొరకబుచ్చుకోవటానికి
అప్పుడప్పుడు ఆగకుండా గొడవచేస్తది
అవిశ్రాంతంగా కూస్తాంటది
దాని పీకనొక్కాలనుకుంటాను
నా పీకల మీదికొస్తది
నన్ను నేను కోల్పోకుండా
ఒంటరై పోకుండా అది నన్ను
ఓదారుస్తోందో తెలియదు కానీ
ఓ నెంబర్‌కు మనం బ్రతుకంతా వేళ్లాడటం
విచిత్రమనిపిస్తోంది వింతనిపిస్తోంది కానీ
ఎక్కడి ఎక్కడి వాళ్లనో ఇట్టే కలిపేస్తోంది
మాటల పూలతోటై ఇట్టే అల్లేస్తుంది
సెల్లు పోయినా నెంబరు మార్చను
ఇప్పుడు ఆ నెంబర్ నా ఐడెంటిటీ
కొన్ని బంధాలు కొన్ని అనుబంధాలు
ఓ నెంబర్‌పై తచ్చాడటం
విడ్డూరంగా వుంటుందేమో కానీ
మారినకాలం మంత్రదండాలను తిప్పుతోంది
మనసుండి మనల్ని విడదీయని సంకెల సారథిగా
మనల్ని కూడుకున్న అంకెల వారధిగా
అది హృదయంలో గూడు కట్టేసుకుంటుంది
నువ్వు ఏదైనా మరిచిపోవచ్చునేమోగానీ
మరువలేని శిలాఫలకమై పోతుంది
ఇప్పుడు నడిసంద్రంలోనైనా
నిన్ను నడిపించే నావ నీ సెల్‌నెంబర్..!



డా.కటుకోఝ్వల రమేష్
సెల్:9949083327



ఎడారి వసంతం–29
గొలుసు కథ
సింగిడి
పేజీ 11లో

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com

ప్రాంతీయం

ఓపెన్ డ్రైన్ల నిర్మాణానికి రూ.7.5 కోట్లు

- **ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**



ప్రతిపక్షం, ఎల్.బి.నగర్, నవంబర్ 30 : ఓపెన్ డ్రైన్ల నిర్మాణానికి అభివృద్ధి పనులకు రూ. 7.5 కోట్లు మంజూరు చేశామని శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని పది కాలనీల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుల కోరిక మేరకు సెవెన్ హిల్స్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ జేఏసీ సమావేశంలో సెవెన్ హిల్స్ కాలనీ, స్వాతి గార్డెన్స్, ద్వారకానగర్, డీ.పీ.నగర్, హిమపురి కాలనీ 1 & 2, సౌత్ ఎండ్ పార్క్, సహారా, జడ్జెస్ కాలనీ, చండీశ్వర్ కాలనీ, ప్రెస్ కాలనీ వాసుల ప్రతినిధులు పాల్గొన్నారు. కాలనీవాసులు మాట్లాడుతూ పక్కనే ఉన్న డంపింగ్ యార్డు కారణంగా వస్తున్న తీవ్రమైన దుర్వాసనతో పాటు చర్మవ్యాధులు, శ్వాసకోశ సమస్యలు అధికమవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాత్రివేళల్లో రహస్యంగా కెమికల్ వ్యర్థాలు నాలాలో విడుదల చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో డంపింగ్ యార్డు చుట్టుపక్కల ప్రాంతాల్లో అధికారులు పర్యటించి పరిస్థితులను పరిశీలించి నివేదికలు సేకరించిన విషయాన్ని గుర్తు చేశారు. పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రస్తుతం పనిచేయడం లేదని, వాటి పునరుద్ధరణపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులతో మళ్లీ చర్చించి గోడౌన్లపై మరోసారి పరిశీలనలు నిర్వహిస్తామని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం నిలిచివున్న పొల్యూషన్ నీటిని మోటర్ల ద్వారా తొలగించే పనులు జరుగుతున్నాయని తెలిపారు. వ్యర్థ రసాయనాలు వదిలే వాహనాలను స్థానికులు గుర్తించి అధికారులకు మరియు తమకు సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇటీవల హైడ్రా, పొల్యూషన్, హైలా, జీహెచ్ఎంసీ, ఫారెస్ట్ అధికారులతో సమన్వయం చేస్తూ దుర్వాసన సమస్యను తగ్గించే చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఓపెన్ డ్రైన్ల నిర్మాణానికి రూ. 7.5 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. పనులు పూర్తయితే చుట్టుపక్కల కాలనీలకు దుర్గంధ సమస్య నుంచి పూర్తిగా విముక్తి లభిస్తుందని అన్నారు. డ్రైన్ పనుల సమయంలో కొన్ని అసౌకర్యాలు కలిగినా కాలనీవాసులు అధికారులకు సహకరించాలని కోరారు. ఇక్కడ వ్యర్థ రసాయనాలు వేదజల్లే వాహనాలు మీరు పట్టుకొని స్థానిక అధికారులకు,అలాగే మాకు కూడా సమాచారం ఇస్తే అట్టి వాటిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనికి స్పందించిన కాలనీవాసులు, తమవంతు సహకారం తప్పకుండా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, సీనియర్ బి.ఆర్.ఎస్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, జగదీష్ యాదవ్, సతీష్ యాదవ్, మహిళా నాయకురాలు శిల్పారెడ్డి,జేఏసీ అధ్యక్షులు కత్తుల రాంబాబు, రమేష్, చంద్రారెడ్డి, అంజయ్య, జనార్ధన్, బిక్షం, యాదగిరి, రాజేష్, మధుసూదన్ రెడ్డి, రవికిరణ్ చారి, గోపీకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాలనీల అభివృద్ధికి సమస్యల పరిష్కారానికి కృషి

- **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

ప్రతిపక్షం, ఉప్పల్ , నవంబర్ 30 :కాలనీల అభివృద్ధికి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి , కాప్రా డివిజన్ల పరిధిలోని వంపుగూడ , గణేష్ నగర్ ,సోనియా గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణం అలాగే బస్ సౌకర్యం, బార్ నీ ఇక్కడి నుండి తొలగించాలని అలాగే డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నవీన్ గౌడ్ ,ఎస్సి సెల్ జిల్లా చైర్మెన్ పత్తి కుమార్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు మల్లన్న శివ , కిట్టు నూతన కమిటీ అధ్యక్షుడు సత్తయ్య ప్రధాన కార్యదర్శి మంజుల కమిటీ సభ్యులు గణేష్ రవీందర్ నేమి చంద్ పటేల్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





హైడ్రా జిందాబాద్ అంటూ చిన్నారుల ర్యాలీ

- **రెండు పార్కులు కాపాడినందుకు హైడ్రాకు ధన్యవాదాలు**

ప్రతిపక్షం, సిటి బ్యూరో, నవంబర్ 30: మేడ్చల్ మల్కాజగిరి జిల్లా నిజాంపేట కార్పొరేషన్ బాచుపల్లిలో పార్కులు కాపాడినందుకు గాను అక్కడి చిన్నారులు హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు. కాకతీయ కాలనీలో 600 గజాలు, 1500 గజాల రెండు పార్కులను కాపాడినందుకు గాను హైడ్రా కు మద్దతు తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది చిన్నారులు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. మాకూఆడుకునే స్థలం దొరికింది అని సంబరపడ్డారు. ప్రాణవాయువును అందించే పార్కు స్థలాన్ని కాపాడారు. అందులో మొక్కలు నాటి జాగ్రత్తగా కాపాడుకుంటామని నినదించారు. హైడ్రా వల్ల ఈ పార్కులు కాపాడుకున్నామంటూ నినదించారు.



సామాజిక సేవలో వికలాంగులకు ట్రై సైకిళ్లు

- **అందజేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

ప్రతిపక్షం,సిటి బ్యూరో , నవంబర్ 30 : మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నంది హిల్స్‌కు చెందిన జూలూరు సైదులు, లెనిన్ నగర్‌కు చెందిన పుల్లయ్య, నేదునూరుకు చెందిన దేవరకొండ అంజయ్యలకు ట్రై సైకిళ్లను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా వికలాంగులకు సహాయ సహకారాలు అందించడం బాధ్యత మాత్రమే కాక, సామాజిక బాధ్యత కూడా అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, అవసరాలను గుర్తించి సేవ చేయడం కొనసాగుతుందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్, శీను నాయక్, మహిళా అధ్యక్షురాలు సునీత బాలరాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు రజాక్, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివ, రాళ్లబండి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ జడ్జి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 30 : తెలంగాణా రాష్ట్ర జ్యూడిషియల్ సర్వీసులో సివిల్ జడ్జెస్ (జూనియర్ డివిజన్) స్థాయిలో 66 పోస్టులను భర్తీ చేయడానికి ఆన్‌లైన్ పద్ధతిలో అర్హులైన వారినుండి ధరకాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలంగాణ హై కోర్ట్ రిజిస్ట్రార్ తెలియ చేశారు. ఈ సివిల్ జడ్జిల (జూనియర్ డివిజన్) పోస్టులకు డిసెంబర్ 8 వ తేదీ నుండి 29 మధ్యలో దరఖాస్తులను ఆన్‌లైన్‌ద్వారా పంపాల్సి ఉంటుందని తెలిపారు. ఈపోస్టుల పరీక్ష తేదీలు, హల్ టికెట్ల డౌన్ లోడ్, కంప్యూటర్ ఆధారిత స్క్రీనింగ్ పరీక్ష తదితర వివరాలను వెబ్‌సైట్ లో ప్రకటించడం జరుగుతుందని రిజిస్ట్రార్ తెలిపారు. ఈ నోటిఫికేషన్ వివరాలను హైకోర్ట్ వెబ్సైట్ http://tshc.gov.com లో ఉంచడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు.



కేసీఆర్ సంకల్ప బలానికి, దీక్షాదక్షతకు సాక్ష్యం దీక్షా దివస్

- **ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**

ప్రతిపక్షం, ఉప్పల్ ,నవంబర్ 30 : కేసీఆర్ సంకల్ప బలానికి, దీక్షాదక్షతకు సాక్ష్యం దీక్షా దివస్ అని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేపట్టిన చారిత్రాత్మక దీక్షను స్మరించుకుంటూ బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు బద్రుద్దీన్ ఆధ్వర్యంలో మల్లాపూర్ స్వాగత్ కన్వెన్షన్ లో జరిగిన దీక్ష దివస్ లో మాజీ హోం మంత్రి మహమ్మద్ అలీతో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. అనంతరం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...కెసిఆర్ చేసిన ఉద్యమ పోరాటం, గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు.తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అన్న తెగువతో నాలుగు కోట్ల మందిని ఏకం చేసి, కాశ్మీర్ నుండి కన్యా కుమారి వరకు అన్ని రాజకీయ వ్యవస్థలను ఒప్పించి మెప్పించి కుల మతాలకు అతీతంగా ఏకం చేసిన దీక్షా దివాస్ ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. కేసీఆర్ సంకల్ప బలానికి, దీక్షా దక్షతకు సాక్ష్యం దీక్షా దివస్ అని ఆయన అన్నారు.అరవై ఏండ్ల గాయాలు, వేదనలను తెలంగాణ కన్నీళ్లను తీర్చిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ గారు అని ఆయన తెలిపారు. గాలి, నీరు, నేల ఉన్నంత కాలం తెలంగాణలో కేసీఆర్ అనే మూడక్షరాలు పదిలం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఇంతియాజ్ ,అజం అలీ, కలీం బీఆర్ఎస్ పార్టీ మల్కాజ్ గిరి పార్లమెంట్ ఇంఛార్జి రాగిడి లక్ష్మారెడ్డి , కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి, గీత ప్రవీణ్ ముదిరాజ్ , బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి కొత్త మద్యం పాలసీ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్ , నవంబర్ 30: రాష్ట్రంలో సోమవారం నుంచి కొత్త మద్యం పాలసీ అమల్లోకి వస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలు అధికారికంగా కొత్త ఓనర్ల చేతికి మారుతున్నాయి. వీటితో పాటు అనధికారికంగా ఈ ఏడాది కొత్తగా 40 వేల బెల్టు దుకాణాలు రాబోతున్నట్టు అంచనా. ఇప్పటికే గ్రామాల్లో వీధివీధికి మనుగడలో ఉన్న పాత బెల్టు దుకాణాలను కలుపుకుంటే 1.45 లక్షల బెల్టు దుకాణాలు గ్రామాల్లో మద్యం ఏరులను పారించనున్నట్టు సమాచారం. తెలంగాణలో మద్యం దుకాణాలు, బార్ల సంఖ్య రోజురోజుకు భారీగా పెరుగుతున్నదని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్రానికి కొత్త పేరు పెట్టాల్సి వస్తుందని జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం ఇటీవల వ్యాఖ్యానించింది. నివాసాల మధ్య మద్యం దుకాణాల ఏర్పాటుపై దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది.

మొయినాబాద్‌లో నామినేషన్ల పర్వం

- **19 పంచాయతీలకు గాను 18 నామినేషన్లు దాఖలు**
- **166 వార్డు సభ్యులకు గాను 35 నామినేషన్లు దాఖలు**



ప్రతపక్షం, మొయినాబాద్, నవంబర్ 30 : మొయినాబాద్ మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీలకు 18 నామినేషన్లు మొదటి రోజు దాఖలైయ్యాయి. 166 వార్డు సభ్యులకు 35 వార్డుల సభ్యులనామినేషన్లు దాఖలైనట్లు మండల అధికారి సంధ్య తెలిపారు. ఆదివారం తెలంగాణ రాష్ట్రంలో రెండవ విడత పోలింగ్ సందర్భంగా డిసెంబర్ 14న జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలకు గాను నామినేషన్ల పర్వం నవంబర్ 30న మొదటి రోజు 19 గ్రామ పంచాయతీలకు గాను ఐదు క్లస్టర్లలో నామినేషన్ల స్వీకరణ అధికారులు స్వీకరించారు. 19 గ్రామ పంచాయతీలకు 18 నామినేషన్లు రాగా, 166 వార్డు సభ్యులకు గాను 35 వార్డు సభ్యుల నామినేసన్ వచ్చినట్లు అధికారి సంధ్య తెలిపారు. మరో రెండు రోజుల పాటు సోమ, మంగళవారం నామినేషన్లను ఆయా క్లస్టర్లలో స్వీకరించబడతాయని ఉదయం 10.30 గంటల నుంచి 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు.



మృతుడి కుటుంబానికి పూర్వ విద్యార్థుల బాసట

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 30: నల్గొండ జిల్లా చిట్యాలలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 200405లో 10వ తరగతి చదువుకున్న మేడి యాదగిరి మునుగోడు మండలం ఊకొండి గ్రామంలో ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కూతుర్లు, కొడుకు ఉన్నారు. మృతుడు యాదగిరితో పాటు చదువుకున్న మిత్ర బృదం కుటుంబానికి అండగా నిలిచారు. పిల్లల పేరున పోస్ట్ ఆఫీస్‌లో చేసిన రూ.60 వేల ఫిక్స్ డిపాజిట్ పత్రంతో పాటు నిత్యవసర సరుకులను అందించారు.



విద్య ఏ ఒక్కరి సొంతం కాదు

- **విజయం దక్కేవరకు పోరాటం చేయాలి**
- **నల్గొండ జిల్లా ఎస్పీ**

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 30: విద్య ఏ ఒక్కరి సొంతం కాదని ప్రతి ఒక్కరూ కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాల ను అధిరోహించవచ్చని నల్గొండ జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ అన్నారు. నాతి లక్ష్మీనరసింహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో ఆదివారం నిర్వహించిన విద్యా ఉద్యోగ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్యా ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. యువత నిరాశ నిస్పృహలకు లోను కాకుండా జీవితం పై ఆశతో విజయం దక్కేవరకు పోరాటం చేయాలన్నారు. అప్పుడే ఉన్నత లక్ష్యాలను చేరుకుంటామన్నారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా కష్టపడి చదివి మంచి స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, సీఐ నాగరాజు, ఎస్ఐ మామిడి కుమార్, ఫౌండేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ నాతి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

దూసుకొస్తున్న దిత్వా తుఫాను

- **సోమవారం పలు జిల్లాలలో తేలికపాటి వర్షా లు**
- **వాతావరణ శాఖ వెల్లడి**




ప్రతిపక్షంస్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 30 : తెలంగాణ రాష్ట్రంపై దిత్వా తుఫాను దూసుకొస్తుంది.. ఇప్పటికే అతలాకుతలం అవుతున్న తమిళనాడు, పుదుచ్చేరికి మరింత ముప్పు పొంచి ఉంది. ఏపీలో తెల్లారేసరికి ఎప్పుడైనా ఫ్లాష్ ఫ్లడ్ రావచ్చంటూ వాతావరణ శాఖ అధికారులు అలర్ట్ జారీ చేశారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలంగాణలో వర్షాలపై కీలక అప్డేట్ ఇచ్చింది. తెలంగాణలో పలు జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ విశ్లేషణ - వాతావరణ హెచ్చరికలు ఈ కింది విధంగా ఉన్నాయి. శనివారం నైరుతి బంగాళాఖాతం - ఉత్తర శ్రీలంకకు ఆనుకుని ఉన్న ప్రాంతంలో ఉన్న చక్రవాత తుఫాన్ దిత్వా ఇంచుమించు ఉత్తర దిశలో కదిలి, ఆదివారం ఉదయం 8:30 గంటల సమయానికి కడలూరుకు తూర్పు ఆగ్నేయంగా 100 కిలోమీటర్లు., కరైకల్ తూర్పు ఈశాన్యంగా 100 కి. మీ, పుదుచ్చేరి కు దక్షిణ ఆగ్నేయంగా 180 కి.మీ., చెన్నై కు దక్షిణం ఆగ్నేయంగా 180 కి.మీ. దూరంలో కొనసాగుతోంది. ఈ తుఫాన్ ప్రస్తుతం పుదుచ్చేరి తమిళనాడు తీరాల నుంచి సుమారు 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. రాగల 24 గంటల్లో ఈ దిత్వా తుఫాను ఉత్తర దిశగా ఉత్తర తమిళనాడు తీరానికి సమాంతరంగా కదిలే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది.

రాగల 3 రోజులకు వాతావరణ సూచన..

సోమవారం రాష్ట్రంలోని కొన్నిజిల్లాలలో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కొన్ని దక్షిణ, తూర్పు జిల్లాలలో కొన్నిచోట్ల కురిసే అవకాశం ఉంది. మంగళవారం రాష్ట్రంలోని కొన్ని తూర్పు, దక్షిణ జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది.ఆదివారం, సోమవారం రాష్ట్రంలోని కొన్ని దక్షిణ - తూర్పు జిల్లాలలో భారీ వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

“



ఆపరేషన్ సిందూర్ ఇప్పటికీ కొనసాగుతోంది. ముందస్తు హెచ్చరికలు లేకుండానే ఘర్షణలు చెలరేగవచ్చు. 24 గంటలూ సిద్ధంగా ఉండాలి. అన్ని దళాల్లో వైమానిక రక్షణ అవసరం. పాకిస్తాన్ నేవీ తమ హార్బర్లకే పరిమితం అయ్యేలా చేశాం. సముద్ర మార్గాలను కాపాడుతూ ఇండో పసిఫిక్ అంతటా నేవీ కార్యకలాపాలు కొనసాగిస్తోంది.

- నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి

ప్రాంతీయం



ఘనంగా ముగిసిన రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడలు

- రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు వేదికగా పటాన్ చెరు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 30 : సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పట్టణ పరిధిలోని మైత్రి మైదానం వేదికగా గత మూడు రోజులుగా జరుగుతున్న 44వ తెలంగాణ రాష్ట్ర అంతర్ జిల్లా అండర్ 14 బాలుర బాలికల కోకో క్రీడా పోటీలు ఆదివారం ఘనంగా ముగిసాయి. ముగింపు వేడుకలకు పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. పటాన్ చెరు నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు వేదికగా పటాన్ చెరు నిలవబోతోందని తెలిపారు. అనంతరం అండర్ 14 బాలుర విభాగంలో ఆదిలాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో, రంగారెడ్డి జిల్లా జట్టు రెండవ స్థానంలో, హైదరాబాద్ జట్టు మూడో స్థానంలో నిలిచాయి. అండర్ 14 బాలికల విభాగంలో ఆదిలాబాద్ ప్రథమ స్థానంలో మహబూబ్నగర్ రెండవ స్థానంలో, నల్లగొండ మూడవ స్థానంలో నిలిచాయి. క్రీడాకారుల కోసం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సొంత నిధులతో ఉచిత వసతి, భోజనం, బహుమతులు అందజేశారు.



నూతన కాలనీలకు స్వచ్ఛ జలాలు

- పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 30 : శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలోని నూతన కాలనీలకు సైతం మిషన్ భగీరథ మరియు జలమండలి ద్వారా స్వచ్ఛ జలాలు అందించేందుకు కృషి చేస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలో గల అపార్ట్మెంట్ వాసులకు జలమండలి ద్వారా మంచినీటి పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు నూతన రిజర్వాయర్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కృషి డిఫెన్స్ కాలనీ అధ్యక్షులు అమరేందర్, జనరల్ సెక్రటరీ ఐలయ్య, శ్రీరాములు, కేడీసీ అపార్ట్మెంట్ ప్రెసిడెంట్ అరుణ్ బాబు యాదవ్, జనరల్ సెక్రటరీ కోట గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



శబరిమల వెళ్తున్న గూడెం మధుసూదన్ రెడ్డికి సన్మానం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 30 : పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి అయ్యప్ప మాల ధారణలో బాగంగా ఈ రోజు శబరిమల ప్రయాణమై వెళ్తున్న సందర్భంగా తెలంగాణ ఆటో యూనియన్ జేఏసీ ఉపాధ్యక్షులు చోటు భాయ్ (దస్తగిర్) తన బృందంతో పాటు కలసి గూడెం మధుసూదన్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. క్షేమంగా వెళ్ళి ఆ అయ్యప్ప స్వామి వారి దర్శనం చేసుకుని తిరిగి క్షేమంగా రావాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇమామ్ఉద్దీన్ భాయ్, అనంతయ్య, సాదిక్,ఖాదర్,వంగరి అశోక్ ,హరి , మల్లేష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



కొన ఊపిరితో ముళ్ళ పొదల్లో నవజాత శిశువు

- ఊపిరి పోసిన 108 సిబ్బంది



ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట. నవంబర్ 30: నారాయణపేట మండలంలోని అప్పక్ పల్లి గ్రామ సమీపంలో జరిగింది. గ్రామ సమీపాన కాటన్ మిల్లి సమీపంలో ముళ్లపొదల్లో ఆడశిశువును గుర్తుతెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లారు. స్థానికులు పాప ఏడుపులు విని స్థానిక యువకులు జిల్లా108 అంబులెన్స్ కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వుటవుట్టిన సంఘటన స్థలానికి చేరుకొని, ఆ నవజాత శిశువు చూసి చలించిపోయి, చిన్న గాయాలతో మరియు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న నవజాత శిశువును గమనించిన టెక్నీషియన్స్ శిరీష అంబులెన్స్ లోనే ప్రథమ చికిత్స అనగా ఆక్సిజన్, నవజాత శిశువు సంరక్షణ పద్ధతులను పాటిస్తూ, దగ్గర్లో ఉన్న నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. అనంతరం జిల్లా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మహేందర్ పరీక్షించి, ప్రస్తుతం శిశువు ఆరోగ్యం మెరుగ్గానే ఉందని చెప్పారు. నారాయణపేట జిల్లా 108 సిబ్బంది, టెక్నీషియన్ శిరీష, పైలెట్ రాములు, లాను స్థానికులు మరియు జిల్లా ఆసుపత్రి వైద్యులు మరియు నారాయణపేట జిల్లా 108 సూపర్వైజర్ రాఘవేంద్ర అభినందించారు.

కేసీఆర్ చెప్పినవి చేసిండు.. చెప్పనివి కూడా చేసిండు

- ఆడోళ్ళకి ఫ్రీ బస్సు మొగోళ్ళకి డబుల్ టికెట్ ఇది మోసం
- రేవంత్ రెడ్డి అన్ని మోసాలే చేసిండు
- మాజీ మంత్రి హరీష్ రావు



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 30 : నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. శంకరంపేట(ఎ) మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అలుగుల సత్యనారాయణ నేతృత్వంలో సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి హరీష్ రావు గులాబీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ లో చేరిన ముఖ్య నాయకులు. అలుగుల సత్యనారాయణ (శంకరంపేటఏ మాజీ సర్పంచ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు), భవాని నరసింహ చారి (మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు), ఉప్పులూరి దశరథ్ (ఉప సర్పంచ్), ఉష సూర్య ప్రకాష్ (గొట్టిముక్కల మాజీ సర్పంచ్), సంగమేశ్వర్ (మాదిగ దండోరా అధ్యక్షులు), వీరితో పాటు మరో 200 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ లో చేరారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లయింది. ఎన్నికల ముందు గ్యారెంటీ కార్డులు పంచి బాండ్ పేపర్ కూడా రాసిచ్చారు. ఇప్పటికీ రెండు సంవత్సరాలయింది ఒక్క హామీ కూడా అమలు చేయలేదు అని అన్నారు. 200 పెన్షన్ 2000 చేసింది, ఇంటింటికి మంచినీళ్లు అందించింది కేసీఆర్, పదివేల రైతుబంధు ఇచ్చింది కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ కిట్టు పెట్టి 13వేల రూపాయలు కాన్పుకి ఇచ్చింది, పిల్లల చదువుల కోసం వెయ్యి గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసింది, నారాయణఖేడ్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాలు పెట్టింది కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ చెప్పినవి చేసిండు చెప్పనివి కూడా చేసిండు. కానీ రేవంత్ రెడ్డి 2000 పెన్షన్ను 4000 ఇస్తానన్నాడు. ఏమైంది కేసీఆర్ ఇచ్చిన 2000 తప్ప ఒక్క రూపాయి అయినా ఎక్కువ వచ్చిందా. కొడుకు కొనిచ్చినా కొనయ్యక పోయినా బతుకమ్మకు బతుకమ్మ చీర పంపిండు కేసీఆర్. బతుకమ్మకు రెండు చీరలు ఇస్తానన్న రేవంత్ రెడ్డి బతుకమ్మకు చీరలకు ఎగ్గొట్టిండు. ఓటు కోసం ఒక చీర పంపిండు అది కూడా కొందరికి మాత్రమే. ఆ చీరలు పోరగాండ్ల స్కూలు యూనిఫామ్ లాగా ఉంది రేవంత్ రెడ్డి పంపిన చీర. ఒక చీరకు సారె పెట్టిన అంటున్నారు. 60 వేల రూపాయలు ప్రతి అక్కకు చెల్లెకు బాకీపడ్డాడు రేవంత్ రెడ్డి. మహాలక్ష్మి కింద 60,000 ఇచ్చి సారె పెట్టిన అని చెప్పు రేవంత్. కల్యాణ లక్ష్మి లేదు. తులం బంగారం అంతకంటే లేదు. అరచేతిలో వైకుంఠం చూపించి ఆగమాగం చేసిండని అన్నారు. న్యూట్రిషన్ కిట్ బంద్ అయింది. విస్కీ, బీర్ల ధరలు పెంచి జేబులు గుల్ల చేసి ఆరోగ్యాన్ని పాడు చేసిండు. పంట వేసిన వారికే రైతుబంధు ఇస్తా అంటున్నాడు రేవంత్ రెడ్డి. పత్తి, చెరుకు కంది పంటలు వేసిన రైతులకు రైతుబంధు రామ్ రామ్ అన్నారు. డబ్బాలో ఓట్లు పడంగనే సగం మందికి కూడా రైతు బంధు వేయలేదు. యువతను ఊరించి యువ వికాస అని మోసం చేశారు. ఎవరికీ వికసించక ముందే అది వాడిపోయింది. ఏ రోడ్లు చూసినా గుంతల మయం అయిపోయాయి. నారాయణ ఖేడ్ లో రోడ్లు లేని పరిస్థితి. ఆడోళ్ళకి ఫ్రీ బస్సు మొగోళ్ళకి డబుల్ టికెట్ ఇది మోసం కాకపోతే ఏమిటని అన్నారు. రేవంత్ రెడ్డి అన్ని మోసాలే చేసిండు, కాంగ్రెస్ పాలనలో కనీసం ఊర్లలో ట్రాక్టర్లలో డీజిల్ కి డబ్బులు లేవు. వీధి దీపాలకు బల్బులు లేవు. కేసీఆర్ ఉన్నప్పుడే మంచిగా ఉండే అని అందరూ యాది చేసుకుంటున్నారని అన్నారు. మాటలు తప్ప చేతలు లేవని, పోలీసులను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారు. పోలీస్ ప్రహారాలో పాలన చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ని తుక్కుతుక్కుగా ఓడిస్తేనే పథకాలు అమలైతాయన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటుతో సురుకు పెట్టాలని అన్నారు.



వాసవి క్లబ్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 30 : వాసవి క్లబ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఎల్ఎన్ కన్వెషన్ లో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ స్వదీపోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. సమాజ అభివృద్ధి, శ్రేయస్సు కోసం రానున్న రోజుల్లో వాసవి క్లబ్ సేవలను మరింత విస్తృతపరచాలని కోరారు.



రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి

- ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 30 : కాంగ్రెస్ ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు అరిగోస పెడుతుందని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం మాదారం లో పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్ ఉద్యోగ విరమణ అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడాడు.. సైంటిస్ట్, డాక్టర్స్, పోలీస్ ఎవ్వరైనా తయారు చేసేది.. టీచరే.. ఇతర ఉద్యోగుల కంటే గౌరవం, గుర్తింపు టీచర్స్ కు ఉంటదన్నారు. 30 ఏళ్ల పాటు ప్రజలకు సేవలందించిన ఉద్యోగులకు, టీచర్స్ ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వారి ఆవేదన అర్థం చేసుకోవాలన్నారు. వారికీ హక్కుగా తాము పొందాల్సిన బెనిఫిట్స్ కోసం ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, పైరవీలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.



యూనియన్ పెట్టుకుంటే కార్మికులను తొలగిస్తారా?

- తొలగించిన కార్మికులను వెంటనే తీసుకోవాలి
- చట్టాన్ని ఉల్లంఘిస్తున్న బిస్లరి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి
- పాశమైలారం ఇండస్ట్రియల్ క్లస్టర్ (సిఐటియు) కన్వీనర్ యూనియన్ అధ్యక్షులు అతిమేల మానిక్.
- 30 రోజులకు చేరిన బిస్లరీ కార్మికుల ఆందోళన

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 30 : చట్టబద్ధంగా యూనియన్ పెట్టుకుంటే కార్మికులను తొలగిస్తారా? యాజమాన్యం చట్టాలను గౌరవించదా? తొలగించిన కార్మికులను వెంటనే తీసుకోవాలని పాశమైలారం ఇండస్ట్రియల్ క్లస్టర్ (సిఐటియు)కన్వీనర్ యూనియన్ అధ్యక్షులు అతిమేల మాణిక్ అన్నారు. పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ వద్ద కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. తొలగించిన కార్మికులను తీసుకోవాలని, యాజమాన్యం మొండి వైఖరి నశించాలని కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ చట్టబద్ధంగా కార్మికులు యూనియన్ ఏర్పాటు చేసుకున్నందుకు బిస్లరీ యాజమాన్యం కక్షగట్టి కార్మికులం తొలగించిందని అన్నారు.. తొలగించిన కార్మికులను తీసుకోవాలని కార్మికులకు న్యాయం చేయాలని గత 30 రోజులుగా ఆందోళన చేస్తున్న యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తుందని అన్నారు. తొలగించిన కార్మికులను బేసరత్తుగా వెంటనే విధుల్లోకి తీసుకోవాలని అన్నారు. కార్మిక శాఖ డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు జోక్యం చేసుకొని కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న బిస్లరి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాజు, బిస్లరీ యూనియన్ జనరల్ సెక్రటరీ శేఖర్ రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు కోశాధికారి నవీన్, జాయింట్ సెక్రెటరీ అజయ్, సిఐటియు నాయకులు వెంకటేష్, చంద్రయ్య, శ్రీనివాస్, యాదగిరి, బిస్లరి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.





కొత్త ప్రేమ జంటకు అండగా నిలిచి

సర్పంచ్‌గా నామినేషన్ వేయించిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 30 : పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ అనుకూలెంచలేదని కులాంతర వివాహం చేసుకున్న చందు అనే యువకుడు నామినేషన్ వేయించాడు. సంగారెడ్డి జిల్లా తాళ్ళపల్లి గ్రామంలో సర్పంచ్ ఎన్నికల ఏకగ్రీవం అవుతుందని అందరూ భావించగా బిఆర్ఎస్ పార్టీ తరుపున చందు ప్రియురాలు శ్రీజ తో నామినేషన్ వేయించారు. అయితే స్క్యూటినికి వెళ్లకుండా పోలీసులు సమయం వృథా చేస్తూ స్టేషన్ లో ఉంచడంతో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వారికి మద్దతుగా నిలిచి వారిని స్టేషన్ నుంచి తీసుకొచ్చారు. తాము ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకొని ,సర్పంచ్ కు నామినేషన్ వేయడంతో ఏకగ్రీవానికి బ్రేక పడింది.



పార్లమెంటులో రాష్ట్ర హక్కుల కోసం పోరాడాలి. రేపటి నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఎంపీలు మొంథా తుఫాన్ వల్ల పంట నష్టం, మద్దతు ధర, రైతులపై ఆర్థిక భారం వంటివి ప్రధాన సమస్యలుగా చర్చించాలి. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితులు, పోలీస్ వ్యవస్థ దుర్వినియోగంపైనా ఎంపీలు తమ గళం వినిపించాలి.

- వైసీపీ అధినేత జగన్




ఘనంగా మంత్రి వివేక్ జన్మదిన వేడుకలు

- పేదలకు దుప్పట్లు, స్వెట్టర్లు పంపిణీ

ప్రతిపక్షం, మంచిర్యాల, నవంబర్ 30: పట్టణంలో ఆదివారం రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన, గనునలశాఖ మంత్రి వివేక్ వెంటస్వామి జన్మది వేడుకలను ఆ పార్టీ, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ఆయన పేరిట ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మున్సిపాల్ కార్యాలయంలో జిల్లా కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు మున్సిపల్ కమిషనర్ రాజలింగు చేతులమీదుగా చలికోట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాకారుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు అనుమాండ్ల మధు, రాకం సంతోష్‌లు మాట్లాడుతూ మంత్రి జన్మదిన వేడుకలు ప్రజలంతా ఓ పండుగగా జరుపుకుంటున్నారని పేర్కొన్నారు.

దుప్పట్ల పంపిణీ...

పట్టణంలోని 6వ వార్డు నార్లపూర్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి జన్మదినం సందర్భంగా పేదలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కుర్మ సంఘం జిల్లా అధ్యక్షులు గుంట శ్రీశైలం దుప్పట్లు పంపిణీ చేశారు. అంతకుముందు ఆయన కేక్‌కట్ చేస్తూ కార్యకర్తలకు తినిపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాగిడి రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకొని అఖిలభారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ నాయకుడు బండి సందానందం యాదవ్ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి కుటుంబ సభ్యుల పేరిట అర్చనలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు.

బీ1 క్యాంప్ కార్యాలయం వద్ద

మంత్రి వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకలను స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంత్రి జన్మదిన కేకును పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్‌గౌడ్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. అనంతరం సాయిబాబా ఆలయంలో ఆయన పేరిట అర్చనలు చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాని అనుబంధ సంఘాల నాయకులు సొత్కు సుదర్శన్, మంద తిరుమల్, పుల్లూరి లక్ష్మణ్, ఎండీ ఇసాక్, జావేద్‌ఖాన్, రజని, రాయబారపు కిరణ్, నర్సోజీ, శంకర్‌లు పాల్గొన్నారు.



నామినేషన్ల ప్రక్రియ పరిశీలించిన జిల్లా కలెక్టర్

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 30: గ్రామపంచాయతీ నామినేషన్ల ప్రక్రియ ఆదివారం ప్రారంభం కావడంతో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ నార్సింగి మండలంలో పరిశీలించారు. నామినేషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని నిబంధనకు లోబడి అధికారులు పనిచేయాలని ఆయన సూచించారు. సర్పంచు వాడు సభ్యుల నామినేషన్లు మూడు రోజులపాటు జరిగే ప్రక్రియను విజయవంతం చేయడానికి అధికారులు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రీతి రెడ్డి, తహసిల్దార్ గ్రేసీ బాయి, ఎస్ఐ సృజన, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమిలో మట్టి అక్రమ విక్రయం

- ఒకరు అరెస్ట్, మరొకరు పరారీ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 30: సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మందపల్లి గ్రామ శివారులో ప్రభుత్వ భూమి నుండి మట్టిని అక్రమంగా తవ్వి విక్రయించిన ఘటన కేసులో ఒకరిని పోలీసులు అరెస్ట్ చేయగా, మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నిందితులు పన్యాల గాంధీ రెడ్డి (43), నేరల్ల వంశీ కృష్ణ రెడ్డి లు 2025 ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సర్వే నంబర్ 382/87 లోని ప్రభుత్వ భూమి నుండి భారీగా మట్టిని తవ్వి, అక్కడే ఉన్న కొన్ని ప్రైవేట్ కంపెనీలకు విక్రయించారు. ఈ చర్యలకు గొనెపల్లి గ్రామానికి చెందిన రాజు, యాదగిరి సహకరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ సంఘటనపై మందపల్లి గ్రామ పరిపాలన అధికారి కర్ణాకర్ ఫిర్యాదు చేయడంతో, నవంబర్ 10న కేసు నమోదు చేసిన టూ టౌన్ ఎస్ ఐ అసిఫ్ దర్యాప్తు కొనసాగించారు. ఇందులో ప్రధాన నిందితుడు గాంధీ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచారు. మరో నిందితుడు వంశీ కృష్ణ రెడ్డి పరారీలో ఉండగా, అతడిని పట్టుకునేందుకు గాలింపు కొనసాగుతోంది. ఎసిపి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వ భూములను ఆక్రమించడమే కాకుండా, అటువంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిస్తాం అని హెచ్చరించారు.



'డబుల్ బెడ్‌రూం' ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 30: సిద్దిపేట పట్టణ పరిధిలోని కేసీఆర్ కాలనీ లో డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పిస్తానని చెప్పి రెండున్నర లక్షలు తీసుకొని మోసం చేసిన వ్యక్తిని సిద్దిపేట టూ టౌన్ పోలీసు అధికారులు అరెస్ట్ చేశారు. పోలీసుల తెల్పిన వివరాల ప్రకారం... అంబేద్కర్ నగర్, సిద్దిపేటకు చెందిన గద్దం ప్రసాద్ (36), కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బూర అమలకు కేసీఆర్ నగర్ కాలనీలోని 110/03 డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీనికి బదులుగా 2,50,000 రూపాయలు తీసుకున్నాడు. అయితే డబ్బులు తీసుకున్న తర్వాత ఇల్లు ఇవ్వకపోవడంతో పాటు, అక్కడ పెట్టుకున్న సామాన్లు కూడా ఎత్తుకుపోయినట్లు తెలిపారు. అంతేకాక ప్లాట్ ఇప్పిస్తానని చెప్పి కూడా మోసం చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ కేసు నమోదు చేసి, 29 112025 న నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు నిందితుడికి 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించి, కరీంనగర్ జిల్లా జైలుకు తరలించింది. నిందితుడు గతంలో కూడా ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎసిపి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి మోసపూరిత వాగ్దానాలకు లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలి

- దుబ్బాక సీఐ శ్రీనివాస్

ప్రతిపక్షం, మిడిదొడ్డి, నవంబర్ 30: ప్రశాంత వాతావరణంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ సూచించారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, సర్పంచ్ ఎన్నికల్లో అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలకు గురి చేసిన సమాచారం అందించాలన్నారు. మద్యం, డబ్బులు పంచినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా గ్రామాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఓటర్లు ఓటు వేసే విధంగా చూడడం జరుగుతుందన్నారు.



అట్టహాసంగా దుంపల రమ్య రాజు నామినేషన్

- ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 30 : చేగుంట సర్పంచ్ స్థానానికి బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి దుంపల రమ్య రాజు (డిష్) ఆదివారం అట్టహాసంగా నామినేషన్ వేశారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పార్టీ కార్యకర్తలు నాయకులు భారీ సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. దుంపల రమ్య నామినేషన్ వేసే ముందు చేగుంట బస్టాండ్ నుండి గాంధీ చౌరస్తా మీదుగా నామినేషన్ కార్యాలయానికి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో చేగుంట మాజీ సర్పంచ్ మంచి కట్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నారాయణరెడ్డి, నాయకులు రంగయ్య గారి రాజిరెడ్డి, మహమ్మద్ అలీ, ఎర్ర యాదగిరి, జీవన్ రెడ్డి, లక్ష్మణ్, శ్రీకాంత్, శ్రీనివాస్, మల్లేష్, రాములు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం
- మెదక్ లో బహిరంగ సభ పోస్టర్ల విడుదల

-ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 30:- కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ లు తెచ్చి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. కార్మికులకు కనీస వేతనం 26,000/ అమలు చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ మల్లేశం. కోశాధికారి నర్సమ్మ అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్ లో సీఐటీయూ 5వ రాష్ట్ర మహాసభల పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటీయు జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమవుతుందన్నారు. పనిభారం పెంచుతూ శ్రమను దోచుకుంటుందన్నారు. ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీయఫ్, కనీస సౌకర్యాలు అమలు చేయడం లేదన్నారు. కార్మికుల సమస్యలను చర్చించడానికి డిసెంబర్ 7,8,9 తేదీలలో మెదక్ పట్టణంలో జరిగే సిఐటియు 5వ రాష్ట్ర మహాసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటిరోజు 7వ తేదీన బహిరంగ సభ ఉంటుందన్నారు. 8,9 తేదీలలో రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కావున ఈ మహాసభల విజయవంతానికి కార్మికులు, కర్షకులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశ ,మధ్యాహ్న భోజనం యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్యామల, లక్ష్మీ, నాయకులు రజియా, నర్సమ్మ, బాలమని, సిద్దమ్మ, భాగ్య, శంకరమ్మ, లలిత, బాలమని, మమత తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న నామినేషన్లు

ప్రతిపక్షం, మిడిదొడ్డి, నవంబర్ 30: సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని మిడిదొడ్డి, అక్బరుపేట భూంపల్లి మండలాలలో రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. మొదటిరోజు నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు ఆసక్తి కనబరచకపోవడంతో నామినేషన్ల ప్రక్రియ మందకోడిగా కనిపించింది. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు ఇద్దరిని మాత్రమే నామినేషన్ కేంద్రంలోనికి అధికారులు అనుమతించారు. నామినేషన్ వేయడానికి కేంద్రానికి వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. మరో రెండు రోజులపాటు నామినేషన్లు స్వీకరించబడతాయని వెల్లడించారు.

గ్రామాలలో పోలీసుల కవాతు

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 30: పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గజ్వేల్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నాడు గజ్వేల్ ఏసీపీ నర్సింహులు ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా జరుపుకోవాలని, ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో గట్టి నిఘ ఏర్పాటు చేసినట్లు, ఎలాంటి అవాంఛనీయకటన జరిగిన పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్, డీఐ ముత్యం రాజు, ఎస్ఐలు ప్రేమ్ దీప్, మల్లారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



అభ్యర్థితో పాటు ఇద్దరినే అనుమతించాలి

- నామినేషన్ స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె. హైమావతి



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 30: 2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు 2025 ప్రక్రియలో భాగంగా ఆదివారం సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి, పొన్నాల క్లస్టర్లలో రెండో విడత నామినేషన్ స్వీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మిట్టపల్లి క్లస్టర్ లో మిట్టపల్లి, పాండవపురం, మందపల్లి పొన్నాల క్లస్టర్లో పొన్నాల, కిష్ట సాగర్, నాంచార్ పల్లి గ్రామాల నామినేషన్ లు స్వీకరిస్తున్నట్లు అధికారులు కలెక్టర్ కు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో మూడు విడతలుగా గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహించడం జరుగుతుందని మొదటి దశలో 7 మండలాలు రెండవ దశలో 10 మండలాలు మూడో దశలో 9 మండలలోని గ్రామాల్లో ఎన్నికల జరుగుతుందనీ మొదటి దశ నామినేషన్ ప్రక్రియ పూర్తయినది, రెండవ దశలో అక్బర్ పేట భూంపల్లి, తొగుట, మీరుదొడ్డి, దుబ్బాక, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, నంగునూరు, చిన్నకోడూరు, నారాయణరావు పేట్, బెజ్జంకి మండలాల్లో ఆదివారం నుండి మూడు రోజులపాటు నామినేషన్ స్వీకరించడం జరుగుతుందని ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 వరకు 58 క్లస్టర్లలో నామినేషన్ లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం క్లస్టర్ లో నామిని అభ్యర్థులకు సహాయార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్టేజ్ 1, స్టేజ్ 2 ఆర్వోలు నామినీ అభ్యర్థుల అప్లికేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి తర్వాతే స్లిప్ అందజేయాలని తెలిపారు. క్లస్టర్ చుట్టూ 100 మీటర్ల పరిధిలో నామిని అభ్యర్థితో పాటు ఇద్దరిని మాత్రమే లోనికి అనుమతించాలని, బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.



ఏఎంసీ వైస్ చైర్మన్‌ను సన్మానించిన గీతా పారిశ్రామిక సంఘ సభ్యులు

ప్రతిపక్షం, మిడిదొడ్డి, నవంబర్ 30: మిరుదొడ్డి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెన్నై భూపాల్ గౌడ్ నియామకం పట్ల మిడిదొడ్డి గీతా పారిశ్రామిక సంఘం సభ్యులు ఆదివారం శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీతా పారిశ్రామిక సంఘం నుండి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గీతా పారిశ్రామిక సంఘం సభ్యులు పరుశురాములు గౌడ్, వెంకట్ గౌడ్, కనకరాజు, కిష్టగౌడ్, లింగం, శ్రీకాంత్, రామస్వామి, శంకర్, బాలమల్లు, రాజు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

"



వైఎస్‌జగన్ హయాంలో రాష్ట్ర ఇరిగేషన్ వ్యవస్థ పూర్తిగా నాశనం అయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శ్రీశైలం ప్లంజ్ పూల్, తుంగభద్ర గేట్లు, ధవళేశ్వరం బ్యారేజ్ కోసం మొత్తంగా రూ.400 కోట్లకు పైగా కేటాయించాం. ఎన్నికల హామీ మేరకు భృతి మత్స్యకారులకు రూ.20 వేలకి పెంచాం.

- ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రాంతీయం

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 30:- గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరికి ఎన్నికల నియమ, నిబంధనలు తెలిసి ఉండాలని, ముఖ్యంగా పోటీ చేసే అభ్యర్థులు నిబంధనలు పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ కలెక్టర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులు పబ్లిక్ మీటింగ్ పెట్టుకోవడానికి అనుమతులు తీసుకోవాలని, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అలాగే పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ప్రచారం కోసం పబ్లిక్ మీటింగ్ పెట్టుకోవడానికి, ర్యాలీలు నిర్వహించడానికి, మైకులు పెట్టుకోవడానికి సంబంధిత మండల తహసీల్దార్ వద్ద అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవలిసి ఉంటుందని అన్నారు. అనుమతి పొందిన బహిరంగ సమావేశాలు అలాగే రోడ్ షోల వద్ద లౌడ్ స్పీకర్లు ఉదయం 6 గంటల నుండి రాత్రి పది గంటల మధ్య మాత్రమే ఉపయోగించాలన్నారు. ఈ నిబంధనను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే పోలీస్ అధికారులు లౌడ్ స్పీకర్ లను జప్తు చేయడానికి అధికారం కలిగి ఉంటారని పేర్కొన్నారు. వార్డు విస్తీర్ణం చాలా తక్కువ ఉంటుంది కాబట్టి వార్డు మెంబర్ పదవికి పోటీ చేసే అభ్యర్థులకు వాహన అనుమతి ఉండదని చెప్పారు.



వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం జిల్లా సమావేశం

- కొత్త కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 30: వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం సిద్దిపేట జిల్లా సర్వసభ్య సమావేశం, జిల్లా ఎన్నికలు స్థానిక మెరీడియన్ హై స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా తోట సతీష్, ప్రధాన కార్యదర్శిగా కదుర్ల హరికిషన్, కోశాధికారిణిగా విజయరేఖ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘానికి విశేష సేవలు అందించిన గన్నె రాజరెడ్డి గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.రాష్ట్ర కమిటీ తరఫున చంద్రయ్య, కిష్టయ్య ఎన్నికల పరిశీలకులుగా హాజరై ప్రక్రియను నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన పేట టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి గౌడ్ మాట్లాడుతూ, వ్యాయామ ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతున్న ఏకైక శక్తివంతమైన వేదిక పేట టీఎస్ అని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుని నియామకం తప్పనిసరిచేయాలని, అలాగే స్కూల్ సిలబస్‌లో వ్యాయామ విద్యను అభ్యాస్యాంశంగా చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులు క్రీడాచేతన, క్రమశిక్షణ, ఆరోగ్యం వంటి విలువలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ఉందని వివరించారు. సిద్దిపేట జిల్లా శాఖ చేస్తున్న కార్యక్రమాలపై ప్రశంసలు కురిపించారు. కొత్తగా ఎన్నికైన తోట సతీష్, కదుర్ల హరికిషన్ మాట్లాడుతూ...క్రీడా అభివృద్ధి కోసం జిల్లాలో నిరంతరం కృషి చేస్తామన్నారు. గ్రామీణ స్థాయిలో క్రీడలను విస్తరించడానికి చర్యలు కొనసాగిస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల కోసం శిక్షణా శిబిరాలు, సెమినార్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో మండల కమిటీలు ఏర్పాటు చేసి పూర్తి స్థాయి జిల్లా కార్యవర్గాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు.ఈ సమావేశంలో బిక్షపతి, రాజమౌళి, రవి కుమార్, శైలజ, సుశీల, సరస్వతి, రజిత, మురళీధర్, రామ్ నరసయ్య, రాజమోహన్ గౌడ్, లతీఫ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



కోడూరి రవీందర్ స్మారక క్రికెట్ పోటీలు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 30: ఇంటర్నేషనల్ ఫోక్ నృత్య కళాకారులు కీ.శే. కోడూరి రవీందర్ స్మారక క్రికెట్ పోటీలు కరీంనగర్లోని అంబేద్కర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. కోడూరి రవీందర్ కుమారులు, క్రికెట్ పోటీ నిర్వాహకులు కోడూరి అంబరీష్, ఏపీపీ చంద్ర, (గోల్డెన్ యూత్) ఆధ్వర్యంలో చేపట్టిన గల్లీ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు 37వ డివిజన్ యూత్ కోసం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీష్, మాజీ మేయర్ సునీల్ రావు, తాజా మాజీ కార్పొరేటర్ వంగల పవన్, రిషి కాన్వెంట్ చైర్మన్ చెన్నప్ప, క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు మహేందర్, జనరల్ సెక్రెటరీ మురళీధర్, టీఎన్జీవో కరీంనగర్ అధ్యక్షులు దారం శ్రీనివాస్, టీజీవో ప్రెసిడెంట్ కాళీ చరణ్, నేషనల్ టీం సీనియర్ క్రికెట్ ప్లేయర్ సుధాకర్ అట్టు లు, టీఆర్వీ కేఎస్ ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రకాష్, కోడూరి హరికృష్ణ లుహాజరయ్యారు. ఆదివారం రోజున సాయంత్రం క్రికెట్ పోటీ విన్నర్ , రన్నర్ లకు బహుమతులను అందజేశారు.



పంచాయతీ ఎన్నికల్లో
బీఆరెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి

- సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 30: తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అన్యాయం చేశారని, మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని దివాలా తీసి లక్షల కోట్లు దాచుకున్నారని సిద్దిపేట పట్టణం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో అత్తు ఇమామ్ మాట్లాడుతూ 10 సంవత్సరాలు తెలంగాణ ప్రజలు అధికారం ఇస్తే అని వర్గాల ప్రజలను కల్వకుంట్ల కుటుంబం మోసం చేసిందని అన్నారు. కేసీఆర్ మోసం చేసినందుకు ప్రజలు ప్రతిపక్షం హోదా ఇచ్చారని అన్నారు. వచ్చే ఎన్నికల వరకు బీఆరెస్ భూస్థాపితం అవుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు చూసి కల్వకుంట్ల కుటుంబం ఓర్వడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల కాలంలో ప్రవేశపెట్టిన పథకాలు చూసి ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమబిడ్డలను అమరులు అయిన కుటుంబం సభ్యులను కేసీఆర్ 10 సంవత్సరాలలో ఉద్యమకారులను పట్టించుకున్న పాపానపోలేదు అని అన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడిన దాంట్లో తప్పు ఏముందని, కేసీఆర్ ఉద్యమం చేస్తే తెలంగాణ రాలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షను కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీకి తెలిపితేనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేశారని అన్నారు. సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చింది అని చెప్పి ఢిల్లీ వెళ్లి కల్వకుంట్ల కుటుంబం సోనియాగాంధీ కాళ్లు మొక్కి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ని విమర్శిస్తారా అని ప్రశ్నించారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన బీజేపీ, బీఅర్ఎస్‌పార్టీలకు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యాదరి మధు, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గయాజుద్దీన్, స్టేట్ మైనారిటీ సెక్రెటరీ హర్షద్ బాబా, ఫరీద్, నజ్జు తదితరులు పాల్గొన్నారు.





కొండగట్టులో అగ్నిప్రమాదం

- 35 దుకాణాలు దగ్ధం.. భారీగా ఆస్తి నష్టం



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 30: జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టులో అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదవశత్తు సంబవించిన ఈ అగ్నిప్రమాదంలో రోడ్డుపై ఉన్న బొమ్మల దుకాణాలలో మంటలు ఎగిసి పడ్డాయి. అగ్ని ప్రమాదంలో సుమారు 35కు పైగా దుకాణలు అగ్నికి దాహుతి అయ్యాయి. ,అగ్ని ప్రమాదం అర్ధరాతి జరగడం వల్ల ప్రాణాపాయం తప్పింది. షాపులు దగ్ధం వల్ల ఆస్తి నష్టం జరిగింది, కానీ ప్రాణ నష్టం జరగక పోవడం తో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు 10 నుంచి 15 లక్షల అస్తినష్టం వాటిల్లినట్లు తెలుస్తుంది

ప్రమాదంపై కేంద్ర, రాష్ట్ర మంత్రుల విచారం

కొండగట్టు ప్రమాదం పై కేంద్రమంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు విచారం వ్యక్తం చేశారు. అధికారులు మంత్రి పొన్నం ప్రభాకర్, అడ్లూరి దృష్టికి తీసుకొచ్చారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రులు హామీ ఇచ్చారు. ఘటన పై జగిత్యాల జిల్లా కలెక్టర్ తో మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్ లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో పర్యటించాలని ఆదేశించారు. జగిత్యాల జిల్లా కొండగట్టు స్టేజీ సమీపంలో అగ్ని ప్రమాదంవల్ల పలు షాపులు దగ్ధమవడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరా తీశారు. చత్తీస్‌ఘడ్ లోని రాయపూర్ లో డీజీపీల సదస్సులో ఉన్న కేంద్ర మంత్రి సమాచారం తెలిసిన వెంటనే జగిత్యాల జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడారు. బాధితులకు అండగా ఉండాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ సూచించారు.

అగ్నిప్రమాదం తీరుపై కలెక్టర్ ఆరా

జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టులోని సుమారు 30 దుకాణాలు షాక్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరగగా ఆదివారం జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ సంఘటన స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రమాదానికి జరిగిన కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన వారికి తక్షణ సహాయం కటుంబానికి 5000 రూపాయలు అందిస్తున్నామని తెలిపారు.బాధితులకు ఆహారం, ఇతర వస్త్రాలు అందించాలని,షాక్ సర్క్యూట్ ప్రమాదం పై స్థానిక ఎమ్మార్వో మరియు సంబంధిత అధికారులను పూర్తి నివేదిక తయారుచేసి అందించాలని ఆదేశించారు. బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.కలెక్టర్ వెంట ఆర్డీవో మధుసూదన్, ఎమ్మార్వో, విద్యుత్ శాఖ అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

జాగృతి నాయకుల పరామర్శ

అగ్నిప్రమాదంలో తీవ్రంగా ఆస్తి నష్టం జరిగి షాపులు నిర్వహించుకునే అనేక కుటుంబాలు దిక్కు తోచని స్థితిలో రోడ్డున పడ్డాయని తెలంగాణ జాగృతి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. నిరుపేదలైన దాదాపు 35 కుటుంబాలు వారి షాపులు దగ్ధం కావడంతో వారు పూర్తిగా దిక్కు తోచని స్థితిలో ఉన్నారని వారు అన్నారు. త్వరలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా భక్తులు కొండగట్టు దర్శనం చేసుకోవడం ఆనవాయితీ ఇక్కడికి వచ్చే భక్తులు వివిధ వస్తువులు కొనుగోలు చేస్తారనే ఉద్దేశంతో ప్రతి షాపు యజమానులు దాదాపు 4 నుంచి 5 లక్షల వరకు సామాగ్రిని కొనుగోలు చేసుకుని పెట్టుకున్నారని రాత్రి జరిగిన ప్రమాదంలో వారు సర్వం కోల్పోయారని ప్రభుత్వం వెంటనే బాధితుల కుటుంబాలను అదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలంగాణ జాగృతి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. వారి వెంట జాగృతి మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు అక్కం శివరాణి, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, యువజన నాయకులు హుస్నాబాద్ రాజ్ కుమార్, మహిళ విభాగం నాయకురాలు జంగ అపర్ణ, విజయ్, వెంకటేష్, తదితరులు ఉన్నారు.

నేడు ప్రజావాణి రద్దు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 30: ప్రతి సోమవారం కలెక్టరేట్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నేడు నిర్వహించడం లేదని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరగదు కాబట్టి ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి ప్రజావాణి కార్యక్రమం కోసం ఎలక్షన్ కోడ్ ముగిసే వరకు కలెక్టరేటకు రాకూడదని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.



నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల(బోయినపల్లి), నవంబర్ 30: గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల నామినేషన్ కేంద్రాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్ ఆదివారం పరిశీలించారు. బోయినపల్లి మండలంలోని కొదురుపాక, బోయినపల్లి, కోరెం, స్తంభంపల్లి లోని ఆర్ఓ కేంద్రాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సిద్ధంగా ఉంచిన నామినేషన్ పత్రాలు, హెల్ప్ డెస్క్ పరిశీలించి, సూచనలు చేశారు.



సాహిత్యంతోనే సామాజిక మార్పు

- మధురిమలు రూపకర్త ఈర్ల సమ్మయ్య

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 30: సాహిత్యంతోనే సామాజిక మార్పు జరుగుతుందని నూతన తెలుగు లఘు కవితా ప్రక్రియ రూపకర్త ఈర్ల సమ్మయ్య అన్నారు. ఆదివారం ఆయన హైదరాబాదులోని త్యాగరాయగానసభ భవనంలో రామదాసు కళా సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ రమ్య స్వరూప్ రచించిన 'రమ్య మంజరి, నవవల్లకి' పుస్తకాలను ఆవిష్కరించారు. మధురిమలు అనే నూతన తెలుగు లఘు కవితా ప్రక్రియను ప్రారంభించి, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కవుల చేత రచనలు చేయిస్తూ, సాహిత్య సేవ చేస్తున్న పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి గ్రామ నివాసి ఈర్ల సమ్మయ్యను కార్యక్రమ నిర్వాహకురాలు డాక్టర్ రమ్య స్వరూప్ శాలువా మేమెంటో, ప్రశంసా పత్రంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ సాహిత్యం సామాన్య ప్రజానీకానికి అర్థమయ్యే విధంగా సామాజిక చైతన్యాన్ని కలిగించేదిగా ఉండాలన్నారు. అద్భుతమైన మధురిమలు రాసిన రచయిత డాక్టర్ రమ్య స్వరూప్ ని ఈర్ల సమ్మయ్య అభినందించారు. చిన్న వయసులోనే ఆమె చేస్తున్న సాహిత్య సేవను కొనియాడారు. తెలుగు సాహిత్యంలో విశేష ఆదరణ పొందుతున్న మధురిమలు నియమాలను వివరించారు. చందోబద్ధమైన ఈ లఘు కవితా ప్రక్రియలో నాలుగు పాదాలు ఉంటాయని, ప్రతి పాదంలో 7నుంచి 12 వరకు గల అంకెలను ఉపయోగించాలన్నారు. నాలుగు పాదాల్లో సమాన సంఖ్యలో మాత్రలు ఉండాలని, ఒకటి మూడు, రెండు నాలుగు పాదాల్లో ప్రాస ఉండాలని లేదా నాలుగు పాదాల్లో క్రాస్ అనిమ వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రచనలు చేయాలనుకున్నవారు, ఆసక్తి కలిగిన రచయితలు 9989733035 సంప్రదించాలని ఈర్ల సమ్మయ్య కోరారు.

ఎస్ఈసీ నిబంధనలు పాటించాలి

- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్
- మీడియా సంస్థల అడ్వర్టైజ్మెంట్, పలు ప్రింటింగ్, ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రతినిధులతో సమావేశం



ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్నసిరిసిల్ల, నవంబర్ - 30: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించిన అడ్వర్టైజ్మెంట్, కరపత్రాలు, ఫ్లెక్సీలు ఇతర ముద్రణలపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ ఈ సీ) నిబంధనలు పాటించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గడ్డం నగేష్ సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పలు మీడియా సంస్థల అడ్వర్టైజ్మెంట్ ప్రతినిధులు, ప్రింటింగ్, ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులు, బాధ్యులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆదివారం అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్ మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ లో భాగంగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ప్రచారానికి సంబంధించి అడ్వర్టైజ్మెంట్, కరపత్రాలు, ఫ్లెక్సీలు ప్రింట్ చేసేందుకు వారి బ్యాంక్ ఖాతా నుంచే డబ్బులు చెల్లించాలని తెలిపారు. అడ్వర్టైజ్మెంట్, కరపత్రాలు, ఫ్లెక్సీలు ప్రింట్ లపై ప్రత్యేక కమిటీ పర్యవేక్షించి, పోటీలో ఉన్న అభ్యర్థుల వ్యయంలో జమచేస్తారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మీడియా సంస్థలు, ప్రింటింగ్, ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



దిత్వా తుఫాను దూసుకొస్తున్న నేపథ్యంలో ఇవాళ, రేపు అధికారులు అప్రమత్తంగా ఉండాలి. నెల్లూరు, తిరుపతి, కడప, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి. క్షేత్రస్థాయిలో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, ప్రాణనష్టం లేకుండా చర్యలు తీసుకోవాలి. విద్యుత్ అంతరాయం కలిగితే వెంటనే పునరుద్ధరించాలి.
- ఏపీ హోం మంత్రి అనిత





హుస్నాబాద్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- డిసెంబర్ 3న హుస్నాబాద్‌లో సీఎం రేవంత్ పర్యటన
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన
- రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

-ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 30: హుస్నాబాద్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. డిసెంబర్ 3న హుస్నాబాద్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానుండటంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లను జోరుగా చేపట్టారు. శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల, ఏటీసీ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్)తో పాటు పలువురు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, సిద్దిపేట కలెక్టర్ హైమవతితో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ప్రజాసందోహం అధికంగా వచ్చే అవకాశం ఉండటంతో తాగునీరు, పార్కింగ్, భద్రత వంటి అంశాలపై అధికారులకు మంత్రి సూచనలు ఇచ్చారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సీఎం పర్యటన ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుందని మంత్రి అన్నారు. రాజీవ్ రహదారి హుస్నాబాద్ రోడ్డు ఫోర్లైన్, అక్కన్నపేట-హుస్నాబాద్ రోడ్డు అభివృద్ధి, కోహెడలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, గిరిజన గ్రామాలకు లింక్ రోడ్లు వంటి పలు కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. స్విమ్మింగ్ పూల్, వెటర్నరీ హాస్పిటల్, ఫిష్ మార్కెట్, వెజిటెబుల్ మార్కెట్ ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.20 కోట్లు, ఆధునిక డ్రైవింగ్ ట్రాక్‌తో ఆర్‌టీఏ కార్యాలయానికి రూ.8 కోట్లు,ఇందిరా మహిళా శక్తి బజార్‌కి రూ.6 కోట్లు,ఉమ్మాపూర్ అర్బన్ పార్క్‌కు రూ.10 కోట్ల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేయనున్నారని పేర్కొన్నారు. అలాగే ఇందిరా మహిళా శక్తి కింద మహిళా సంఘాలకు బస్సులు పంపిణీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రయాణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని 70 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. హైదరాబాద్-హుస్నాబాద్ ఎక్స్‌ప్రెస్ బస్సును సీఎం ప్రారంభించనున్నారని తెలిపారు. కొత్తపల్లి-హుస్నాబాద్ ఫోర్లైన్ రోడ్డు, 250 పడకల ఆసుపత్రి పనులు ప్రగతిలో ఉన్నాయని తెలిపారు. ఎల్లమ్మ చెరువు, మహాసముద్రం గండి, పల్లె చెరువు, కొత్త చెరువుల అభివృద్ధి కొనసాగుతోందని చెప్పారు. రింగ్ రోడ్, కబడ్డీ అకాడమీ, స్టేడియం అభివృద్ధి, డిగ్రీ కళాశాల పక్కన పార్క్ వంటి ప్రతిపాదనలు సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. హుస్నాబాద్‌ను ఆదర్శనీయకవర్గంగా తీర్చిదిద్దే భాగంలో హుస్నాబాద్ పారిశ్రామిక కారిడార్‌కు భూసేకరణ పూర్తయిందని, గోడౌన్ల నిర్మాణానికి అనుమతులు లభించాయని మంత్రి వివరించారు. కారిడార్ రూపుదిద్దుకుంటే స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని సంతోషం వ్యక్తం చేశారు. గౌరవెల్లి ప్రాజెక్ట్‌కు నిధులు సమకూరుతున్నాయని, కాలువల పనులు పూర్తి చేసి హుస్నాబాద్‌ను సస్యశ్యామలం చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, మహిళలకు చీరలు, సున్నా వడ్డీ రుణాలు, గ్రామ గ్రామాలకు స్టీల్ బ్యాంకులు పంపిణీ వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు.



నామినేషన్ కేంద్రాలు పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల నవంబర్ 30: గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల నామినేషన్ కేంద్రాలు, చెక్ పోస్ట్ ను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదివారం పరిశీలించారు. తంగళ్ళపల్లి మండలం జిల్లెల ఎస్ఎస్ టీ చెక్ పోస్ట్ ను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించి, వాహనాల తనిఖీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లెల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ కేంద్రం, తంగళ్ళపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్ డెస్క్, తంగళ్ళపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ కేంద్రాన్ని పరిశీలించారు. ఆర్‌ఓ కేంద్రాల్లో అభ్యర్థుల కోసం కల్పించిన సహాయ కేంద్రం, వసతులు పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. పరిశీలనలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ జయంత్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్ల బాలికపై అత్యాచారం.. హత్య

ప్రతిపక్షం, మంచిర్యాల, నవంబర్ 30: మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండల నంబాలలో ఆరేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి అనంతరం అదే గ్రామంలోని ఒక బావిలో బండ కట్టి పడవేసి హత్య చేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే నంబాల గ్రామానికి చెందిన మహాన్విత అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతుంది. బడికి వెళ్లి ఈనెల 24న సాయంకాలం తిరిగి వచ్చిన అనంతరం ఆమెను అదే గ్రామానికి చెందిన కొంతమంది దుండగులు ఎత్తుకుపోయి అత్యాచారం చేసిన అనంతరం ఆమెను పండకు బట్టి వ్యవసాయ బావిలో పడి వేశారు. తల్లిదండ్రులు కూలి పని చేసి వచ్చి సాయంత్రం వారి కూతురు కనబడలేదు. అనంతరం సమీపంలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



చేశారు. పోలీసులు గ్రామస్తులు కలిసి వెతుకుతుండగా ఒక వ్యవసాయ బావిలో బాలిక మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు మోక్షమెప్పుడు?

- మంత్రి జీవో జారీ చేసినా.. కదలని అధికారులు
- తీవ్ర అసహనంలో పాత్రికేయులు

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబరు 30: ప్రజా సమస్యలను నిత్యం వెలుగులోకి తెచ్చే జర్నలిస్టుల సొంతింటి కల అధికారుల నిర్లక్ష్యం కారణంగా అటకెక్కుతోంది. హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని పాత్రికేయులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియలో అధికారుల తాత్సారం పట్ల మీడియా వర్గాలు తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గడచిన ఎనిమిది నెలలుగా ఈ వ్యవహారం పెండింగ్‌లో ఉండటంతో జర్నలిస్టులు ఆందోళన చెందుతున్నారు.



జీవో ఉన్నా.. న్యాయం జరగలే..

జర్నలిస్టుల సంక్షేమం దృష్ట్యా ఇళ్ల స్థలాల కోసం జర్నలిస్టులకు 8 నెలల క్రితం అప్పటి కలెక్టర్ మనూ చౌదరి సిద్దిపేట కలెక్టరేట్ లో ప్రొసీడింగ్ కాపీని ఇచ్చారు. సాక్షాత్తు గౌరవ మంత్రివర్యులే ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధించి జీవో కాపీని జారీ చేశారు. అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో రెవెన్యూ యంత్రాంగం, సంబంధిత అధికారులు ఈ ఫైలును ముందుకు కదిలించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రొసీడింగ్ ఇచ్చి 8 నెలలు గడుస్తున్నా నేటికీ కేటాయింపులు జరగకపోవడం బాధాకరమని జర్నలిస్టులు వాపోతున్నారు.

మంత్రి పొన్నంకు విజ్ఞప్తి..

అధికారుల జాప్యంపై హుస్నాబాద్ జర్నలిస్టులు హనుమంత్ నాయక్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా తమ నిరసన గళాన్ని వినిపించారు. 8 నెలలుగా మా ఫైలు పెండింగ్‌లోనే ఉందని.. మీరు ఇచ్చిన జీవో కాపీ ఉన్నప్పటికీ మాకు న్యాయం జరగలేదని, దయచేసి చొరవ తీసుకుని మాకు నివేశ స్థలాలు దక్కేలా చూడండి అని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే స్థలాల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ వారు చేశారు.



ముస్త్యాల చెక్ పోస్టు తనిఖీ చేసిన కలెక్టర్

ప్రతిపక్షం, చేర్యాల, నవంబర్ 30 : చేర్యాల మండలం నేషనల్ హైవే రోడ్ ముస్త్యాల గ్రామం వద్ద గల ఎస్ఎస్టీ శిబిరాన్ని కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా సందర్శించి వాహనాల పరిశీలన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిజిస్టర్ వెరిఫై చేసి రిజిస్టర్ వెహికిల్ వచ్చిన టైము తప్పనిసరిగా రాయాలని, విధులు పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. వెహికల్ చెకింగ్ వీడియోస్ను వీడియో కెమెరాలో చెక్ చేశారు.



జిల్లా స్థాయికి ఎంపికైన పెద్దమ్మ గడ్డ పాఠశాల విద్యార్థులు

ప్రతిపక్షం, చేర్యాల, నవంబర్ 30 : గ్రామీణ ప్రాంత విద్యార్థులతో ఆంగ్ల భాష ప్రావీణ్యాన్ని కమ్యూనికేషన్ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రణాళికలో భాగంగా రాష్ట్రస్థాయి ఎస్సీఈఆర్టీ, భారతి ఫౌండేషన్ సౌజన్యంతో చేర్యాల మండల ఎల్త ఆధ్వర్యంలో శనివారం ముత్యాల మోడల్ స్కూల్ లో మండల స్థాయి తెలంగాణ "ఇంగ్లీష్ ఒలంపియాడ్ ఎడ్యుకేస్టు" అనే ఎడ్యుకేషనల్ పోటీలను సీనియర్ 9,10వ తరగతి, జూనియర్స్ 6,8వ తరగతుల విద్యార్థులకు వేర్వేరుగా మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మండల స్థాయిలో ఉన్న అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా ఇంగ్లీష్ ఒలంపియాడ్ జూనియర్స్ విభాగంలో పెద్దమ్మ గడ్డ జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు 8వ తరగతి విద్యార్థి అక్షయ, సీనియర్స్ విభాగంలో 10వ తరగతి విద్యార్థి పీ. శ్వేతా, ఎడ్యుకేస్టులో జూనియర్స్ లో 6వ తరగతి విద్యార్థి పీ. ప్రణవి, సీనియర్స్ విభాగంలో ముస్త్యాల జడ్పీహెచ్ఎస్ పాఠశాల చెందిన వీ. సాయి తేజ విద్యార్థులు విజేతగా నిలిచినట్లు చేర్యాల మండల ఎల్టా కన్వీనర్ శ్రీనివాస్ రెడ్డి, కో కన్వీనర్ బండా నాగమణి ఓ ప్రకటనలో తెలిపారు. నేటి డిజిటలైజేషన్ కాలంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులు కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెంచుకోవడం తప్పని పరిస్థితి అని ఈ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవడం వలనే భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని, పెద్దమ్మ గడ్డ పాఠశాల హెడ్మాస్టర్ సురేష్ కుమార్ తెలియజేస్తూ జూనియర్స్ సీనియర్స్ విభాగంలో విజేతలకు గైడ్ టీచర్ గా వ్యవహరించిన ఉపాధ్యాయులు శ్రీకాంత్ ను అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ ఎంఈఓ రచ్చ కిష్టయ్య, ఉపాధ్యాయులు రాధిక, రాకేష్ రెడ్డి, కనకారెడ్డి, నరసింహులు, గోవిందరాజు, కిషన్, శ్రీనివాస్, జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.



జిల్లాలో పోలీసు యాక్ట్

- ఎస్పీ రాజేష్ చంద్ర

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, నవంబర్ 30: కామారెడ్డి జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (డిసెంబర్ 1వ తేది నుండి 31 వరకు) జిల్లా వ్యాప్తం గా 30,30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. అలాగే ప్రజా ధనాన్ని నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ గారు హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయంలో సహకరించాలని తెలిపారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



చేర్యాల పట్టణ పద్మశాలీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రతిపక్షం, చేర్యాల, నవంబర్ 30 : చేర్యాల పట్టణ పద్మశాలి ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలుపొందిన కొక్కుల సురేందర్, కార్యదర్శిగా ఎన్నికైన పాము బాలనర్సు, కోశాధికారిగా ఎన్నికైన మలిపెద్ది వెంకటేశ్వర్లు ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో చేర్యాల పట్టణంలోని మార్కండేయ దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సన్మాన సభకు ముఖ్య అతిథిగా సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ సతీశ్, అయ్యప్ప గురు స్వాములు కొమురవెల్లి దేవస్థాన డైరెక్టర్ వెలుగల మల్లేశం, సింగదేవర ధర్మరాజు, ఇరుమల్ల సమ్మిరెడ్డి, అంబాల శ్రీనివాస్ గౌడ్, గణేష్ తివారిలు హాజరై కార్యవర్గాన్ని సన్మానించి అభినందనలు తెలియజేశారు.



మెకానిక్ అసోసియేషన్ అభివృద్ధికి సహకరిస్తా

- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్
- టు వీలర్ మెకానిక్ నూతన అసోసియేషన్ ఏర్పాటు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 30 : మెకానిక్ అసోసియేషన్ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారం అందిస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం మెకానిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ మెకానిక్ వృత్తి సామాన్య ప్రజల దైనందిన జీవనంలో ఎంతో కీలకమని, వీరు అందించే సేవ సమాజానికి అనితరసాధ్యమని అభిప్రాయపడ్డారు. రెండు చక్రాల వాహనాలు ప్రజల ప్రయాణాన్ని సురక్షితంగా కొనసాగించేందుకు పనిచేస్తున్న మెకానిక్‌ల పాత్ర అపూర్వమని తెలిపారు. అవసరమైన మౌలిక అవసరాలు కోసం తన ఎమ్మెల్యే ఫండ్ ద్వారా సహాయం అందిస్తానని తెలిపారు. దేశ అభివృద్ధి పథంలో ప్రతి వృత్తివర్గం భాగస్వామ్యం కావాలని, ప్రధాని నరేంద్ర మోదీ "సబ్కా సాథ్ - సబ్కా వికాస్" నినాదం అందరికీ చేరేలా తాను కృషి చేస్తానని పేర్కొన్నారు. సామాన్యుల పురోగతే దేశ పురోగతి అని, మెకానిక్‌ల వంటి శ్రమజీవులకు ఎమ్మెల్యే గా ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే మెకానిక్‌ల ఆరోగ్యం (హెల్త్) పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని, రోజూ గ్రీజు, దస్ట్, కఠిన పరిస్థితుల్లో పనిచేస్తున్న నేపథ్యంలో వీరి ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన హెల్త్ క్యాంపులు, జీవిత బీమా, ప్రభుత్వ హాస్పిటల్లో నాణ్యమైన చికిత్సను అందించే విధంగా అన్ని విధాల సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన మెకానిక్‌లకు అందేలా ప్రభుత్వంతో సమన్వయం చేసి సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి సహా నూతన కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి పోతంకార్ లక్ష్మీనారాయణ, లీగల్ అడ్వైజర్ రాజేందర్ రెడ్డి, స్టేట్ మెకానిక్ ప్రెసిడెంట్ బాబు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గజ్జల మురళి మీ, స్టేట్ ప్రచార సెక్రటరీ శ్రీకాంత్, కామారెడ్డి బాబా, ప్రెసిడెంట్ గంగారం జనరల్ సెక్రెటరీ రామచంద్ర, ట్రెజరీ గంగాధర్, బీజేపీ నాయకులు పవన్, గుండా సతీష్, నాయకులు భాస్కర్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారంతో ఘరానా మోసం

- రెండు గంటల్లోనే కేసు ఛేదించిన పోలీసులు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 30 : నకిలీ బంగారం పేరుతో మోసం చేసిన ముఠాను పోలీసులు కొద్ది గంటలోనే పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి నిజామాబాద్ ఏసిపి రాజా వెంకటరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా స్వర్ణ భారతి కాలనీ చెందిన లేబర్ పని చేసే తురకశివయ్య, తన్నీరు అంజమ్మ, అంకమ్మ, గంగరాజు లు నాలుగు నెలల క్రితం మూడు నకిలీ బంగారు బిస్కెట్ లను మోసం చేసే ఉద్దేశ్యంతో ఎవరికైనా అమ్ముదామని స్థానికంగా ప్రయత్నించారు. అక్కడ కుదరకపోవడంతో ఇంతకుముందే నిజామాబాద్ లో లేబర్ పని చేసిన తన్నీరు అంజమ్మతో నకిలీ బంగారాన్ని నిజామాబాద్ తీసుకోని వచ్చి నిజామాబాద్ నగరంలోని శివాజీ నగర్ ప్రాంతంలో ఒక ఇంటి ని అద్దె ఇంట్లో దిగారు. వారి వద్ద గల నకిలీ బంగారాన్ని అమ్మే ప్రయత్నంలో సీతారాం నగర్ కి చెందిన పాలు అమ్మే మోర వనిత వద్దకు పాల కొరకు అంజమ్మ పలుమార్లు రావటంతో పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో అంజమ్మ తమ దగ్గర ఒక బంగారం



బిస్కెట్ ఉందని చూపించి ఇది దాదాపు 350 గ్రాములు ఉంటుందని, దీనిని బయట అమ్మితే రూ.30 లక్షల వరకు వస్తుంది కానీ, మాకు రూ. 10 లక్షలు ఇచ్చి బంగారాన్ని తీసుకోమని అడగగా దానికి వారు సరేనని అన్నారు. కానీ, అంత డబ్బు ఇవ్వలేమని చెప్పి రూ. ఐదు లక్షలు ఇస్తామని చెప్పగా దానికి వారు సరేనని ఒప్పుకుని నకిలీ బంగారం బిస్కెట్ ని ఇచ్చి రూ.ఐదు లక్షలు తీసుకొని అక్కడి నుండి ఉడాయించారు. తర్వాత అనుమానం వచ్చిన వనిత అట్టి బంగారాన్ని పరీక్షించుకోగా అది నకిలీ అని తేలడంతో అవాక్కు అయినది. దాంతో వెంటనే వనిత పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిజామాబాద్ డివిజన్ ఏసీపీ ఎల్. రాజా వెంకట్ రెడ్డి అధ్వర్యంలో రెండు టీం లుగా ఏర్పడి నార్త్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి శ్రీనివాస్, సబ్ ఇన్స్పెక్టర్ పీఎస్ 5 ఎం. గంగాధర్, సిబ్బంది కేసును వివిధ కోణాలలో పరిశోధించి ఇట్టి దొంగతనం కేసులో నిందితులు పారిపోకుండా అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారాన్ని ఇచ్చారు. నిందితులు డిచ్పల్లి రైల్వే స్టేషన్ లో ఉన్నారనే పక్కా ఇన్ఫర్మేషన్ తో పోలీసులు వెళ్లి తనిఖీ చేయగా అక్కడ నిందితులను పట్టుకొని అరెస్టు చేశారు. నార్త్ రూరల్ సిఐ కేసు పంచనామా నిర్వహించి నిందితులను రిమాండ్ కు పంపడం పంపారు. కేసును 4 గం లోనే ఛేధించి నిందితులను పట్టుకున్న పోలీసు సిబ్బంది అందరిని ఏసీపీ ఎల్.రాజా వెంకట్ రెడ్డి అభినందించారు.



డ్రోన్ పోటీలో పుణే యువత చూపిన పట్టుదల, ఇస్రో సైంటిస్టుల నిబద్ధత ఒక్కటే. యువతరం సంకల్పమే 'వికసిత్ భారత్' అని, టెక్నాలజీ అభివృద్ధిలో వారి కృషి కీలకం. 'చంద్రయాన్-2 ఫలితంతో నిరాశ చెందిన శాస్త్రవేత్తలు అదే రోజు చంద్రయాన్-3 విజయగాథ రాయడం మొదలుపెట్టారు. వైఫల్యాలే విజయానికి తొలి అడుగు. పరిశోధన రంగంలో భారత్ దూసుకుపోతోంది.

-'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

ప్రాంతీయం



ఏకగ్రీవ సర్పంచ్ ను సన్మానించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 30 :గోపాల్ పేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలో బిఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన బంగారయ్య,వార్డు సభ్యులు గుంటిలక్ష్మయ్య,గుంటి అయోధ్యరాములు,వెంకటయ్యలను మాజీ మంత్రి. సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో సన్మానించారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఐకమత్యంతో సర్పంచ్ గా ఎన్నికై పార్టీ ప్రతిష్ఠ పెంచారని,రాబోవు కాలములో గ్రామ అభివృద్ధికి తాను తోడ్పడుతానని హామీ ఇచ్చారు.నూతనంగా ఎన్నికైన సర్పంచు,వార్డు సభ్యులను ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమములో రైతు సమితి అధ్యక్షులు తిరుపతయ్య, మాజీ వైస్ చైర్మన్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఇరుముడి మహోత్సవానికి ఎమ్మెల్యే మేఘా రెడ్డి

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 30: పెద్దమందడి మండలం మనిగిళ్ళ గ్రామ చౌదర్పల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ మాల ధరించి మండల కాలం 41 రోజు దీక్షను పూర్తి చేసిన స్వాముల ఇరుముడి కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు. తూడి మేఘారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.ఇరుముడి మహోత్సవ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేసిన మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్ దంపతులను ఆయన అభినందించారు.మనిషి ఇలాంటి దీక్షలు తీసుకోవడం ద్వారా ఆధ్యాత్మికంగా గాను ఆరోగ్యంగా గాను బాగుంటారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆంజనేయ స్వాములు అయ్యప్ప స్వాములతో కలిసి పూజలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ చౌదరిపల్లి ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి తాను ఎల్లవేళలా సహకరిస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు సత్యారెడ్డి, మాజీ సర్పంచులు వెంకటస్వామి, శ్రీనివాస్ రెడ్డి నాయకులు సుదర్శన్, టైలర్ రవి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దలు పాల్గొన్నారు.



జర్నలిస్ట్ రవీందర్‌కు పరామర్శ

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 30 : నిర్మల్ జిల్లాకు చెందిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్, టియుడబ్లుజె జిల్లా అధ్యక్షులు కొండూరి రవీందర్, ఇటీవల మోకాలి చిప్ప శస్త్రచికిత్స చేయించుకున్నారు. విషయం తెలిసిన వెంటనే హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ కు వెళ్లి పరామర్శించాలని చూడగ అప్పటికే జర్నలిస్ట్ రవీందర్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి స్వస్థలమనైన నిర్మల్ పట్టణం చేరుకున్నారు. అనంతరం ఆదివారం అహ్మద్ ఇంతియాజ్ అలీ స్టేట్ కరెస్పాండంట్, ఇసాక్ అలీ ఇరువురు జర్నలిస్ట్ రవీందర్ ఇంటికి చేరుకొని యోగక్షేమలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ సూచించిన ప్రకారం రెస్ట్ తీసుకోవాలని కోరారు. అలాగే వెంటనే కోలుకొని విధుల్లో చేరాలని అభిప్రాయపడ్డారు.

నిర్మల్ జిల్లా జాతీయ మానవ హక్కుల కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఇస్మాయిల్ ఖాన్

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 30: జిల్లా ఖానాపూర్ జాతీయ మానవ హక్కుల కమిటీ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ ఇస్మాయిల్ ఖాన్‌ను రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మొగుళ్ల భద్రయ్య నియమించారు. ఈ నియామకాన్ని జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ. వకీల్ అధికారికంగా ప్రకటించారు.రాష్ట్ర జాతీయ కమిటీ ఆదేశాల మేరకు బలమైన లీగల్ ప్రొసీజర్, ఫోటో కాల్ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని వకీల్ వెల్లడించారు.పదవి బాధ్యతలు స్వీకరించిన ఇస్మాయిల్ ఖాన్ మాట్లాడుతూ, తమపై నమ్మకం ఉంచి ముఖ్యమైన బాధ్యత అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ భద్రయ్య, జిల్లా అధ్యక్షులు ఎం.ఏ. వకీల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నీతి, నిజాయితీ, పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.జిల్లా అధ్యక్షుడు వకీల్ మాట్లాడుతూ, మానవ హక్కుల పరిరక్షణలో కమిటీ కీలక



పాత్ర పోషిస్తుందని, రాజ్యాంగ విలువలను కాపాడే విధంగా అన్ని అధికారులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు.కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ నాయకులు పిల్లి శ్రీనివాస్, ఎం.ఏ. ఖలీల్, మాజీ పురపాలక సంఘ ఉపాధ్యక్షుడు నసీర్ అహ్మద్, సామాజిక కార్యకర్త ఎం.ఏ. అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్ పర్యటనను నిలిపివేయాలి. ప్రభుత్వ సొమ్ముతో ప్రచారమా? ఎన్నికలు గ్రామాల్లో ఉంటే సీఎం జిల్లా కేంద్రాలకు వెళ్లి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారట. ఇది ముమ్మాటికీ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడమే. ఈ విషయంలో ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని సీఎం పర్యటనను నిలిపివేయాలి.

- జాగృతి అధ్యక్షురాలు కవిత

పంచాయతీ ఎన్నికల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ల పాత్ర కీలకం

- ఎన్నికల పరిశీలకుడు సత్యనారాయణ రెడ్డి



ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, నవంబర్ 30: గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ బృందాల పాత్ర అత్యంత కీలకమని సాధారణ పరిశీలకులు సత్యనారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లాకు చేరుకున్న సాధారణ పరిశీలకులు ముందుగా చిన్న మల్లారెడ్డి గ్రామ పంచాయితీ కార్యాలయం లో 2వ విడత నామినేషన్ స్వీకరణ ప్రక్రియ ను, మొదటి విడత నామినేషన్ స్క్రూటినీ నీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం సాయంత్రం కలెక్టరేట్ లో ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయితీ ఎన్నికల్లో FST (ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్) మరియు SST (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్) బృందాల పాత్ర అత్యంత కీలకమని ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, న్యాయంగా, శాంతియుతంగా సాగేందుకు ఈ బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, ఆయన తెలిపారు. గ్రామ పంచాయితీ ఎన్నికల సమయంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, డబ్బు లేదా మద్యం పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలను అరికట్టేందుకు FST-SST బృందాలు శీఘ్ర విచారణ చర్యలు చేపట్టాలని, చెక్ పోస్టుల ద్వారా గట్టి నిఘా ఏర్పాటు చేసి ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని, ప్రజలు కూడా ఎన్నికల ప్రక్రియలో చైతన్యంగా పాల్గొని, అనుమానాస్పద పరిస్థితులను సమాచారం ఇవ్వాలని సత్యనారాయణ రెడ్డి కోరారు. గ్రామ స్థాయి ఎన్నికలలో ప్రతి ఓటు విలువైనదని, స్వేచ్ఛగా, న్యాయంగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన తెలిపారు. అనంతరం 21 వ నంబర్ లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎం.సీ.ఎం.సీ), కంట్రోల్ రూమ్ ను సందర్శించి ఎంసిఎంసి సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, సకాలంలో ప్రచార ప్రకటనలకు సంబంధించిన అనుమంతులు మంజూరు చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను గమనిస్తూ ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మదన్ మోహన్, డీపీవో మురళీ, సివిల్ సప్లై (లైజనింగ్ ఆఫీసర్) తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి రెండో విడత నామినేషన్లు

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, నవంబర్ 30: జిల్లా లో సోమవారం నుంచి రెండో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్లు ప్రారంభం అవుతాయని కలెక్టర్ ఆశిష్ సంగవాన్ తెలిపారు.ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని లింగంపేట,నాగిరెడ్డిపేట, గాంధారి ఎల్లారెడ్డి నామినేషన్ ప్రక్రియ,బాన్సువాడ డివిజన్ పరిధిలోని మహమ్మద్ నగర్, నిజాంసాగర్, పిట్లం మండలాల్లో రెండో విడత నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు.ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఏడు మండలాల పరిధిలో 197 గ్రామపంచాయతీలకు.. 1654 వార్డు స్థానాలకు నిర్వహించనున్న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.



పడమటి ఆంజనేయ స్వామి కోనేరు పునః ప్రారంభం

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 30: మక్తల్ పట్టణంలో పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో పునర్ నిర్మించిన కోనేరును ఆదివారం ఘనంగా రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. గత కొన్ని దశాబ్దాలుగా మరుగున పడి ఉన్న కోనేరును మంత్రి సొంత నిధులతో పునర్ నిర్మించారు. పునర్ నిర్మించిన కోనేరుకు పూజలు చేసి మంత్రి సతీ సమేతంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పడమటి ఆంజనేయ స్వామి జాతర బ్రహ్మోత్సవాలు ఈనెల 2 నుండి ప్రారంభం కానున్నాయని తెలిపారు వారం రోజులపాటు బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని తెలియజేశారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆంజనేయ స్వామి కోనేరు మరుగున పడిపోయిందన్నారు.



కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమీక్ష సమావేశం

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 30: మండల పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ ఆధ్వర్యంలో నర్వ మండల మరియు గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నర్వ మండలంలో మూడవ దశలో డిసెంబర్ 17న జరుగుతున్న లోకల్ బాడీ సర్పంచ్ ఎన్నికలలో భాగంగా అన్ని గ్రామాల ముఖ్య నాయకులు మరియు కార్యకర్తల సన్నాహక సమావేశం లో నర్వ మండలంలోని అన్ని గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గెలవాలని మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మాదిరెడ్డి జలంధర్ రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, గ్రామాలలో అందరూ ఏకాభిప్రాయంతో సమిష్టి కృషితో కలుపుకొని అభ్యర్థులను గెలిపించుకోవాలని మండల పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా నాయకులు, నర్వ మండల నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కిసాన్ సెల్, బీసీ సెల్, ఎస్సీ సెల్,ఎన్ఎస్‌యూఐ నాయకులు, అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.



గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యేలు

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 30 :అడ్డాకుల మండలం పెద్ద మునగాల చెడు గ్రామానికి చెందిన పుష్యమ్మవెంకట్ రెడ్డిల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు.తూడి మేఘారెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు. మధుసూదన్ రెడ్డిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు సత్యనారాయణ స్వామి వ్రత తీర్థ ప్రసాదాలను స్వీకరించి దంపతులకు నూతన వస్త్రాలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి మనిషి జీవితంలో సొంత ఇంటి నిర్మాణం ఓ కలగా ఉంటుందని వారికి నచ్చినట్లుగా ఇంటి నిర్మాణం చేసుకోవడం అభినందించదగ్గ విషయమని నూతన ఇంటిని నిర్మించుకొని గృహప్రవేశం చేసిన దంపతులకు ఎమ్మెల్యేలు అభినందనలు తెలియజేశారు.కార్యక్రమంలో పెద్దమందడి సింగిల్ విండో మాజీ అధ్యక్షులు సత్యరెడ్డి, మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, వెల్టూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయండి

- బికేఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణారెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 30: నేడు సీఎం రేవంత్ రెడ్డి మక్తల్ పర్యటనలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని అనంతరం జరిగే బహిరంగ సభకు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని బికేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలకృష్ణరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మక్తల్ పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి వాకిటి శ్రీహరి కృషితో మక్తల్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా డిసెంబర్ 1న పలు అభివృద్ధి పనులు చేపట్టబోతున్నారని తెలిపారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, మక్తల్ నుంచి జిల్లా కేంద్రం నారాయణపేటకు నాలుగు లైన్ల రోడ్డు ఆత్మకూరు దగ్గర బ్రిడ్జి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం పాల్గొంటారని తెలిపారు. అనంతరం మక్తల్ పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ట సురేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవికుమార్ యాదవ్, కోళ్ల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, మాగనూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆనంద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 30: రెండో విడత మండలాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆదివారం మొదలైంది. హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలంలోని సీతంపేట, నాగారం క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఏర్పాటుచేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో చేసిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. క్లస్టర్ నామినేషన్ల స్వీకరణ కేంద్రమైన సీతంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏయే గ్రామాల పరిధిలో సర్పంచ్ వార్డు స్థానాలకు నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాను ప్రదర్శించాలని, హెల్ప్ డెస్క్ ద్వారా అభ్యర్థులకు నామినేషన్లకు సంబంధించిన సమాచారం అందించాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు తగిన కౌంటర్లు ఉండాలన్నారు. ఎన్నికల విధులలో పాల్గొంటున్న అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గుర్తింపు కార్డులను ధరించాలని సూచించారు. నాగారం క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో రవి, ఎంపీడీవో సుమనవాణి, తహసిల్దార్ కిరణ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



నేటి నుండి పార్లమెంట్ సమావేశాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 30: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1 నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 19 వరకు జరిగే ఈ సమావేశంలో మొత్తం 15 పనిదినాలు ఉంటాయి. సాధారణంగా ఇవి 20 ఉండేవి. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్)తో పాటు, ఇటీవల హఠాత్తుగా తెచ్చిన నాలుగు కొత్త లేబర్ కోడ్‌లు, ఢిల్లీలో జరిగిన పేలుడు, దేశ రాజధానిలో పెరిగిపోతున్న కాలుష్యం, అణు ఇంధన రంగం ప్రైవేటీకరణ, రైతులకు కనీస మద్దతు ధర, కొత్తగా ఏర్పాటవుతున్న ఉన్నత విద్యా కమిషన్ తదితర అంశాలపై అధికార బీజేపీని నిలదీయడానిక విపక్షాలు సిద్ధమవుతున్నాయి. దీంతో సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశం ఉంది. ఈ సమావేశాల్లో కేంద్రం 14 బిల్లులను ప్రవేశపెట్టనుంది. పలు సంస్కరణల అజెండాను మోదీ ప్రభుత్వం ముందుకు తీసుకురానుంది. వీటిలో సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్, ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటు, అణు ఇంధనం, కార్పొరేట్, బీమా, జాతీయ రహదారులు, మధ్యవర్తిత్వంరాజీ చట్టాల సవరణ బిల్లులు ప్రధానమైనవి. చండీగఢ్‌ను అధికరణం 240 పరిధిలోకి తెచ్చే 131 రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెడదామనుకున్నప్పటికీ విపక్షాల నిరసనతో కేంద్రం వెనకడుగు వేసింది. జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో అనూహ్య పరిస్థితుల్లో ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన రాధాకృష్ణన్ నేతృత్వంలో తొలిసారిగా రాజ్యసభ సమావేశాలు జరగనున్నాయి.

విశ్వ వీక్షణం



ఏజేఎల్‌ను కుట్రతో లాక్కున్నారు!

- సోనియా, రాహుల్‌పై ఢిల్లీ పోలీసుల తాజా ఎఫ్ఐఆర్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 20: సోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)ను కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని ఢిల్లీ పోలీసు శాఖలోని ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) ఆరోపించింది. ఈ మేరకు ఎఫ్ఐఆర్‌ను దాఖలు చేసింది. ఈ కేసులో వీరిద్దరితోపాటు మరో ఆరుగురిని నిందితులుగా పేర్కొంది. ఈ కంపెనీ అంతకుముందు కాంగ్రెస్ పార్టీకి సంబంధించినదని, దానికి రూ.2,000 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయని, ఆ కంపెనీని తప్పుడు విధానంలో తమ నియంత్రణలోకి తీసుకోవడం కోసం సోనియా, రాహుల్‌తోపాటు వారి సహచరులు కలిసికట్టుగా పని చేశారని గతంలో నమోదైన కేసు ఆధారంగా ఈ ఛార్జ్‌షీటును దాఖలు చేసింది. అక్టోబర్ 3న నమోదైన ఎఫ్ఐఆర్ ప్రకారం, సోనియా, రాహుల్‌లకు కలిపి 76 శాతం వాటాలున్న యంగ్ ఇండియన్ కంపెనీ ద్వారా ఈ స్వాధీనం జరిగింది. ఈడీకి చెందిన హెడ్‌క్వార్టర్స్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్ సమర్పించిన ఫిర్యాదు నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు చర్యలు ప్రారంభించారు.



ఎడారి వసంతం-29

గొలుసు కథ




కె.ఇ.నిలమంగై
హైదరాబాద్

జరిగిన కథ:

తల్లి లేకున్నా తనకు తండ్రి, అమ్మమ్మ, తాతయ్య, మేనమామ, పిన్ని తదితర బంధువులందరూ ఉన్నారని ఆనందిస్తుంది సిరిమువ్వ. అతులిత్ అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని నాగరత్నం, సామ్రాట్ లు పరిణయను ప్రేమలో దించేలా ఉసిగొలుపుతారు. కృష్ణను బెదిరించి నిజాలను రాబడతారు పోలీసులు. గోల్డెన్ స్వాన్ హోటల్లో జరుగుతున్న పార్టీలో ఎలాంటి అవరోధం జరగకుండా డేగ కళ్ళతో పరిశీలిస్తుంటాడు సంపత్. (ఇక చదవండి)

తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోని అతులిత్ ను నాగరత్నం ఎంతో ప్రేమ ఒలకపోస్తూ తనకు అవసరం అనిపించినపుడు సుగుణమ్మ కుటుంబం పై విషపు ఆలోచనలను నూరిపోసి పెంచింది. అతులిత్ తల్లిదండ్రుల చావుకు తానే కారణమనే విషయం తనలోనే దాచుకుంటూ శకునిలా కుయుక్తుల పాచికలు ఉపయోగిస్తూ వాళ్ళ వంశం మొత్తానికీ వారసుడైన అతులిత్ ను తనగుప్పిటిలో పెట్టుకుందనే విషయాన్ని తల్లిదండ్రులు మరణించే సమయానికి చిన్నవాడిగా వున్నాడు కనుక కనుగొనలేకపోయాడు. ఆమె కొడుకైన సామ్రాట్ ను, తమ్ముని కూతురైన వసుమతిని తప్పుదోవ పట్టించి, ఎందుకూ పనికి రాకుండా రౌడీల్లా తయారుచేసింది.



పాఠశాలలో జరిగిన ఆరోగ్య పరీక్షలో సిరిమువ్వకు వంశపారంపర్యంగా కంటి జబ్బు ఇప్పుడే సంక్రమించిందని కనుగొన్న ఇందిర, చక్రవర్తులు దానికి సంబంధించిన రిపోర్టులను వారికి తెలిసిన కంటి డాక్టర్ రాహుల్ కు పంపించారు. ఆ రిపోర్ట్స్ చూసాక మందులతో కాకుండా సిరి తీసుకునే ఆహారంలోనే పోషకవిలువలు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటే వెంటనే తగ్గే అవకాశం ఉందని డాక్టర్ చెప్పారు. దాంతో ఇందిర, చక్రవర్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయాన్నే సంకేత్ కు,ఝాన్సీ కి,రాజీవ్ కి చెప్పి వాళ్ళు అమలుపరచేలా హామీ తీసుకున్నారు.

హరి, సుందరిల సన్నాహాలు, మెహందీ, సంగీత్ ఫంక్షన్లు సక్రమంగా జరిగేలా గోల్డెన్ స్వాన్ ఫంక్షన్ హాల్ లో జ్వాలాముఖి, సంపత్ లు గట్టి బందోబస్తుతో ఉన్నారు. వచ్చిన అతిథులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా సుగుణమ్మ, సూర్య, అంజలి, ప్రణవ్, పరిణయలు పెళ్లి ఏర్పాట్లలో నిమగ్నమై ముందుకు నడిపిస్తున్నారు.

జ్వాలాముఖి నుంచి సంపాదించిన హార్డ్ డిస్కులో వున్న కోడ్ సారాంశాన్ని డీకోడ్ చేసే బాధ్యత సంపత్ దే. కానీ అది సజావుగా జరగాలంటే ఫంక్షన్ హాల్ కి మారువేషంలో వచ్చిన ఆగంతకుడిని కనిపెట్టి, వాడిని బంధించి, శిక్షించాలి. అతులిత్ ను మంచి మార్గంలోకి మళ్ళించాలి, అలాగే వసుమతి, సామ్రాట్, కృష్ణల గురించి వారి కుటుంబ విషయాలు బాగా తెలిసిన జ్వాలాముఖికే సాధ్యం.

సంపత్ క్లూ కోసం కుస్తీ పడుతున్నాడు. తను ఆలోచించగా, ఆలోచించగా చిన్న క్లూ దొరికింది. హార్డ్ డిస్కులోని సారాంశాన్ని డీకోడ్ చేయటానికి. ఫారిన్లో వున్న అతులిత్ కు సూర్య వాళ్ళ కుటుంబం గురించి, సిరిమువ్వ ఎవరనే విషయం తెలిపింది ఇండియాలో ఉన్న ఆ ఆగంతకుడే అని. ఆ ఆగంతకుడే దీక్ష,సంకేత్ ల పెళ్ళికి సాక్షి సంతకం చేసి, సామ్రాట్ చేసే రహస్య దందాలో భాగస్వామ్యం ఉండి సుగుణమ్మకు, నాగరత్నంకు మనస్పర్థలు వచ్చేలా చేసిన మోస్ట్ వాంటెడ్ పవర్ ఫుల్ బ్లాక్ మ్యాజిక్ లో సిద్ధహస్తుడు. అందరిలో తానూ ఒకడిగా కలిసి మెలిసి తిరుగుతూ పెద్ద క్రిమినల్ మైండ్ టన్నుల కొద్దీ వున్నవాడు. తనకు అపాయమనిపిస్తే ఎంతటి మహానుభావులనైనా సునాయాసంగా కేసుల్లో ఇరికించి తాను మాత్రం పాదరసంలా జారుకునే జాకాల్ అలియాస్ జీవిత్.

డిస్కులో వున్న కోడ్ లెటర్స్ S5P2VJ2ICA2. వీటిని పరిశీలిస్తున్న సంపత్ మెదడులో ఒక చురుకైన ఆలోచన తట్టింది. హరి,సుందరిల పెళ్ళి సజావుగా జరగాలంటే పైనున్న సమస్యలన్నీ కారుమబ్బుల్లా తొలగి నిర్మలమైన ఆకాశంలా కనిపించాలన్నా వెంటనే పరిష్కారాన్ని కనుక్కోవాలని అనిపించింది. సుముహూర్తానికి ఇంకా 3 రోజులే వుంది కాబట్టి దానినే ఛేదించే దిశగా తన కార్యాలయానికి బయలుదేరాడు తలపంకిస్తూ!

(సశేషం)



గాజాలో 70 వేలు దాటిన మృతుల సంఖ్య

గాజా, నవంబర్ 30: ఇజ్రాయెల్ సైనిక దాడుల్లో పాలస్తీనియన్ల మరణాలు 70 వేలు దాటిందని గాజా ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. అక్టోబర్ 10న కాల్పుల విరమణ కుదిరినప్పటికీ, ఇజ్రాయెల్ సైనిక దాడులు కొనసాగుతున్నాయని, పౌరుల మరణాలు పెరుగుతున్నాయని గాజా ఆరోగ్యశాఖ నివేదిక తెలిపింది. శాంతి ఒప్పందం అమల్లోకి వచ్చినా.. శిథిలాల నుంచి మృతదేహాలు బయటపడుతున్నాయని పేర్కొన్నది. ఇజ్రాయెల్‌హమాస్ యుద్ధం మొదలైన నాటి నుంచి ఇప్పటివరకు 70,100 మంది పాలస్తీనియన్లు మరణించారని, ఇటీవల ఓ పాఠశాలలోని శరణార్థుల శిబిరానికి సమీపంలో ఇజ్రాయెల్ దాడులు చేపట్టగా, ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని నివేదిక తెలిపింది. ఓవైపు గాజాలో యుద్ధానంతర పాలనపై అమెరికా కసరత్తు చేస్తుండగా, మరోవైపు గాజాలో కాల్పుల విరమణ ఉల్లంఘనలు చోటుచేసుకుంటున్నాయి.



యూకేలో భారత విద్యార్థి దారుణ హత్య

యూకే లో భారత్‌కు చెందిన విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. వోర్‌స్టర్ ప్రాంతంలో నవంబర్ 25న ఈ ఘటన జరిగింది. హర్యానాకు చెందిన విజయ్ కుమార్ షియోరాన్ (30) అనే యువకుడిపై గుర్తుతెలియని దుండగులు కత్తులతో దాడి చేశారు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ కేసులో పోలీసులు ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని చెప్పారు. హర్యానాకు చెందిన విజయ్ కుమార్ షియోరాన్ ఈ ఏడాది ప్రారంభంలో ఉన్నత చదువుల కోసం యూకేకు వెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విజయ్ అంతకుముందు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్‌లో ఉద్యోగం చేసేవాడని, ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి జనవరిలో బ్రిటన్‌కు వెళ్లాడని చెప్పారు. విజయ్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకురావడానికి సహాయం చేయాలని కోరుతూ మృతుడి కుటుంబసభ్యులు విదేశాంగ మంత్రిత్వ శాఖను, హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీలను సంప్రదించారు. కాగా హత్యకుగల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.



రెండు ఆర్టీసీ బస్సులు ఢీ... 11 మంతి మృతి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చెన్నై, నవంబర్ 30: తమిళనాడులోని కరైకుడికి 15 కిలోమీటర్ల దూరంలో ఆదివారం రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 11 మంది మృతి చెందగా, 54 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రభుత్వ దవాఖానలకు తరలించారు. మృతుల్లో తొమ్మిది మంది మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. మాదానికి స్పష్టమైన కారణం తెలియదని.. దానిపై దర్యాప్తు చేస్తున్నామని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. వారం వ్యవధిలో తమిళనాడులో బస్ ప్రమాదం జరగడం ఇది రెండోసారి. ఇటీవల తెన్‌కాశీ జిల్లాలో జరిగిన ఇలాంటి ప్రమాదంలో ఆరుగురు చనిపోగా, 50 మంది గాయపడ్డారు.

మొక్కలు, పీరియడ్స్

వీటి మధ్య ఉన్న సంబంధం ఏమిటి?!

మొక్కలు మరియు పీరియడ్స్ విల్టింగ్ మధ్య ఏదైనా సంబంధం ఉందా? పీరియడ్స్ అనేది సహజ ప్రక్రియ, ఇది ప్రతి స్త్రీ, బాలికలు నిర్దిష్ట వయస్సు తర్వాత అనుభవించవలసి ఉంటుంది. పీరియడ్స్ కు సంబంధించి అనేక అపోహలు ఉన్నాయి. దీంతో మహిళల జీవితాలలో అంధకారం నెలకొంది. పీరియడ్స్‌కు సంబంధించి ఏదైనా సమస్య వచ్చినప్పుడు, నిద్రపోవడం, వంటగదికి వెళ్లకపోవడం, జుట్టు కడగడం మొదలైన వాటికి సంబంధించి అనేక నియమాలు, నిబంధనలు ఉన్నాయి. భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు సహా వివిధ సంస్కృతులలో, ఋతుస్రావం సమయంలో మహిళలు తులసి మొక్కను తాకడం లేదా నీరు పెట్టడం మానుకోవాలని నమ్ముతారు. ఈ ఆచారం తరతరాలుగా కొనసాగుతోంది. సాంస్కృతిక, మత విశ్వాసాలలో పాతుకుపోయింది.

పెద్దలు అలా చెబుతారు

పీరియడ్స్ సమయంలో, పువ్వులు, చెట్లు మొక్కను తాకడం ద్వారా వాడిపోవడం ప్రారంభిస్తాయా? పీరియడ్స్ సమయంలో మొక్కలు వాడిపోవడం వల్ల వాటిని తాకడం నిషిద్ధమని చెబుతుంటారు. సైన్స్ ప్రకారం, మొక్క వాడిపోవడానికి పీరియడ్స్‌కు సంబంధం లేదు. మొక్కలు ఎండిపోవడానికి నీటి కొరత, పోషకాల కొరత వంటి అనేక కారణాలు ఉండవచ్చు. మొక్కలు ఎండిపోకుండా కాపాడాలంటే వాటి వేర్లు, ఆకులు, పండ్లను పరిశీలించాలి. మొక్కలు వివక్ష చూపవు. ఎవరి నుంచి వచ్చినా మనందరిలాగే వారు కూడా మంచి శ్రద్ధతో అభివృద్ధి చెందుతారు. దీని కారణంగా మొక్క వాడిపోవడం ప్రారంభమవుతుంది

కారణం ఇది

మొక్కలు ఫోటోపెరియోడిజం కలిగి ఉంటాయి, ఇది కాంతి, చీకటి కాలాల సాపేక్ష పొడవులకు వాటి ప్రతిస్పందనను సూచిస్తుంది. మొక్కలను వాటి ఫోటోపెరియోడ్ ఆధారంగా మూడు గ్రూపులుగా వర్గీకరిస్తారు. చిన్న రోజు మొక్కలు, దీర్ఘ రోజు మొక్కలు మరియు రోజు తటస్థ మొక్కలు. చాలా మొక్కలు పుష్పించడానికి క్లిష్టమైన ఫోటోపెరియోడ్ థ్రెషోల్డ్‌ను చేరుకోవాలి.







విరాట్ విధ్వంసం.. టీమిండియా విజయం

టెస్టు సిరీస్‌లో క్లీన్‌స్వీప్ నుంచి తేరుకున్న భారత జట్టు వన్డే సిరీస్‌లో బోణీ కొట్టింది. రాంచీ మైదానంలో ఉత్కంఠగా సాగిన పోరులో విరాట్ కోహ్లీ(135)సూపర్ సెంచరీకి కుల్దీప్ యాదవ్(468)మ్యాజిక్ తోడవ్వడంతో సఫారీలను చిత్తు చేసింది. భారీ ఛేదనలో 130కే ఐదు వికెట్లు పడినా..మాథ్యూ బ్రిట్జ్ (72), మార్కో జాన్సెస్(70), లు అర్ధ శతకాలతో పోరాడి కంగారెత్తించారు. అయితే.. చైనామన్ కుల్దీప్ వీరిద్దరిని ఒకే ఓవర్లో వెనక్కి పంపి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఆఖర్లో కార్బిన్ బాష్(67) మెరుపులు మెరిపించినా సరిపోలేదు. 17 పరుగులతో గెలుపొందిన రాహుల్ సేన మూడు వన్డేల సిరీస్‌లో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. స్వదేశంలో టెస్టు సిరీస్ ఓటమికి దీటుగా బదులిచ్చింది భారత జట్టు. రాంచీలో అదివారం ఆధిపత్యం చేతులు మారిన తొలి వన్డేలో సూపర్ విక్టరీ సాధించింది. కేఎల్ రాహుల్ సారథ్యంలోని టీమిండియా భారీ స్కోర్ చేసింది. ఆ తర్వాత బంతితో కుల్దీప్ యాదవ్ (468) తిప్పేయగా.. ప్రత్యర్థినికి ఆలౌట్ చేసి సిరీస్‌లో ముందంజ వేసింది. భారత్ నిర్దేశించిన భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా ఆరంభంలోనే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. తన తొలి ఓవర్లోనే హర్షిత్ రానా (335) తొలి బంతికే ఓపెనర్ రియాన్ రికెల్టన్(0)ను బౌల్డ్ చేసిన రానా.. నాలుగో బంతికి క్వింటన్ డికాక్(0)ను డకౌట్‌గా వెనక్కి పంపాడు. అంతే.. 7 పరుగులకే సఫారీ జట్టు రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఒత్తిడికి లోనైన కెప్టెన్ ఎడెన్ మర్‌క్రమ్(7) సైతం అర్ష్‌దీప్ సింగ్ ఓవర్లో రాహుల్ చేతికి దొరికిపోయాడు. ఆ తర్వాత మాథ్యూ బ్రిట్జ్ (54 నాటౌట్)తో టోనీ డి జోర్జి(39) కలిసి ఇన్నింగ్స్ నిర్మించాడు. క్రీజులో కుదురుకున్నాక బౌండరీలతో స్కోర్ బోర్డును ఉరికించిన ఈ ద్వయాన్ని కుల్దీప్ విడదీశాడు. నాలుగో వికెట్ తీసిన భారత బౌలర్ల సంబురాన్ని డెవాల్డ్ బ్రెవిస్(37) నీరుగార్చుతూ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. జడేజా ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన అతడు ఆ తర్వాత రానా ఓవర్లో పెద్ద షాట్ ఆడి గైక్వాడ్ చేతికి చిక్కాడు. అనంతరం బౌండరీలతో విరుచుకుపడుతున్న డెవాల్డ్ బ్రెవిస్(37) అతడి ఓవర్లో వెనుదిరిగాడు. సిక్సర్‌కు యత్నించిన బ్రెవిస్ బౌండరీ వద్ద రుతురాజ్ గైక్వాడ్ చేతికి దొరికిపోయాడు. 130కే సగం మంది పెవిలియన్ చేరినా.. మాథ్యూ బ్రీట్జ్ (72), మార్కో జాన్సెన్(70) మాత్రం పట్టువిడువలేదు. టెస్టు సిరీస్‌లో భారత్‌ను దెబ్బతీసిన జాన్సెన్ అలవోకగా ఫోర్లు, సిక్సర్లతో 26 బంతుల్లోనే యాభై కొట్టాడు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని 34వ ఓవర్లో కుల్దీప్ వెనక్కి పంపి మ్యాచ్‌ను భారత్‌వైపు తిప్పాడు. కార్బన్ బాష్ (67) ఆఖర్లో గట్టిగానే ప్రయత్నం చేశాడు. అర్ష్‌దీప్ వేసిన 49వ ఓవర్లో లో ఫుల్‌టాస్‌ను సిక్సర్‌గా మలిచాడు. దాంతో.. సమీకరణం 6 బంతుల్లో 18 పరుగులైంది. కానీ, ప్రసిధ్ వేసిన చివరి ఓవర్ రెండో బంతికి పెద్ద షాట్ ఆడిన బాష్ మిడాన్‌లో రోహిత్ చేతికి చిక్కాడు. దాంతో.. 17 పరుగుల తేడాతో భారత్ జయభేరి మోగించింది.



ఫైనల్లో తడబడిన శ్రీకాంత్

టైటిల్ నిలబెట్టుకున్న త్రీసా – గాయత్రి

ప్రతిష్ఠాత్మక సయ్యద్ మోడీ ఇంటర్నేషన్ లో భారత స్టార్లు త్రీసా జాలీ - గాయత్రీ గోపిచంద్ ద్వయం జయకేతనం ఎగురేసింది. డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగిన ఈ జోడీ అదిరే ఆటతో టైటిల్ నిలబెట్టుకుంది. ఆదివారం జరిగిన మహిళల డబుల్స్ ఫైనల్లో ఈ జంట కహో ఒసావా మై తనబే (జపాన్)ను చిత్తు చేసింది. మఅయితే.. పురుషుల విభాగంలో కిడాంబి శ్రీకాంత్ కు మాత్రం నిరాశే మిగిలింది. సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ సూపర్ 300 టోర్నమెంట్ ఫైనల్లో భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల డబుల్స్‌లో తమకు తిరుగులేదని చాటుతూ త్రీసా జాలీ గాయత్రీ గోపిచంద్ టైటిల్ కొల్లగొట్టింది. ఉత్కంఠ రేపిన ఫైనల్లో జపాన్ ద్వయం కహో ఒసావా - మై తనబే జోరుకు భారత జంట తొలి సెట్‌లో కోల్పోయింది. కానీ, ఆ తర్వాత గొప్పగా పుంజుకున్న త్రీసా, గాయత్రి సంచలన ఆటతో వరుసగా రెండు సెట్లను 2113, 2115తో గెలుచుకున్నారు. వరుసగా రెండోసారి టైటిల్ సాధించి మురిసిపోయారు.

మరోసారి నిరాశే

భారత్‌కే చెందిన మిథున్ మంజునాథన్ ను ఓడించి ఫైనల్ చేరిన శ్రీకాంత్ విజేతగా నిలవలేకపోయాడు. తనకంటే తక్కువ ర్యాంకర్ అయిన హాంకాంగ్ షట్లర్ జేసన్ గునవాన్ చేతిలో అనూహ్యంగా కంగుతిన్నాడు. తొలి సెట్‌ను 1621తో కోల్పోయిన శ్రీకాంత్ రెండో సెట్‌లో ప్రత్యర్థిపై పైచేయి సాధించాడు. అయితే.. నిర్ణయాత్మక మూడో సెట్‌లో జేసన్‌ను నిలువరించలేక మ్యాచ్ అప్పగించేశాడు భారత స్టార్. దాంతో.. ఎనిమిదేళ్లుగా టైటిల్ కోసం నిరీక్షిస్తున్న అతడికి మరోసారి నిరాశే మిగిలింది.



ఐపీఎల్‌కు రసెల్ గుడ్‌బై

కొల్‌కతా టీమ్‌కు 'పవర్ కోచ్'గా నియామకం

వెస్టిండీస్ దిగ్గజ ఆల్‌రౌండర్ ఆండ్రీ రసెల్ తన సుదీర్ఘ ఐపీఎల్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రాబోయే సీజన్‌కు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ అతడిని రిటైన్ చేసుకోకపోవడంతో ఈ విండీస్ విధ్వంసర ఆటగాడు వేలంలోకి వస్తాడని అంతా భావించినా రసెల్ మాత్రం తాను ఐపీఎల్ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించి అందర్నీ ఆశ్చర్యానికి గురిచేశాడు. ఎక్స్ వేదికగా తన నిర్ణయాన్ని తెలిపిన అతడు.. ఆటగాడిగా గుడ్‌బై చెప్పినా కేకేఆర్‌తో తన అనుబంధం కొనసాగుతుందని తెలిపాడు. రాబోయే సీజన్‌లో అతడు కేకేఆర్ 'పవర్ కోచ్'గా సేవలందించనున్నాడు. 2012లో ఢిల్లీ డేర్ డెవిల్స్ (ప్రస్తుత ఢిల్లీ క్యాపిటల్స్)తో ఈ లీగ్ ప్రయాణాన్ని ఆరంభించిన రసెల్.. 2014 నుంచి వరుసగా 12 సీజన్ల పాటు కోల్‌కతాకు ప్రాతినిథ్యం వహించాడు. ఐపీఎల్‌లో 140 మ్యాచ్‌లు ఆడిన రసెల్.. 2,651 రన్స్ చేయడమే గాక బంతితో 123 వికెట్లు పడగొట్టి ఈ లీగ్ అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకడిగా నిలిచాడు.

ప్రతిపక్షం
Prathipaksham.in
12
హైదరాబాద్
సోమవారం
01.12.2025

'మన శంకరవరప్రసాద్ గారు' కోసం మాస్ డ్యాన్స్ సాంగ్ షూటింగ్ ప్రారంభం

మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మన శంకర వర ప్రసాద్ గారు. హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. చార్ట్ బస్టర్ ఫస్ట్ సింగిల్ మీసాల పిల్ల 72 మిలియన్లకు పైగా వ్యూస్ ని సంపాదించి ఎప్పటికే ఈ చిత్రం హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ స్క్రీన్ షేర్ చేసుకోవడం ఫ్యాన్స్ ని విశేషంగా అలరించనుంది. హైదరాబాద్ లో వేసిన భారీ సెట్ లో చిరంజీవి, వెంకటేష్ లపై స్టైలిష్ డ్యాన్స్ సాంగ్ షూటింగ్ ని మేకర్స్ ప్రారంభించారు. తొలిసారిగా, చిరంజీవి, వెంకటేష్ ఒక ఉత్సాహభరితమైన, గ్రాండ్ సెలబ్రేషన్ నంబర్ లో కలిసి అలరిస్తున్నారు. ఈ సాంగ్ కోసం భీమ్స్ సిసిరోలియో అద్భుతమైన బీట్స్ తో పర్ఫెక్ట్ డ్యాన్స్ నంబర్ ని కంపోజ్ చేశారు. ఈ పాటలో 500 మందికి పైగా డ్యాన్సర్లు పాల్గొంటున్నారు. ఈ పాటలో సెట్ ని కలర్, రిథమ్, వైబ్ ల కార్నివాల్ గా మార్చారు. ఇద్దరు స్టార్‌ల కెమిస్ట్రీ, ఎనర్జీ ప్రేక్షకులని అభిమానులను ఫుల్‌గా ఎంటర్‌టైన్ చేయనుంది. బ్లాక్ బస్టర్ హిట్ మీసాల పిల్లకి కొరియోగ్రఫీ చేసిన పొలకి విజయ్ ఈ పాటకు కూడా కొరియోగ్రఫీ అందించడం విశేషం. చిరంజీవి, వెంకటేష్ కలసి అదరగొట్టబోతున్న ఈ సాంగ్ సంక్రాంతికి పర్ఫెక్ట్ ఫీస్ట్ కానుంది.





బాలకృష్ణతో నటించడం నా అదృష్టం

హర్షాలి మల్హోత్రా

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ దర్శకుడు బోయపాటి శ్రీను పవర్ ఫుల్ కొలాబరేషన్ లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ డివైన్ యాక్షన్ ఎక్స్‌ట్రావగాంజా 'అఖండ 2: తాండవం'. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎం తేజస్విని నందమూరి సగర్వంగా చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఎస్ థమన్ సంగీతం అందించారు. టీజర్, ట్రైలర్ సాంగ్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. 'అఖండ 2: తాండవం' 2D, 3D రెండు ఫార్మాట్లలో డిసెంబర్ 5, 2025న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంల కీలక పాత్ర పోషించిన హర్షాలి మల్హోత్రా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు. చాలా ఎక్సైటింగ్ గా ఉంది. దాదాపు పదేళ్ళ తర్వాత మళ్లీ నేను థియేటర్స్ కి వస్తున్నాను. ఈ చిత్రంలో జనని అనే క్యారెక్టర్ లో కనిపిస్తాను. తను చాలా స్వీట్, కేరింగ్. తనకి అఖండ బ్లెస్సింగ్స్ ఉంటాయి. జనని లైఫ్ ఎప్పుడు డేంజర్ లో ఉన్న అఖండ తనకోసం వస్తారు. జరంగీ భాయిజాన్ తర్వాత చాలా పాత్రలు వచ్చాయి. అయితే నేను ఒక మంచి పాత్ర కోసం ఎదురు చూశాను. అలాంటి సమయంలో అఖండ 2 అవకాశం వచ్చింది. లెజెండరీ నందమూరి బాలకృష్ణ గారితో నటించడం ఒక గొప్ప అవకాశం. నేను ఇలాంటి అవకాశం కోసమే ఎదురు చూశాను. నేను బాలకృష్ణ గారి సినిమాలు చూశాను. భగవత్ కేసరి, వీర సింహారెడ్డి, డాకు మహారాజ్, అఖండ ఎలా ఎన్నో సినిమాలు చూశాను. అఖండ అద్భుతంగా అనిపించింది. బోయపాటి గారి డైరెక్షన్ అమేజింగ్. బాలకృష్ణ గారు వెరీ కూల్. ఒక లెజెండరీ యాక్టర్ తో కలిసి నటించడం అంటే మొదట చాలా నెర్వస్ ఫీల్ అయ్యాను. అయితే ఆయన చాలా కేరింగ్ పర్సన్. నన్ను ఎంతో ప్రోత్సహించారు. ఒక ఫ్యామిలీ మెంబర్ లాగానే చూసుకున్నారు. బాలకృష్ణ గారు వెరీ ఎనర్జిటిక్, అన్ స్టాపబుల్

దుల్కర్ సల్మాన్ "I'M GAME" ఫస్ట్ లుక్

కాంతతో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న దుల్కర్ సల్మాన్ పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్ టైనర్ "I'M GAME" మూవీతో అలరించబోతున్నారు. వేఫెరర్ ఫిలిమ్స్ సమర్పణలో నహాస్ హిధాయత్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ నైట్ క్లబ్, క్యాసినో బ్యాక్ డ్రాప్ లో స్టైలిష్ షూట్ వేసుకున్న దుల్కర్ రక్తం తడిసిన చేతితో గన్ పట్టుకుని ఇంటెన్స్ లుక్ లో కనిపించడం అదిరిపోయింది. ఈ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో మిస్కిన్, ఆంటోనీ వర్గీస్, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.



'దండోరా' మూవీ నుంచి లవ్ సాంగ్ వీడియో విడుదల

ఓ అబ్బాయి అమ్మాయిని ప్రేమించటం కష్టం కాకపోవచ్చు.. కానీ ఆ అమ్మాయి నుంచి ప్రేమ సిగ్నల్ అందుకోవాలంటే మాత్రం నానా తిప్పలు పడాల్సిందే. ఐ లవ్ యు చెప్పిన తర్వాత ప్రేయసి ఏమంటుందోనని పడే టెన్షన్ మామూలుగా ఉండదు. ఇలాంటి సమయంలో ప్రేమికుడికి ప్రేయసి ఓకే చెప్పేస్తే.. ఎలా ఉంటుంది.. అతని మనసు ఎలా ఊయల ఊగుతుంది. ఇద్దరు కలిసి ఎవరికీ తెలియకుండా కళ్లతో మాట్లాడుకునే మాటలు, సైగలు చూడచక్కగా ఉంటాయి. ఇంతకీ ప్రేమికులు పయనం ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటే మాత్రం 'దండోరా' సినిమా చూడాల్సిందేనంటున్నారు మేకర్స్. వైవిధ్యమైన చిత్రం కలర్ ఫొటో, బ్లాక్‌బస్టర్ మూవీ 'బెదురులంక 2012' చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందిస్తోన్న తాజా చిత్రం 'దండోరా'. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు పాత్రధారులు. మురళీకాంత్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రం డిసెంబర్ 25న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. రీసెంట్‌గా విడుదలైన టీజర్‌కు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. హ్యూమర్ టచ్‌తో పాటు మంచి సోషల్ మెసేజ్ ఉన్న సినిమాను మేకర్స్ మన ముందుకు తీసుకురాబోతున్నారనే విషయం తెలిసింది. ఇలా ఇప్పటికే డిఫరెంట్ ప్రమోషనల్ కంటెంట్‌తో ఆడియెన్స్‌ను అలరించిన 'దండోరా' నుంచి లేటెస్ట్‌గా 'పిల్లా...' అనే లిరికల్ వీడియో సాంగ్ రిలీజైంది.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200